



మహాభారతం


విచారణ

సుయోధనుడు









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!


స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

సుయోధనుఁడు

గ్రంథకర్త:

ఈ. శ్రీనివాసవరదాచార్యులు

ది మోడరన్ పబ్లిషర్సు (రిజిష్టర్డు)

తెనాలి :: బెజవాడ

1947

[వెల రు. 1-8-0

విషయ సూచిక

పుట.

సుయోధనుఁడు

వ్యాసాగమనము

ఆహా! కుటిలమతియై యీపిడ యెట్టి యకార్యమాచరించెను! ఇంతకాలము వేచియుండినది ఇంకఁ గొన్ని నాళ్ళోపిక పట్టియుండిన బాగుండెడిది కదా! పెద్దవాఁడనుగదా యని నామాటపై విశ్వాసముంచి యుండినఁ జాలమేలు గలిగి యుండును. తొందరపడి యింతలోనఁ దనముల్లె యేమి మునిఁగెనని యిట్లొనర్చెను? ఆఱు నెలల కాఱుకాయలు పండుచేన మూఁడు నెలలకు మూఁడు కాయలు పండకుండునే, యని కోఁత పట్టినఁ బ్రయోజనమేమి? ఈమాత్ర మెఱుఁగక యిట్టి యకార్యము సేయుట దీని తెలివి లేమిని బ్రకటించుచున్నది. పుత్రముఖ దర్శనమున నుత్కంఠ యుదయించిన నుదయించనిమ్ము. బావినీరు వెల్లువకుఁ బోవునే? విదియనాఁడు గానుపింపక పోయినను జంద్రుఁడు తదియనాఁడు గానుపింపక పోవునే? తొందరపాటు పెల్లకార్యములకును భంగకరమనుట యెఱుఁగక యిట్లాచరించెను. ఓరిమియుండిన నొక్కటికి నూఱింతలు ఫలము గలుగును. అవిమృశ్యకారిత యన్నివిధములఁ జెఱుఁగుకు మూలము.

ఒక్క యవసరపాటే యీకార్యమునకుఁ గారణము కాదు. అగ్నికి వాయువు దోడగులాగున అసూయయు దీనికిఁ గారణమగుచున్నది. తోడుకోడలికి సంతానము గలిగిన దీని కేమికొదువ గలిగెను? ఈదినము దానికిఁ గలిగిన రేపు

తనకుఁ గలుగకుండునా? ఈర్ష్యాగ్రస్త యగుటచే గర్భమునఁ గల పిండము బైటఁబడక యట్టె నిలువ దనుట తెలియ దాయెను.

ఔరా! పరోత్కర్షాసహిష్ణుత ఎంతకుఁ దెచ్చెను! ఇది దీని మేలుకుఁ గాఁజేరదు. తొందరపాటునఁగదా వినతకు దాస్యమబ్బెను? అత్యుత్కటములగు పుణ్యపాపముల ఫలమిచ్చటన యనుభవింప వలయును. కావని తొలఁగఁ ద్రోసినచో అది తనఫలము నీకుండునా? తెలియక కాఁకిన నిప్పు కాల్చకుండునా? ఎప్పటి సంగతియో తడవ నేల? ప్రస్తుత మీ మాంసకోశ ముపయోగశూన్య మగునదే కదా! అట్లని యూరకుండుట భావ్యము కాదు. దీని నెట్లేని సరిపఱచియ తీఱవలయును.

అని యిట్లాలోచించుచు హస్తినాపుర రాజాంతఃపురములోని కొక యోగి ప్రవేశించుచుండెను. అతని కపిల గడ్డమును కపిల జడలును కపిల నేత్రములును అతని మోమున కొక వింతసోయగ మొసఁగుచుండెను.

యోగి యంతిపురిలోనఁ జొచ్చినంతన యావత్తు చెలుల మూలమున వినిన యొకవనిత తన చెలులు చేయిఁబట్టి దారిచూపఁగ ఆప్రదేశమునకు వచ్చెను. ఆవిడ యేలొకో నేత్రపట్టము గట్టుకొని యుండెను. వచ్చిన యామె యాయోగికి నమస్కరించెను. అతఁ డామెకు దీవెన లొసఁగి;

“అమ్మాయీ! అసూయ యెట్టివారికైనను దగదనుట తెలియక యెట్టి క్రూరకార్యము చేసితివి? గర్భపాత మెంతటి

పాపావహ మగునదో తెలియునా? దీనఁ గలుగఁబోవు కీడు నీ వెఱిఁగి యుండిన నిట్లొనర్చియుండఁ జాలవు. జరిగిన దానికి వగచిన ఫలమేమి?"

"స్వామీ! నా కోడలికి సంతానము గలిగెనని విని నే నుదరతాడనము గావించుకొనిన మాట వాస్తవము. దుఃఖాకులయగుటచే గర్భపాత మగుననుట యెఱుఁగక యిట్టి యకార్య మాచరించితిని. ఇట్లు మాంసకోశము వెలువడునని నే నూహింపనైతిని. అజ్ఞానమున నాచరించిన యీ యకార్యమును క్షమించి నన్నుఁగాపాడ వలయును. ఎట్లైనను దీనిని సఫలము గావింప వేఁడెదను. దేవరవారు దలఁచినఁ గానిపని యొకటి గలదే?"

"తాముచేసిన కర్మను తామనుభవింపవలయును. కాఁబట్టి నీకిట్టి తలంపు గల్గెను. 'బుద్ధిః కర్మానుసారిణీ' యనికదా పెద్దలు వచించెదరు?"

"అఘటితఘటనా సమర్థులగు దేవరవారు తలఁచినచో ఇది యొకపాటిదా?"

"నా సామర్థ్యము విధివిధానమును మార్పఁగలదా!"

"స్వామీ! నేనాచరించినది తప్పే యగును. కాని పామ రాల నగుటచే నేనొనర్చిన యపరాధమును పెద్దవారలగు మీరు మన్నింపవలయును. ఉదారబుద్ధు లిట్టివి గణన సేయరు గదా! నాయందు నిర్హేతుకమైన దేవరవారికి వాత్సల్యము కలుగుట లేదా? కాఁబట్టి యెట్లైనను మీ రీకార్యము సరిచేయవల

యును. వ్యాసమహర్షి యనుగ్రహమునఁ గౌరవవంశ మభి వృద్ధమయ్యె నను ఖ్యాతి మీమూలమునఁగదా స్థిరపడియున్నది.”

“బాలా! నీవాడీపలాకున నది నాకును వ్యథనిచ్చునదే యైనను నేనిందుల కేమిచేయఁగలను? ఈశ్వరేచ్ఛ యిట్లుండ నది జరుగక మానునా? ప్రస్తుత మీ మాంసకోశమును నేకోత్తరశత ఖండములు గావించెదను. వాని వేఱువేఱుగా నేతి కుండల వేయింపుము. అప్పుడప్పుడు చన్నీటఁ దడిపించు చుండునది. కట్లొక్కరెట్టుచే నూర్గురు కొడుకులును ఒక్క కూఁతురును బుట్టుదురు.”

“ఆహా! సంతానోత్పత్తిని గుఱించిన చింత మానెను. కాని—”

అనిపలికి యామె వినత హైనఁబలుకుట కించుక సంశయించు చుండెను. వ్యాసుఁడు, నామె భావమును గ్రహించి ;

“గాంధారీ! నీయగ్రసుతుఁడు జననమాదిగ సకల సౌఖ్యముల ననుభవింపఁగలఁడు. రాజరాజ బిరుదాంకితుఁడు కాఁగలడు. భూమండలమెల్లను ఏకచ్ఛత్రాధిపతియై యేలఁ బోయెడివాఁడు అతని సోదరులును మిక్కిలి యనుకూలురై యుండఁబోదురు. ఇట్లు నీ సంతతి యంతయును అత్యంత విభవముతో నుండఁగలదు. ఇంతటితో సంతోషింపుము. ఇంక నధికము నడుగఁ గోరకుము. తపోవృత్తి నుండువారము మేమింతఁ దడవుంట యుక్తము కాదు.”

అని యామాంసకోశమును నూటయొక్క ఖండములు గావించెను, 'వాని జాగరూకతతోఁ గాపాడుచుండవలయు' నని యాజ్ఞాపించెను. అవల గాంధారిని వీడ్కొని వ్యాస మహామునీంద్రుఁడు తపోవనమున కరిగెను. గాంధారి తనయుల యాయుర్దాయమును గుఱించి మహర్షి తెలుపకుండినందుల కించుక చింతించెను. ఏకచ్ఛత్రాధిపతియగునని వ్యాసుఁ డనుగ్రహించి యుండుటచేఁ జిరకాలము జీవించియుండఁ గలఁడని భావించి సంతసించెను అతని యానతిచొప్పున ఆఖండముల నేతికుండలలో నైచి యతి జాగరూకతతోఁ గాపాడుచు వానినుండి బిడ్డలుగలుగు సమయమును నిరీక్షించుచుండెను.

కుమార సంభవము

వ్యాసమహర్షి యరిగిన కొన్నిదినముల కావల ఆ మాంసఖండములలో ఒక్కదానినుండి పుత్త్రుఁ డొకఁడుద యించెను వాఁడు సర్వాంగసుందరుఁడై యుండెను. వాని జననకాలమున ఆకసమునుండి నక్షత్రములు రాలెను. సూర్యుని కాంతి తగ్గెను. నక్కలు కూయుట కారంభించెను. భూమి యదురఁ దొడఁగెను. ఇట్టియుత్పాతములు గాంచి గాంధారీ ధృతరాష్ట్రులు చింతించుచుండిరి. అప్పుడు విదురుఁడు వారి చెంతకువచ్చి ;

విదుర:—అన్నా! నన్ను మన్నించి నామాట వినుము. వ్యాసానుగ్రహమున నూటయొక్కండ్రు గలుగఁ బోయెడి వారలు కదా! వారిలో నొక్కండుండినను లేకున్నను శోచనీయము కాదు. ఇప్పు డుదయించిన యుత్పాతముల మూలమునఁ గురువంశమున కెల్లను ఎద్దియో యిక్కట్టు గలుగఁ బోయెడి నని తోఁచుచున్నది. 'త్యజేదేకం కులస్యార్థే' యనుట మీ రెఱుఁగని యంశము కాదు. అంగప్రాంతములలో ఒక్కదానఁ దుర్వ్యాధి యుదయించినఁ జికిత్సకుఁడు దానిని ఛేదించి శేషించిన యంగములఁ గాపాడుచుండుట లేదా?

ఇదివిని గాంధారీధృతరాష్ట్రు లత్యంత విషాదాకులులైరి. కన్నకుమారునిపైఁ గనికరము మాని కాలుని పాలి కనుపుటకు వారికి మన సొప్పకుండెను. వీనివలనఁ గురువంశమున కంతయును ఎచ్చట హానికలుగునో యను భీతి యొకవైపున బాధించుచుండెను. ఏమి చేయుటకును దోఁచక వారు చింతించు చుండునపుడు శకుని యచటికి వచ్చెను. విదురుఁడు వచియించిన దంతయు వారిమూలమునఁ దెలిసికొనెను. అంత ధృతరాష్ట్రుని ఇంచుక యావలికిఁ బిలిచికొని వెడలి;

శకుని:—బావా! విదురుఁ డాదినుండియుఁ బాండుపక్షమవలంబించి యుండువాఁడు. నీతనయుఁడు రాజరాజ బిరుదముతో నేకచ్ఛత్రాధిపతియై భూమండలము నేలినఁ బాండురాజ తనయునకు ఎచ్చట రాజ్యము లేకపోవునో యని యెంచి యిట్లాడుచున్నాఁడు. నైసర్గికము లగువానికి నుత్పాతములని పేరుపెట్టి, ఎట్టిసంబంధము లేని నీకుమారుని

జననమునకును వానికిని ముడిపెట్టుచున్నాఁడు. వీఁడును నీవలె వ్యాసానుగ్రహమున జనించిన వాఁడగుటచే జ్ఞాతివైర మును నీయెడఁ జూపుచున్నాఁడు.

ధృతరాష్ట్రు:-నీ వాకునదంత యుచితము కాదు. నక్షత్ర పతనాదికము నైసర్గికమే కానిమ్ము. శాస్త్రపద్ధతి నది యుత్పాతమే యగును. వీని జనన కాలముననే యీ యుత్పాతములు గలుగుట లేదిరో విశేషముండునని యెంచెదను. కులనాశకుఁడుగా నుండుటఁబట్టియే విదురుఁ డిట్లాడియుండ నోపును. ఇతఁడు న్యాయశీలుఁడు. ఇతని మాటలు దప్పక విశ్వసింపఁ దగినవి. కౌరవజ్యేష్ఠుఁడిప్పుడు పాండుసుతుఁడ యగును. అట్టియెడ రాజ్యపాలనమున కాతఁడ యర్హుఁడగును. అట్లుండ వానికెచ్చట రాజ్యము రాకతక్కునో యనుచింత యాతనికిఁ గల్గ నవసరము లేదు గదా! అట్టియెడఁ బాండుపక్షపాతియై ముసి వేయు చున్నాఁ డనియు, జ్ఞాతివైరము చూపుచున్నాఁడనియు నీవాతనిపై నిందమోపుట సరికాదు.

శకుని:-బావా! నీ యీమాటలు నాకించుకయు రుచించుటలేదు. తన్నుమాలిన ధర్మమును మొదలు చెడిన బేరమును గలదా?

ధృతరాష్ట్రు:-అన్యులసొమ్ము కాసపడిన లాభమేమి? జ్యేష్ఠుఁడగు పాండుసుతునకుఁ జేరవలసిన రాజ్యము మన మపేక్షించుట యన్యాయము. లాతు లిడివినిన మనల దూఱుదురు.

శకుని:- జ్యేష్ఠునకే రాజ్యాధికార ముండినయెడల మొన్నటివఱకుఁ బాండురాజు రాజ్యమేలుట యెట్లుసంభవము!

ధృతరాష్ట్రః- నే నంధుఁడనగుటచే రాజ్యపాలనమున కశక్తుఁడ నైతిని. కాఁబట్టి నాకు మాఱుగ నాతమ్ముఁడు రాజ్యమేలుచుండెడివాఁడు.

శకుని:- రాజ్యము మీదగునపుడు మీవంశమునకే పరిపాలనాధికారము గలదు. వ్యాసానుగ్రహమున నీకింకను గుమారులు జనించెదరు. కాఁబట్టి వారిలోన నీతఁడే జ్యేష్ఠుఁడు. కావున నీతఁడే రాజ్యమును బరిపాలింప నర్హుఁడు. ఇప్పుడెవరి మాటలు న్యాయబద్ధములో యాలోచించితివా! ఇంకనైన నాదారికి రమ్ము.

ధృతరాష్ట్రః- నీ వెంత చెప్పినను నామదికది నచ్చుట లేదు. ఇంతకును ఇప్పుడా చింతయేల? అప్పటిమాట చూచుకొందము.

ఈ మాట లాలకించిన శకునియు రాజించుక దారి బడినటుల భావించి సంతసించెను. అంత వారటనుండి కదలిచనిరి.

బాలక్రీడ

"అన్నా! ఇన్ని దినములు మనమెన్నియో యాటలాడి యుంటిమి కాని యన్నిటికంటె మిన్నయగు నొక్క యాట యందు నాకభిలాష యుదయించెను. దానిఁ దెల్పవలయు నని నీ వేమందువో యని యించుక సంకోచించుచున్నాను."

"భీమసేనా! నీ కోరిన యాట యెట్టిదియో తెలుపుము. నేనందుల కడ్డము సెప్పఁబోయెడి వాఁడను గాను."

"అన్నా! నీ వెప్పుడును మాకుఁ బ్రియము సేయు వాఁడవనుట నాకుఁ దెలియదా! నా పలుకులు వినిన దర్పోద్ధతుఁడని యందువేమో యని యెంచి యట్లంటిని."

"క్షత్రియుఁ డెప్పుడును దర్పోద్ధతుఁడై యుండవలయును. అది కొనియాడఁ దగినదే కాని నిందార్హ మెట్లగును? ఇంక నీ వెఱిఁగింప నెంచినదానినిఁ వివరింపుము."

"ఈ యాటయందు మీరు మహారాజులు గావలయును. ఇదె కాన్పించు నీ యశోకవృక్షపు టడుగుభాగము మీకు సింహాసన మగును. నేనును బార్థుఁడును మంత్రుల మయ్యెదము. నకుల సహదేవులు మీ కంగరక్షకులగుదురు. దుర్యోధనుఁడు ద్వారపాలకుఁడు గావలయును. దుశ్శాసనాదులు సేవకులు గావలయును."

అభిమానధనులగు నా సుయోధనాదు లిది విని యాగ్రహోదగ్రులైరి. అంతఁ దుశ్శాసనుఁడు;

"పవనతనయా! మహారాజ కుమారుఁడగు మా యన్న రాజు కావలయును. మేము మంత్రులము గావలయును. అబ్బ చావఁగ గతిలేక తల్లితోడ మాయింటికి వచ్చి మాయన్నము దిని బ్రతికెడివారు మీరు రాజును మంత్రులు నగుటెట్లు? ఆటయేకదాయని మే మీనాదిన మూరకుండిన రేపు వాస్తవముగ నట్లే కాఁగలరు. కాఁబట్టి మే మీ యాట కొడఁబడఁ జాలము. నీవెల్లపుడును మాకుఁ గష్టములే కలిగించుచుందువు. నీప్రవర్తన మించుకయు బాగుండుటలేదు. తిన్నయింటి వానములు లెక్కిడు వానిఁబోలె మాయన్నముదిని మాకే యపకారము సేయుచుందువు. నీ సేఁతలు మా కెంత యాగ్రహము గలిగించుచుండినను బాపతుగతికులు గదా యని యెంచి యూరకున్నవారము. మేమటు మిన్నకుండు కొలఁదిని మీఱుచున్నవాఁడవు. ఇంక నిట్లాచరించిన మా క్రోధమునకుఁ బాత్రుఁడ వగుదువు. 'ఇనుముఁగూడి యగ్గికి సమ్మెటపెట్లన్న' లాగున నీతోఁగూడి నీసోదరులును జెడఁగలరు. తుదకు మీ బ్రతుకుకే హాని రాఁగలదు.

"తమ్ముఁడా! వానితోనేల మాటలు పెంచుకొనెదవు? పట్టాభిషేకార్హుఁడను నేన కాఁబట్టి యందులకై యిప్పుడు పెనఁగులాడవలసిన యవసరము గాన్పింపదు. వాని యన్న ఆటనవమునకైన రాజుగానుండ నిమ్మనుట ఆతని ఆశయము. దానినేల నీవు విరోధించెదవు? ఈవిహారముచే నైనను వానికిఁ గొంచెము మనస్సంతుష్టి గలుగనిమ్ము."

యైనఁ బ్రజలు సహింతురే? ప్రజాను రంజకుఁడు కానినాఁడు వాని రాజనామము ఋజ సమాఖ్య మేమగును. కలవడిన లాగున నిరర్థకమే కదా?''

''సోదరా! నీకాతని శౌర్యము తెలియదు. పరాక్రమమున నీతో సమానుఁడని భావింపుము. నీవలె నుద్ధతుఁడు గాక గంభీర స్వభావుఁ డగుటచే నీకాతని బలము తెలియకున్నది. ప్రసక్తమయినపుడుకదా యది యెఱుఁగనగును? సోదరులారా! ప్రొద్దుగుంకఁ బోవుచున్నది. నేఁటి కింక ఏవిహారమును వలదు. తిన్నఁగ గృహముల కరుగుదము రండు.''

అని ధర్మరాజు రాజపుత్త్రులెల్లరఁ బిలుచుకొని నిజ గృహమునకుఁ జనెను. దుర్యోధనుఁడు మాత్రము భీముని యాహతిచేతను అంతకంటె వేయిమడుఁగు లధికమగు నాతని వాక్శరముల నిహతిచేతను మిక్కిలి కుపితుఁడయ్యును ధర్మజుని వాక్యములఁ గట్టువడి మంత్రరుద్ధమగు సర్పము లాగున లోలోనఁ దపించుచు నతని వెంట నరిగెను.

దురాలోచన

ఒక్కనాఁటి యుదయమున శకుని దుశ్శాసనాదు లొక్కెడ ఏకాంతగృహము సేరి. సుయోధనుని మోము వాఁడుబాఱి యుండెను. అప్పుడు శకుని యాతని చెంతఁజేరి;

శకుని:—రాజకుమారా! నీమోమేల వాడియున్నది? నీకింతటి దుఃఖముదయించుటకుఁ గారణమేమి?

సుయోధన:—మామా! వృకోదరుఁడు మాకుఁ గల్గించు బాధలు నీకుఁ దెలియవా? అవిగాక నావ్యధకింక వేఱు కారణము గావలయునా? వాని నేమిసేయుటకును వీలుగాని లాగున ధర్మపుత్త్రుఁ డడ్డపడుచున్నాఁడు. నే నాతనిమాటల నిరాకరింపలేక యూరకుండవలసి వచ్చుచున్నది.

శకుని:—భీముఁడు మిము బాధపెట్టుచుండుట యిప్పుడు క్రొత్తగాదుకదా? అట్లుండ ఇన్ని దినములనుండి కలుగకున్న యీవిషాదము నేఁడుదయింప నేమి కారణము?

సుయోధన:—ధర్మజుని రాజుగావించి తానును పార్థుఁడును మంత్రులగుచుండ మేమెల్లరము వారికి దాసానుదాసులమై వర్తింపవలయునని యాతని యభిప్రాయము. నిన్న సాయంకాలమాటనెపమునఁ దనభావము వెల్లడిపఱచెను. కట్టువాఁడు దుశ్శాసనుఁ డాతనితో నావిషయమున వాదులాడఁ దొడఁగెను. నేనద్దాని నాఁపఁబోవ నాశిరమునఁ దనపిడికిట దెబ్బవైచెను. నాకాగ్రహము జనించి వానిపైఁ

బడఁబోవుచుండ ధర్మరా జడ్డుపడి నా ప్రయత్నమును మాన్పెను. ధర్మసుతుని మాటల నిరాకరింపలేక యూరకుంటిని గాని యాగ్రహము తగ్గకున్నది. దాని మూలముననే నాకీయవస్థ సంప్రాప్తమైనది.

శకుని:— అజాతశత్రుని మాటల నీ వేల సరకుసేసెదవు? అతఁడు దనసోదరుల కపాయము గలుగకుండుటకై కదా యుద్ధము వచ్చుచుండును? అట్టివానిమాటలనా గౌరవింపవలయును?

సుయోధన:— నీ వాడినలాగున నతఁ డజాతశత్రుఁడగుటయే నేనాతని మాటల నిరాకరింపలేక లొంగిపోవుటకుఁ గారణమగుచున్నది.

దుశ్శాసన:— అతఁడంతటి ధర్మశీలుఁడైనఁ దన తమ్మునకు బుద్ధిసెప్పి మనల నెన్నఁడును వాఁ డెదిరింపకుండు లాగునఁ జేయరాదా? భీముఁడు మనకపకారములు గావించుచుం డూరకుండి మన మందఱకు బహులుసేయఁ బూనుచున్నను కదా యుద్ధ వద్దనుచున్నాఁడు! దీనిమూలమున నాతని పక్షపాతబుద్ధి స్పష్టముగాఁ దెలియవచ్చుటలేదా! అట్టివాని మాటలకు మన మేల గౌరవ మీయవలయును? నాకాజ్ఞ యిమ్ము. అఱనిమిసములో భీముని జంపఁగలను. నీ విట్లింతకాల మూరకుంటివను వాఁడు సన్మార్గమునఁ బడఁజాలఁడు. నిక్కముగ వానిఁ జంపకుండిన రాజ్యము మనకుఁ దక్కదు. భీముఁడు మరణించిన ధర్మజుని నిర్బంధించి మన వశమున నుంచుకొనవచ్చును.

సుయోధనః—సోదరా! బాలుఁడవగుటచేఁ దొందరపడి యాడుచున్నావు. ఒకని హింసించుట యెంతటిదోషమునకు మూలమగునట తెలిసియుండిన నీవీలాగున వచింపకుందువు. శత్రువునుబట్టి మానభంగము గావించి యాతఁడెప్పుడును గాపథమునఁ బ్రవర్తింపకుండులాగునఁ జేయుటయే తగవు.

దుశ్శాసనః—జ్ఞాతులయెడఁ బ్రీతినుంచుట నీతిగాదు. 'జ్ఞాతిశ్చేదనలేనకి' య్మనుట నీ వెఱుఁగవా! మన మెన్నండును జ్ఞాతివైరము కారణముగా సోదరుల వీడి పరులఁ జేరలేము.

వికర్ణః—అన్నా! నీ వాడునది యుక్తము కాదు. సోదరుఁ డైనను జనకుఁడైనను దుష్టుఁడైన వాని వీడుట ధర్మము. సద్గుణుఁడు శత్రుపక్షమువాఁడైనను వాని సాంగత్య మవశ్యాపేక్ష్యము.

శకునిః—అబ్బాయీ! లోకానుభవ శూన్యుఁడ వగుటచే నీవీలాగునఁ బలుకుచున్నావు. మొదటినుండి భీముఁడు మనయెడ విరోధమునే పాటించుచున్నాఁడు. మన సొమ్ము దినుచు మనకు భంగము గల్గించుట నీతి విదూరము గదా? ఇట్టి నీతిబాహ్యునకుఁ దగుదండము విధించుట దైవ సమ్మతము.

దుశ్శాసనః—తప్పునకుఁ దగినశిక్ష విధింపవలయుననుట భావ్యము. వాఁడాచరించిన యకార్యములకు వానిఁ జంపుటయే సరియగు శిక్ష.

సుయోధనః—ఎప్పుడును ఆలోచింపని పని సేయరాదు.
సి చేసినపని అన్నివిధముల జయము గాంచును.

విందః—ఇందాలోచన యేమియును జేయ నవసర ముండులాగున నాకుఁ దోఁచుటలేదు. మన మొకనిహింసింప నుపక్రమింపలేదు. మనల హింసించువానికిఁ బ్రతిక్రియ సల్ప నెంచితిమి. ఎట్టివానికిని ఆత్మసంరక్షణ మవశ్యకర్తవ్యము. పులి మనపైఁబడ వచ్చుచుండ జంతుహింస పనికిరాదని యూరకుండిన అది మనలఁ జంపదే?

సుయోధనః—ఆత్మరక్షణ మవశ్యకర్తవ్య మనుమాట వాస్తవమే, అయినను 'నింద మోయుట కంటె ముండ మోయుట యుత్తమ' మనుట తెలియదా? లోకులు న్యాయాన్యాయముల విమర్శింపక 'వాఁడు క్రూరుఁడు, అకారణముగ నొరుని హింసించెను' అని యాడికొందురు. వారినోటఁ బడకుండుట కుపాయ మేమగునని యాలోచించితిరే?

అనువిందః—ఇది యకారణ మెట్లగును? మనలఁ బెక్కురీతుల వాఁడు బాధించుచుండుట కారణము గాదె!

సుయోధనః—బాధకుఁ బ్రతీకారము హింసయా? ఇది యన్యాయము కాదా! అట్లుండ లోకులేల దూషింపకుందురు?

దుశ్శాసనః—భంగపాటు యావజ్జీవ తీవ్ర వేదనాకరము. మరణమాపాత యాతనావహము. కాఁబట్టి ఒకనిఁ జంపుట కంటె భంగపెట్టుట యత్యంత దోషావహము. పాప కార్య మాచరించినవానిఁ జంపుట వాఁడు చేసిన యపరాధమునకుఁ జాలినంత శిక్షగానేరదు. అయినను ఇంతకంటె విధించుటకు వేఱుశిక్ష లేనందున ఈదండనము గావింపవలసి వచ్చుచున్నది.

అదియునుగాక, ఎంతటి మహాపాపములో నాచరించిన వారికిం గని ఒకరులం గష్టపెట్టునట్టి నీచజన్మము గలుగంబోదు. అట్టి వారిం జంపిన వారిని ఆ పాపమునుండి తొలంగించినవార మగుదుము. పాము, తేలు మున్నగునవియును ఆకోవం జేరినవియే కదా. 'మా దేశ సానుకసిన్యశ్చ నస్వహత్యా,' స్మృతి కదా పెద్దలందురు. కాబట్టి సూయోధనుని భీమునిం గడ తేర్చుట దోషావహము కాదు. ఇంక న్యాయాన్యాయ విమర్శనా జ్ఞానము లేని లోకులు నిందింతురనియెదవా మీరాడితిరి! గుప్తముగా వానిని సంహరించిన ఎవ్వరెఱుంగంగలరు? కావున ఆభయము మన కవసరము లేదు;

శకుని:—బాలుండైనను దుశ్శాసనుం డాడునది న్యాయ యుక్తము. 'యుక్తియుక్తం వచో గ్రాహ్యం బాలాదపి శుకాదపి' యనులాగున పిన్నమాట లాదరార్హములు.

సుయోధనః—మీరేమి చెప్పినను ఇది హింస కాంజాల దని నాకుం దోంచుట లేదు. మీ మాటల చొప్పున హింస కాదని భావించినను మనము తలంచు లాగునం గార్యములెల్ల గొనసాగు ననుట నిశ్చయము గాదు. మన మొకటి తలంచిన దైవ మొకటి తలంప వచ్చును గదా? కార్యహాని యైనచో వానితోడి పగను మఱింత యభివృద్ధము గావించుకొనిన లాగునం గదా యగును!

శకుని:—నా యుక్తి యెప్పుడును రిక్తగానేరదు. నా వైచు పాచిక గెలుపొందియు తీఱును. నీ కేలాటి సంశయమును వలదు.

సుయోధనః:—మామా! నీయిచ్చుచొప్పునఁ గార్యము నిర్విఘ్నముగాఁ గొనసాగు ననియే యెంచుము. ఇట్టి వెంత గుప్తముగా నాచరించినను జాల కాలము దాఁగి యుండఁ జాలవు. ఎప్పటికైన బయలుపడఁ గలవు. అప్పుడు 'సుయోధనుఁ డన్యాయాగ్రస్తుఁడై భీమునిఁ జంపించె' నను జనోక్తి స్థిరముగా నిలుచును. నే మృతినొందినను నాచరితము సెప్పుకొను వారు నను నిందింప కుందురా? వేనుఁడు మృతినొంది యెంత కాలమయ్యెను? జను లిప్పటికిని వాని చరిత్ర మెత్తిన నిందావాక్యము లాడుచున్నారు గదా! రేపు నాచరిత్రమును అట్లే కదా కలుషితము కాఁగలదు?

శకుని:—అల్లుఁడా! 'లోకోభిన్నరుచి' యనుట యెఱుఁగవా? దూషించువారు కొందఱుండిన భూషించు వారును కొందఱుందురు. గర్వముచే నకారణముగ నొరుల కిడుములు గల్పించు వారికిని, ఆత్మరక్షణమునకై యుపకారిని హింసించు వారికిని భేదము గుణగ్రహణదక్షులగువారు కనిపెట్టఁ జాలక పోవరు. మఱియు వానిఁ జంపుట లోకోపకారము నగును. ఎట్లన? ఈదినమున మనల భంగపఱుప వచ్చి రుచిఁ గన్నవాఁ డగుటచే ఇట్లే అనేకులకు భంగము గలిగింపఁ దొడఁగును. వాని నిప్పుడే నిర్మూలము గావించిన జనులను ఆకష్టమునుండి తొలఁగించిన వార మగుదుము.

ఈమాట లాలకించిన సుయోధనుని భావ మించుక మాఱఁ దొడఁగెను. 'నబోధనాత్పరాశక్తి' యనుట నిక్కము గదా! రాముని నిజసుతుకంటె నెక్కుడుగాఁ జూచుచుండిన

కైకేయి మంధర బోధన మూలముననేకదా యడవులపాలు గావించెను! సుయోధనుని యీ యర్థాంగీకారమును ఆధారము గావించుకొని యాతని సోదరులు భీము సంహారమునకుఁ దఱి వేచియుండిరి.

విద్యాపరీక్షణము

కౌరవులు భీముని సంహరింపఁ బలువిధములఁ బ్రయత్నించిరి. అలసి నిద్రించుచున్న వానిఁ బంధించి గంగలోఁ ద్రోసిరి. నీటిలోఁ బడుచుండు భీముఁడు మేల్కాంచి ఆ కట్లములఁ ద్రెంచుకొని జలమునుండి వెలుపలికి వచ్చెను. మఱి తుఁడబు నాతని సర్పములచేఁ గఱపింపఁ బ్రయత్నించిరి గాని ఆసర్పము లాతని గాటువైనఁ జాలవయ్యెను. అప్పుడు మేలుకొనిన వాయుసుతుఁడు పాములఁ దన కాలఁ జమరిచంపెను. సారథియగువాని యమపురి కంపెను విష మిశ్రాన్నము పెట్టించిరి అదియు జీర్ణమయ్యెను. ఇట్లు పెక్కుమారులు భీము నేముఁ జంపఁ బూనిరి. కాని వీరి ప్రయత్నము లెల్ల వ్యర్థములైనవి.

భీష్మునకు వీరొనర్చునవి యెల్లఁ దెలియక పోయినను కౌరవ పాండవులకుఁ బరస్పరము విరోధము గలదనిమాత్రము అతఁడు గ్రహింపఁ గలిగెను.

"రాజ్యపాలనమున నైకమత్యము ముఖ్యము. ఇట్లు పరస్పర విరోధములుండిన ఆరాజ్యము బాగుపడఁ జాలదు. ప్రజలకును ఆపాలనమువలన సౌఖ్యముగలుగఁ జాలదు. ఇట్లు వీరి కన్యోన్యద్వేషముగలుగుటకుఁ గారణము విద్యావిహీనతయే యగును. విద్య యుండినచో వివేక మభివృద్ధియగును. జ్ఞానవంతు లెవ్వరును గ్రహింపరు. వీరి చదువు విషయమున నేను జోక్యము కలిగించుకొన కుండుటచే వీరిట్లగుచున్నారు. దోషము నాయెడనుండ నొరుల దూషించిన లాభమేమి?"

అని యాలోచనఁ దలఁచి కురువృద్ధుఁడు కృపాచార్యులను బిలిచి, 'బాలురకు విద్యాదానముచేసి ధన్యుల గావింపవలె' నని వేఁడుకొనెను. తాను నప్పుడప్పుడు వారికి రాజనీతులఁ గఱపుచుండెను.

రాజపుత్త్రులు కృపాచార్యునొద్ద ధనుర్విద్యాభ్యాస మొనర్చుచుండిరి. అంతఁ గొంతకాలమునకు ఆతని బావ ద్రోణాచార్యులు హస్తినాపురమున కరుదెంచెను. భీష్ముఁ డాతని పాండిత్యము దెలిసినవాఁ డగుటచే అతనిఁ దన మనుమల కస్త్రవిద్యా గురువుగా నేర్పఱచెను. రాజకుమారు లాతనియొద్ద ధనుర్విద్య నేర్చుకొనుచుండిరి. అస్త్రవిద్యాభ్యాసమునఁ గర్ణార్జును లొండొరులఁ మీఱఁ దలఁచుచుండిరి. కాఁబట్టియే కర్ణుఁడు సుయోధన పక్షపాతి యయ్యెను. ద్రోణకుమారుఁ డశ్వత్థామయుఁ బార్థుని యస్త్రవిద్యా నైపుణ్యముగాంచి యీర్ష్యాళుఁడాయెను. ఆకారణమున వాఁడును

సుయోధన పక్షపాతి యయ్యెను. అదినుండియుఁ గర్ణార్జునులకును భీమ సుయోధనులకును విరోధము పెరుఁగుచుండెను.

ఒక్కనాఁడు ద్రోణాచార్యుఁడు రాకొమరుల యస్త్రవిద్యాకౌశలము గాంచవేఁడి కృత్రిమమైన పక్షి నొకదానిని భాసమను పేరుగల దానిని వృక్షశాఖాగ్రమున రచించి దానిని దనశిష్యుల కందఱకును జూపి,

ద్రోణః:— బాలకులారా! మీమీ ధనువుల బాణముల సంధించి సిద్ధముగ నుండుఁడు. నే నెవ్వని నాజ్ఞాపింతునో వాఁడప్పు డాపక్షితలఁ దెగవేయవలయును.

గురువు నానతిచొప్పున వారెల్లరును సంసిద్ధులైయుండిరి. ద్రోణాచార్యులు మొట్టమొదట ధర్మరాజును బిలిచి;

ద్రోణః:— యుధిష్ఠిరా! ఆవృక్షమునందున్న పక్షినిఁ జూచితివా!

ధర్మరాజుః:— చూచితిని.

ద్రోణః:— ఆపక్షిని నన్నును నీసోదరులను చూచితివా?

ధర్మరాజుః:— చూచుచున్నాఁడను.

ద్రోణః:— నీదృష్టి చెదరియున్నది. నీవీపక్షితలఁ దెగనేయఁజాలవు. కాఁబట్టి [illegible].

అని యీప్రకారము ఫల్గుని దక్కఁ దక్కిన వారలనెల్లఁ బ్రశ్నించెను. అందఱును దమదృష్టి పక్షిమీఁదనె వ్యాపించి యున్నదని చెప్పలేకపోయిరి. ద్రోణుఁడు

వారినెల్ల మీకీకార్యమున కసమర్థులని నిరాకరించెను. తుద కర్జునుని రావించి ;

ద్రోణః—పార్థా! ఆవృక్షశాఖాగ్రమున నున్న పక్షి శిరమును గాంచితివా!

అర్జునః—చూచితిని.

ద్రోణః—ఆపక్షిని నీసోదరులను నన్నును జూచితివా?

అర్జునః—పక్షిశిరము దక్క వేఱేమియు నాదృష్టికి గోచరించుటలేదు.

ద్రోణః—నీవే గురి తప్పని వాఁడవు. కాఁబట్టి నీ బాణమున పక్షిశిరమును ద్రుంపుము.

అర్జునః—దేవరవారి యానతిచొప్పున నేనాచరించెదను.

అని తనచేతి బాణమున దానితలఁ దునిమెను. పాండవులాకార్యముఁ జూచి సంతోషము నొందిరి. కౌరవుల కది దుఃఖావహ మయ్యెను. కర్ణున కత్యంతము అసూయ యుదయించెను. మున్నె ఫల్గునునిపైఁ గలద్వేష మప్పటినుండి యభివృద్ధమయ్యెను. నాఁటిమొదలు సుయోధనుని యొద్దఁ గొండెములు చెప్పుచుండెడివాఁడు. వీని యుపదేశమున సుయోధనుఁడు మానసము మార్పు నొందఁ దొడఁగెను.

అస్త్రవిద్యాసందర్శనము

అభ్యస్తవిద్యులగు రాజకుమారుల యస్త్రవిద్యాకౌశలముం జూచి ద్రోణాచార్యులు ధృతరాష్ట్రుని వేడుకొనెను. ఆచార్యుని వేడుకోలు ననుసరించి రాజు రంగస్థల నిర్మాణమునకై విదురున కాజ్ఞచేసెను. అతఁడు తగువిశాలమగు నొక ప్రదేశమున రంగస్థలమును నిర్మించెను. మధ్యమునఁ జతురాకృతిగా రంగప్రదేశము గావించెను. దాని చుట్టును బండిళ్లు వేయించెను. వానియందుఁ బ్రేక్షకులాసీనులగుట కనువుగా మంచెలఁ గట్టించెను. అవి సోపానములవలె ఒక్కదానికంటె నొకటి యెత్తుగా నుండెను. రాజకుటుంబములోని వా రాసీను లగుటకుఁ బెక్కు దివ్యాసనములు వేయించెను. ధృతరాష్ట్రుఁ డాసీనుఁడగుటకై యొక సింగపుగద్దియ యమర్చించెను. స్త్రీలకొఱకుఁ బ్రత్యేకస్థల మొకటి యేర్పఱచెను. రంగస్థలమున నొరులు ప్రవేశింపకుండులాగునఁ జుట్టును గఱ్ఱలనాటించి వానిచుట్టును త్రాళ్లు గట్టించెను. పందిట వితానములు గట్టించెను. చుట్టును తోరణములు గట్టించెను.

అంతనొక సుముహూర్తమున ధృతరాష్ట్రుఁడు భీష్మాది పరివృతుఁడై ఆసనమున కరుదెంచెను. గాంధారియుఁ గుంతి మొదలగు నంతఃపుర కాంతావర్గముతోడ నా ప్రదేశమునకు వచ్చెను. రాజపరివారమంతయును జయజయ ధ్వానములు సల్పుచు అచ్చటికి వచ్చెను. పౌరజానపదాదు లనేకులు ఆచోటి కేతెంచిరి. ఎల్లవారు సుచితాసనముల నలంకరించిరి.

అంతట ద్రోణాచార్యులు రంగస్థలమునకు వచ్చిరి. వారివెంట రాజపుత్త్రు లరుదెంచిరి. అఖిల విద్యార్థులు వచ్చినంత ద్రోణాచార్యులు "మీమీ యస్త్రకౌశల్యములఁ జూపుఁడు" డని యానతిచ్చిరి. కొందఱు కత్తిసామునందలి పటిమఁ జూపుచుండిరి. కొందఱు గుఱితప్పక యతివేగముగ బాణములు వేయుచుఁ దమ హస్తలాఘవము వెల్లడి చేయుచుండిరి. కొందఱు గదాయుద్ధమునఁ దమకుఁగల నైపుణిని విశదీకరించుచుండిరి. కొందఱు వాహనారోహణమున నందలి సామర్థ్యమును బ్రకటించుచుండిరి.

అప్పుడు భీమ సుయోధను లొండొరులఁదాఁకి గదాయుద్ధము సేయ మొదలిడిరి. ఒకరి నొకరు మీఱఁదలఁచి వారు సవ్యాపసవ్య చిత్ర మండల గతుల నడచుచుండిరి. నేర్పు మెఱయఁ బరస్పర ప్రహారములఁ దప్పించుకొనుచుండిరి. తక్కిన రాజపుత్త్రులు దానిఁగాంచి యాశ్చర్యపడుచుండిరి. ఆసమయమున అచ్చటఁగల రాజపుత్త్రు లొండొరు లిట్లు సంభాషింపఁ దొడఁగిరి.

అర్జున:—తమ్ముఁడా! సహదేవా! చూచితివా మన యన్నగారి కౌశల్యము! సుయోధనుని గదాఘాతమును దప్పించుకొనుటకు కాక మండలగతి నడచి ఆతని గద నేలఁగూల నేయ నుంకించుచున్నాఁడు.

దుశ్శాసన:—సోదరా! అనువిందా! చూడుము మన యన్నగారి నైపుణ్యము. భీముని ప్రహారములనుదప్పించుకొని యపసవ్యగతి నడచి యాతనిఁ బ్రహరింప సమకట్టుచున్నాఁడు.

నకుల:—ఆహా! సుయోధనుఁడు మా యన్నకుఁ జిక్క సిద్ధముగ నున్నాఁడు. తప్పక యవమానము పొందఁగలఁడు.

విజయ:—బళీ! పైఁబడనున్న దెబ్బను మా యన్న యెంత లాఘవమునఁ దప్పించుకొనెను? ఇది గదా కౌశల్యము!

సహదేవ:—అయ్యో! సుయోధనుఁడు మా యన్న దెబ్బనుండి తప్పించుకొనక ఆతనిఁ గొట్టఁబోవుచున్నాఁడు. ఏమి చేయుదుము?

దుశ్శాసన:—హటహటా! అన్నగారి గదాఘాతము గుఱితప్పి నేలపైఁబడెను గాదె! మా యన్న యిట్లు గుఱి తప్పుట దైవవశమునఁ గాకున్న ఇంక దేని వలన?

అర్జున:—దుశ్శాసనా! సాహసక్రియా హింసాపరుని యత్నము వ్యర్థ మనుట తెలియకున్నావుగా!

దుశ్శాసన:—ఓరీ! మా యన్న యసమర్థుఁడు? ఇది పట్టికల్ల. ఇంకొక క్షణమున నీ యన్న యేమి కాఁగలఁడో చూతువుగాక.

అర్జున:—ముంజేతి కంకణమునకద్దమేల కావలయును? రాను రాను బలమెవ్వరికిఁ దగ్గుచున్నదియో తెలియుట లేదా?

దుశ్శాసన:—బలహీనునివలె నభినయించినఁగాని శత్రువు సమీపింపఁడు. ఎదుటివాఁడు చెంతకు వచ్చినఁగాని వానిని లొంగఁదీసికొనుటకు వీలు లేదు. ఇది తెలిసియే మా యన్న యిట్లున్నాఁడు. ఇదియు నొక కౌశల విశేషమగుచున్నది.

అర్జున:—బాగు బాగు! ఏల జాతిహీన ఇదియొక తీరగు సామను వానిలాగున నాడెదవు. తగ్గివాఁడచ్చి నప్పటి మాట చూచుకొందువులే.

కర్ణ:—ఓరీ! వదరుపోతా! ఇది రంగస్థలము. వృక్ష శాఖాగ్రమున నుండు పక్షితలఁ ద్రెంచుట కాదు.

అర్జున:—గురిచూచి బాణము ప్రయోగింపనేరని వాని కింత నోరుండవలసినదే? చాలుచాలు నీ యాడంబరములు మాని యెచ్చటికైన నరిగి రథసారథివి గమ్ము.

వీరి సంభాషణము లాలకించి ద్రోణాచార్యులు ఎచ్చటి రంగభంగ మగునో యని భీతిఁ జెందెను. వెంటనే యశ్వత్థామను బంపి భీమసుయోధనుల గదాయుద్ధమును మాన్పెను. అర్జునుని బిలిచి నేర్చిన ధనుర్విద్యా కుశలతఁ జూప నాజ్ఞచేసెను. ప్రేక్షకులెల్లరును అర్జునుని యప్పటి యాకృతిఁ జూచి యాశ్చర్యపరవశులై పలువురు పలువిధములఁ గొని యాడఁ దొడఁగిరి.

"ఔరా! ఇట్టివానిఁ గనిన యాకుంతీదేవి యెంతటి యదృష్టవంతురాలు! మన్మథ వసంతాదుల మీఱు సౌందర్యమును, దానికంటె నెక్కుడగు గాంభీర్యమును, అంతకంటె నధికమగు నడఁకువయును గలిగి యొప్పుచున్నాఁడు."

"ఆహా! దుర్ధర్షప్రతాపుఁ డయ్యును ఎంత సుముఖుఁడుగా నున్నాఁడు. రోషప్రసాదములు రెండును గలిసి

యొక్క రూపై యిట్టి యాకృతిని గాంచెనో యనులాగునఁ దోఁచుచున్నాఁడు. ఇట్టివానిఁ జూచి యానందించు నంతటి యదృష్టము పాపము పాండురాజునకు లేకపోయెఁగా!"

"ఆచార్యులను మొసలికిఁ జిక్కి బాధపడుచుండఁ దక్కిన శిష్యులందఱు లోఁగొని చూచుచును ఏమి చేయుటకును దెలియక చింతించుచుండ సాహసించి నీటఁ బ్రవేశించి ఆక్రూరసత్త్వమును జంపి గురువును గాపాడిన మహాభాగుఁడీతఁడే కదా! ఈతని ధైర్యమేమని కొనియాడఁదగును?"

అని యీలాగున ఎవరికిఁ దోఁచినరీతిని వారతని స్తుతించుచుండిరి. పార్థుఁడు తన యస్త్రలాఘవమును జూపి అచ్చటివారి మెప్పు వడసెను. జనులాతనిఁగొను స్తుతివాక్యముల వినుచుండిన కర్ణుని కసూయ మెండయ్యెను. అంత నాతఁ డర్జునునిఁ జూచి;

కర్ణః—అర్జునా! నీయస్త్రవిద్యలఁ బ్రేక్షకులు మెచ్చినంతనే గర్వము చెందఁబోకుము. నాకును ఈవిద్యలెల్లఁ దెలియును. వానినిదె నేఁ జూపఁగలను. ఆ చూపు సూటిని మనలో నెవ్వ రధికులనుట తెలియఁగలవు. ఆచార్యా! పార్థునిలాగున నాయస్త్రవిద్యాకౌశలమును నేఁజూపవలచితిని. నాకు ననుజ్ఞయిండు.

ద్రోణః—ఆజ్ఞ యొసంగితిని. అర్జునా! నీవిఁక నిలువమ్మా. కర్ణా! ఇంక నీచాతుర్యమును జూపుము.

కర్ణుఁడంతఁ బార్థుఁడు చూపిన కౌశలముల నెల్లను జూపెను. ప్రేక్షకులీతని సామర్థ్యమును గూడ మెచ్చుకొనిరి. ఫల్గునునకు నిగ్గును గోపము నొక్కుమ్మడి నుదయింపఁగాఁ గ్రూరదృష్టుల వానిని జూచెను. గురునానతి లేనందున ఏమి సేయుటకును లేక యూరకుండెను. కౌరవు లెంతయు సంతసించిరి. రాధేయుఁడంతఁ గర్వాన్వితుఁడై సుయోధనునిఁగాంచి;

కర్ణ:—మిత్రమా! ఈ సభయందు వారలెల్ల వీక్షింప నేనర్జునుతో ద్వంద్వయుద్ధము సేయనెంచి యున్నాను. ఆచార్యునియు నీయొక్కయు నాజ్ఞయు నైనచోఁ బ్రారంభించెదను. ఇందు జయము నాకే కలుగు ననుట నిక్కము. నీకీ విషయమునఁ గొంచెమైనను సంశయము వలదు.

అర్జున:—నీవు నాకౌశలము గురు నానతిని జూపితివి గాని నీవలె నిగ్గువిడిచి వారిని వేఁడికొన లేదు. అది చాలక ద్వంద్వయుద్ధమున కవక్రమింతువని సుయోధనుని వేఁడుచుంటివా? నీయెడ గౌరవముండిన వారే నీకాజ్ఞ యొసఁగి యుందురే? తక్కొలఁదియు నెవరి కొలఁదియుఁ దెలియక యూరకయేల పదరెదవు?

కర్ణ:—రంగస్థలము శౌర్యవంతులకెల్ల సామాన్యమగునది. ఆచార్యునియెడఁ గల గౌరవమున నడిగితిఁ గాని నాకధికారము లేదనుకొంటివా? ఒక్కటే నాతో యుద్ధము సేయ భీతిల్లినవేని 'జితోస్మి' యనుము. నేనూరకుండెదను.

సుయోధనః—అర్జునుని మాటల కేమిగాని నీవాతనితో యుద్ధముసేయ నేనిద నీ కాజ్ఞాపించుచున్నాడను. నీవింక నెవ్వరి యాజ్ఞకును నిరీక్షింప నవసరము లేదు.

అవల దుర్యోధ నానుమతిచేఁ గర్ణుఁడు పార్థునితో ద్వంద్వయుద్ధముసేయ నారంభించెను. కర్ణుఁ డస్త్రములు వేయ ఫల్గునుఁడు దనయస్త్రములచే వానిని ఖండించెను. అర్జునుఁడు వేయువానిని గర్ణుఁడు నష్టము చేయుచుండెను. వాఁడి బాణముల రాధేయుఁడు పాండవ మధ్యముని నొప్పించుచుండెను. సవ్యసాచియు వానినట్లే నొప్పించుచుండెను. ఇట్లిరువురును తీసిపోవక సమానముగా యుద్ధము సేయుచుండిరి. కృపాచార్యునకు మాత్రము, కర్ణునకు సుయోధనాదుల సాహాయ్యముండుటచే వాఁడు ఎచ్చటఁ బార్థుని మీఱునో యను సంశయము గలిగెను కాఁబట్టి యాతఁడు కర్ణుని గాంచి;

కృపః—ఓయీ! అర్జునుఁడు రాజకుల సంభూతుఁడు. రాజనీతి విశారదుఁడు. అట్టివానితో నజ్ఞాతకుల గోత్రుఁడవగు నీవు యుద్ధము సేయుట తగదు. నీ కాలాగున రణమొనర్పఁ గోరికయున్న నీవంశమును దల్లి దండ్రులను దెలుపుము.

కర్ణుఁ డామాటలకు బదులాడ లేక సిగ్గుచేఁ దలవంచుకొనెను. తనకంతటి బల వీర్యుఁడేల కల్పించెనని మానసమునఁ జింతించెను.

కృపః—సత్కుల ప్రసూతుఁడును, శౌర్యవంతుఁడును, అధిక సేనా సమేతుఁడను రాజనామమున వ్యవహరింపఁబడును. అట్టివాఁడే పార్థునితో యుద్ధము సేయఁ దగువాఁడు.

భీష్మ:—కృపాచార్యుని పలుకులు యథార్థములు. కర్ణుఁ డర్జునునితో రణముసేయఁ దగఁడు.

సుయోధన:—ఈతఁడు రాజు గాఁడు కావున యుద్ధము సేయరాదనియా మీయభిప్రాయము! ఇదె నామిత్రున కంగ రాజ్యమిప్పించెదను—తండ్రీ! మిమ్మెద్దియుఁ గోరిన వాఁడను గాను. కావున నామిత్రుని విషయమున నేనొనర్చిన యీప్రతి నను బూర్తి గావించి నను ధన్యుని గావింపుఁడు. కాదేని మీ జ్యేష్ఠపుత్రుఁ డనసత్యవాది యయిన మీకే కదా యపవాదము!

ధృతరాష్ట్ర:—కుమారా! నీ వనసత్యవాదివగుట కే నిష్టపడు వాఁడనుగాను. ఆలోచింపక వీనికి రాజ్యమిచ్చు లాగునఁ దొందరపడి యాడితివే యని చింతించుచున్నాఁడను.

భీష్మ:—ధృతరాష్ట్రా! కానున్నది కాకమానదు. నీవేల చింతిల్లెదవు? కురుకులమునఁ బుట్టినవారెవ్వరైనను అనత్య వాదు లగుటకు నే నిష్టపడను. కాఁబట్టి ఈతని వేఁడికోలు పూర్తి గావింపుము.

విదుర:—ఇట్లగుననుట నాకు మున్నె తెలియును. ఇఁకఁ జింతించిన లాభము లేదు.

ధృతరాష్ట్ర:—పుత్రకా! నీయిచ్చచొప్పునఁ గర్ణున కంగరాజ్య పట్టాభిషేకము గావింపుము.

సుయోధనుఁ డప్పు డా ప్రదేశమున కొక గద్దియ దెప్పించెను. కర్ణునందాసీనునిఁ గావించి బ్రాహ్మణాశీర్వాద పురస్సరముగ వానికిఁ బట్టము గట్టించెను. కర్ణుఁడంత సంతుష్టాంతరంగుఁడై;

కర్ణ:—సుయోధనా! నీవాచరించిన యీగొప్ప కార్యమునకు నేనేమి ప్రతిక్రియనల్పి నీఋణమును దీర్చుకొనఁ గలవాఁడను?

సుయోధన:—అంగరాజా! నాతో నెప్పుడును చెలిమి వీడకుండుటయే నాకుఁ బదివేలు. ఇంతకంటె నీవలనఁ బ్రత్యుపకృతి నాకేవియును వలదు.

భీమసేన:—సూతపుత్త్రా! నీకులమునకుఁ దగినలాగున రథచోదకవృత్తి నవలంబించుట మేలుగాని ఈ రాచఱికము నీకేల? "ప్రాప్తేపి సామ్రాజిత్వం నాభిత్వం నవిముచ్చ్యతే" యనులాగున సుయోధనుఁడు నీకు రాజ్యమిచ్చినను నీసూతత్వము పోఁజాలదు. ఇప్పుడు సూతమహారాజ వగుచున్నాఁడవు. కాఁబట్టి యుత్తమక్షత్త్రియవంశసంభూతుఁడగు పార్థునితో యుద్ధము సేయ నీ వర్హుఁడవు కాఁజాలవు

సుయోధన:—భీమసేనా! వీని ముఖవిలాసముగాంచిన వీఁడు సూతపుత్త్రుఁడని చెప్ప వీలుగలదా? లేడికడుపునఁ బులిపుట్టునే? మహాత్ములగు పెక్కురపుట్టువు లెట్టివో యెఱుఁగుదువా? ఈ విదురుఁడును, కృపాచార్యులును, ఆచార్యులవారును, ఎట్లుజనించిరో నీకుఁ దెలియునా? ఇంతయేల? మీ జన్మము లెట్టివియో తెలియఁజాలవా?

భీష్మాదులు వీరివాదము పెరుఁగకుండ వలయునని యెంచి "ప్రొద్దు గుంకుచున్నది కాఁబట్టి యస్త్రవిద్యా సందర్శన మింతటితో విరమించున" దని యాజ్ఞ చేసిరి. కుమారులఁ బిలిచికొని ధృతరాష్ట్రుఁడును, నారీవర్గమును

వెంటనిడుకొని గాంధారియు నాచోటు వాసిరి. కర్ణుఁడునాఁటి తనపరాభవమున కెంతయు వగచెను. తన పుట్టువును గుఱించి తెలియుట కేమి యుపాయమని యాలోచించెను. తన్నుఁ బెంచిన రాధాసూతుఁకు నదిలోఁ జిక్కుటవలనఁ దన జననవృత్తాంత మెద్దియుఁ దెలియకుండుటకు మిక్కిలి చింతించెను. తన్నాలాగునఁ గనికరమింతైన లేక నదిలో వైచిన వారలపై నత్యంతము క్రుద్ధుఁడాయెను. వారెవ్వరైనదియును ఎఱుఁగనందున ఆకోపము మఱల విషాదముగా మాఱఁగ వివర్ణముఖుఁడాయెను. ఈలాగునఁ బరిపరి విధముల వితర్కించుచుండఁగ, ఒక్కనాఁటికైన అర్జునునకు సభామధ్యమున నవమానము గల్పింపక తీఱనని శపథము గావించి యచటనుండి కదలెను. తక్కిన వారెల్లరును వారివారి యునికిపట్టులకు వెడలిరి.

కుయుక్తి

"అకటా ! ఈ పాండవుల మూలమున నాకు సర్వదా తలవంపులు గలుగుచున్నవి. నాఁడు ద్రుపదునిఁ బట్టఁబోయినపుడు అర్జునుఁ డడ్డమువచ్చి జయలక్ష్మినిఁ గైకొనిపోయెను. నేఁడు యుధిష్ఠిరుఁడు యువరాజై నారాజ్యమెల్ల నపహరించెను. దీనికేమి సేయుదును ? కణికుఁడు తెలిపిన రాజనీతి మనమెల్లరము వినినదే కదా ! దానిచొప్పున అపకారు లగువారు

పరులైనను బాంధవులైనను ఔదాసీన్యము వహింపక జాగ రూకతతో వారిని దూరమున నుంపవలయును గాని చెంతఁ జేర్చు కొనరాదు గదా!"

శకుని:— సుయోధనా! నీతి కుశలుండగు నామంత్రి యాడినవెల్ల గ్రాహ్యములే యగును. శత్రువులు హీనబలు లైన వారిని సంహరింపవచ్చును గాని యహీనపరాక్రమము లైనచో వారితోఁ గపటస్నేహము గావించుచుండి సమయము గలిగినపుడు సంహరించుట యుక్తము. ధర్మరాజును యువ రాజుగాఁ జేసినది నీ తండ్రిగదా! కాఁబట్టి యాతని వని కాతఁడే ప్రతీకారము సేయఁదగును.

సుయోధన:— మాతండ్రి యాలాగునఁ జేయువాఁడేని ధర్మజునేల యువరాజు గావించును? కావున నది యసాధ్యము.

శకుని:— రాజకుమారా! ఇందులకొక యుపాయము చెప్పెదను వినుము. నీ తండ్రి మూలమునఁ బాండవులను దేశాంతరమునకుఁ బంపవలయును. ఈ విషయముఁ నాతఁ డంగీక రించుట యెట్లని యాలోచించుచున్నాను.

సుయోధన:— మాజనకుఁడు దీని కొడఁబడుటకు రే యుపాయ మాలోచించెదవు?

శకుని:— అతని యెదుట నీ వనుభవించు క్లేశమును జక్కఁగా వివరించుము. పుత్రస్నేహ మెట్టివానికి నలంఘ్యము. అప్పు డాతఁడు యించుక దయార్ద్రహృదయుఁ డగును. ఆ సమయము గని పెట్టి యుక్తిచేఁ బాండవుల వారణావతమునకుఁ

బంధులాగున నొనర్చుకొనుము. అందు వారి నివాసమునకై మనకుఁ బరమవిశ్వాసపాత్రుఁడగు పురోచనుని మూలమున లక్కయిల్లొకటి గట్టించెదము. అచ్చట వారు నివసించియుండ నడిరేయి నొక్కనాఁడు ఆ గృహమునకు నిప్పంటించి నిద్రాపరవశులగు వారిని మరణింపఁజేయుదము. ఇట్లొనర్చిన మనపై నపవాదము రాఁజాలదు. ఇదియే నాకుఁదోఁచినయుక్తి.

సుయోధనుఁ డిదివిని యించుక యనుమానపడెను. మామ చెప్పినలాగునఁ జేసిన ఈలోకమున నపవాదమును దేహాంతమున నరకమును సంభవించునే యని యాలోచించెను. ఏది యెట్లున్నను వారిని అటనుండి తొలఁగించుట మేలగునని యెంచెను. పాండవులఁ బంపినచో నచ్చట శకుని వారికేమిసేయునో యని యాశ్రయమ్మునుండి మానఁ దలఁచెను. తులువతనమున భీముఁడును, శౌర్యమున నర్జునుఁడును, రాజ్యలోభమున ధర్మరాజును, దన కెగ్గు గావించి నందునకుఁ బసివారగు నకుల సహదేవులు మన్నించుట కాతిసి మనస్సంగీకరింపకుండెను. అట్లు యూరకుండినఁ దన కనేక బాధలు గలుగుచున్నవి. వారొండొరుల వీరవారు కారు. అనియెంచి తుదకు మామగారి యిష్టము చొప్పునే ఆచరింప నిశ్చయించి తండ్రిపాలి కరిగెను. ధృతరాష్ట్రుఁడు కుమారు నాలింగనము చేసికొని వాఁడు కృశించియుండుట తెలిసికొని యదరిపడి ;

ధృతరాష్ట్రుఁ:—తండ్రీ! నీయంగము లిట్లు కృశించి యుండుటకుఁ గారణమేమి?

సుబోధః:— జనకా! నా మనమున నుండెడి విషాదము నేమని తెలుపుదుఁ దండ్రీ? ఆబాల్యమునుండియుఁ బాండుసుతులకు నేను వెఱచుచుండెడి వాఁడను. భీముఁ డన్నివిధముల నాకుఁ డలవంతలు కలిగించుచున్నాఁడు. వానికిఁ దోడుగా ఫల్గుణుఁడును నాకుఁ గొన్ని భంగములు కలిగించుచున్నాఁడు. నీవిపుడు ధర్మరాజును యువరాజుగాఁ జేసినది మొదలు వారిగర్వ మతిశయించెను. నను బలువిధముల నవమానించుచున్నారు. పౌరులును యుధిష్ఠిర పక్షపాతులై నీవు ధురఁ వహించుటచేఁ బాండురాజువలె నితఁడే రాజ్యమేలవలయునని యాడుకొనుచున్నారు. ధర్మరాజు మంత్రులను మన్ననవారిని గౌరవించుచుఁ దనపక్షము గావించుకొనుచున్నాఁడు.

ధృతరాష్ట్రః:— నేను పరరాజుల జయించునంతటి బలశాలి నయ్యును గ్రుడ్డివాఁడ నగుటచే రాజ్యపాలనము సేయఁ జాలకుంటిని. కాఁబట్టియే నాతమ్ముఁడు పాండువు నాకు బదులుగా రాజ్యము బరిపాలించుచుండెను. అతని కంటె గుణవంతుఁడు ధర్మరాజు. కాఁబట్టియే వానిని యువరాజుగా నేర్పఱచితిని. అతఁడే రాజుగాఁ దగినవాఁడు. మీరతని కంటెఁ గనిష్ఠులు. జ్యేష్ఠుఁడుగాన రాజ్యార్హుఁడు. అతఁడు మిమ్మతి ప్రీతితోఁ జూచుచున్నవాఁడు కదా! అట్టియెడ నీకింత యసూయయేల?

సుబోధః:— అట్లని కన్నకుమారుని నుపేక్షించుట పాడియగునే? పాండురాజు గొంతకాలము రాజ్యలక్ష్మి ననుభవించెను. అతని వెనుక నీ పెద్దకుమారుఁడను రాజ్యాధికారి

యయ్యెనని యూరకుండినఁ గ్రమముగఁ బాండవ వంశమునకే రాజ్యము రాఁగలదు. మా పుత్త్రపౌత్త్రవర్గమంతయు నిఁక రాజ్యాపేక్ష మాని వారికి దాసానుదాసులై కదా వర్తింప వలయును? రాజ్యపాలనమున కర్హుఁడు జ్యేష్ఠుఁడగుట శాస్త్ర సమ్మతమగునది కాదనను గాని కారణాంతరములచేఁ గొన్ని సమయముల శాస్త్ర సమ్మతమగు దానిఁ గూడ విడవలయు ననుట నీకుఁ దెలియదే! మన పూర్వుఁడగు పూరువు జ్యేష్ఠుఁడే? యదువు మున్నగు జ్యేష్ఠులవీడి రాజ్యమాతనికి రాలేదా? తండ్రి కుపకారము సేయుననెపమునను, విజాతీయ స్త్రీ జనితు లగుటచేతను యదువు మున్నగువారు రాజులు కాలేదని యందువేమో! అది యటుండనిమ్ము. భీష్ముఁడు జ్యేష్ఠుఁడు గాఁడే! తాను రాజ్యమును వీడి సత్యవతీ తనూజుని మా తాతను విచిత్రవీర్యుని రాజుగా నొనర్పలేదా? జనకుని వివాహమునకై తానట్టి శపథము గావించెనని యందువేమో? ఎట్లును గారణాంతరములచే జ్యేష్ఠులు రాజ్యమునకురాక కనిష్ఠులు వచ్చిరనుట యంగీకరింపక తీరదుగదా! మీ రాజ్యమునకు మీకుమారుఁడు రాజగుటయు నట్లే యొక కారణమని యెంచుఁడు. వేయేల? వారి నిటనుండి యెచ్చటికేనిఁ దఱుము చుండిన నేనాత్మహత్య గావించుకొని మరణింతును. ఇది నిశ్చయము.

ధృతరాష్ట్రి:—కుమారా! అమంగళములు వచింపకుము. నాకు మాత్రము పుత్త్రప్రీతి లేదనియా యెంచెదవు? కొంత యోరిమి వహించియుండుము. కార్యమొకతీరున పరిష్కరింతును.

సద్గుణ విరాజితులకు వారినిఁ జెప్పిన నూరు వెసలఁదలఁచియున్నఁ బోరు లేమని యెంతురు? తొందరపాటు పనికిరాదనుట యెఱుఁగవా? ఇంత కాలము మిక్కిలి యాదరము చూపుచుండిన నేను వారితో నెట్లు కఠినోక్తులు పలుకఁగలను? చెప్పితినిఁబో! భీష్మాదు లందులకు సమ్మతింతురే? వారికిష్టము లేని కార్యములు మన మాచరించిన అంతః కలహములు గలుగును. కాఁబట్టి రాజ్యాభివృద్ధి గోరువాని కెప్పుడును ఇట్టి చేఁతతగదు.

సుయోధనః—మీ రిష్టపడిన భీష్మాదు లెదిరింపఁజాలరు. అశ్వత్థామ నాయెడ ననురక్తుఁడు. పుత్రస్నేహమున ద్రోణాచార్యులును, బావను విడువఁజాలక కృపాచార్యులును నాయెడఁ బ్రసన్నులు కాఁగలరు. పితామహుఁ డుభయుల యెడను సమానప్రీతి గలవాఁ డగుటచేఁ దటస్థుఁడయి యుండుటయే కాక మన పక్షమునఁ జేరినను జేరవచ్చును గాదా! ఇంక విదురుఁ డొక్కఁడే కదా యవశిష్టుఁడు! అతఁడు పాండవపక్షపాతియే యైనను ఒంటరి యగుటచే నేమియుఁ జేయఁజాలఁడు. ఇందు దోషమేమి గలదని జనులు దూషింపఁబోయెదరు? పట్టణములలో నెల్ల వారణావతము మిక్కిలి పొగడ్త గాంచినది. ధర్మరాజు దైవభక్తుఁ డగుటచేఁ బశుపతి నివాసమగు నాపురమునకు అతనిఁ బొమ్మనినఁ దప్పక యంగీకరింపంగలఁడు. రాజ్యములోనివారు మనకుం లోఁబడిన యావల వారిని మరలరావింతము. వారికినిఁ గొంత రాజ్యభాగమిత్తము.

ధృతరాష్ట్రుఁడును సుయోధనుని మాటలు విని యెట్టకేలకు అంగీకరించెను. సుయోధనుండును నాఁటినుండి మంత్రులు మున్నగువారి ముఖమున వారణావతమహిమను ధర్మరాజున కభివర్ణించి చెప్పించుచుండెను. క్రమముగ యుధిష్ఠిరునకుఁ దత్పుర దర్శనమున నుత్సాహమతిశయింపఁ జొచ్చెను. కుంతియు ఆ క్షేత్రమహిమ వినినది మొదలు కొంతకాలమచ్చట వసింప నెంచుచుండెను. సుయోధనుని మాయయునఁ బాండుపుత్రులకు వారణావత నగరవాసమున నిష్టమాదయినచుట దెలిసిన ధృతరాష్ట్రుఁడు ధర్మరాజాదులఁ బిలిపించి;

ధృతరాష్ట్రుఁడు:—కుమారులార భాగీరథీ నదీ తీరమున వారణావతమను పట్టణ మొకటిగలదు. అది సర్వసౌఖ్యములకును స్థానము. కొల్లలు నాశికొందురు. మీరలు మీతల్లితోడ నచ్చటి కేఁగి కొంతకాల మచ్చట వసించి ధర్మకార్యములు జరిపించి పుణ్యమును సంపాదించుకొని మరలివచ్చుట మేలని నాకుఁ దోఁచుచున్నది. మిమ్ము వీడుటకు నామనసొప్పకున్నది. కాని మీకీపుణ్యమును సంపాదించి యియ్యవలయునను నత్యంత నన్నిలాగున ప్రేరేపించుచున్నది.

ధర్మరాజు:—అనవరతము మాహితము గోరుచుండు మీయానతి శిరసావహించుచున్నారము. అట్లేపోయి వచ్చెదము.

అని యానతిని పొందిరి. భీష్మాదిగురుజనులయొద్ద సెలవు గైకొని ప్రయాణోన్ముఖు లయిరి. సుయోధనునకు శకుని యొనర్చిన బోధలు ఫలించెను దాన వాని మనసు

మాటఁజొచ్చెను. కాఁబట్టి యాంత్రిక లాక్షాగృహ నిర్మాణము మున్నగువాని నతఁడు శకుని మతము ననుసరించెను. విదురుఁడు వీరి కుయుక్తిని దెలిసికొని మెల్లఁగ ధర్మతనయునితోఁ జెప్పెను. దానికి వలయు ప్రతీకారమును అతనికిఁ దెల్పి పంపెను. సుయోధనుఁడు నాఁటి మొదలు పౌరజానపదాదులు దనయెడ ననురక్తులగులాగున సామ దానముల మూలమున వారిని సంతృప్తులం గావించుచుండెను.

గదావిద్యాభ్యాసము

బలరాముఁడు దన చెలికాఁడగు పార్థివునిఁ జూడ నెంచి విదేహమునకు వచ్చియుండెను. ఇది తెలిసి సుయోధనుఁ డాతనియొద్ద గదావిద్యను బాగుగా నభ్యసింప నెంచి యచ్చటికి వచ్చెను. బలరాముని చెంతకరిగి పాదములకు నమస్కరించెను. రాముఁడు నాతని నాశీర్వదించి ;

“సుయోధనా ! నీతండ్రికిఁ గుశలమే ? అంధుఁడగు నీ జనకుని వీడి యిల్లేల వచ్చితివి ? నీ విటువచ్చిన రాజ్యతంత్ర మరయువా రచ్చట నెవరు గలరు? భీష్ముఁడు వృద్ధుఁడు గదా! ధర్మసుతుఁడు జీవించియుండిన మీతండ్రికిఁ జేయూఁతగా నుండెడివాఁడు. పాప మాతఁడు దన మాతృసోదరులతోడ లాక్షాగృహమున దగ్ధుఁడయ్యెనఁట గదా! ఇట్టి సమయమున నీవిటువచ్చుట సరియే?”

"బావా! పెక్కు దినములనుండి మీవలన గదా విద్య నభ్యసింప వలయునని యెంచియుంటిని. కాని నేటి వఱకు నాకట్టి సమయము సేకూఱదయ్యెను. మీరిచ్చటికి వచ్చి యుండుట తెలియుటచే మీవలన నావిద్యను సాంగోపాంగముగ గ్రహింప నెంచి వచ్చియున్నాను. ద్వారక యందుండ మీయొద్ద కరుదెంచి నావాంఛితమును దెల్పిన నచ్చట మీ సోదరుని మూలమునఁ గార్యహాని యగునో యను వెఱపున నచ్చటికి రానయితిని. అదేమి పాపమో కాని కృష్ణునకు నాపై నకారణద్వేషము జనించి యున్నది. మీరును సోదర ప్రియులగుటచే నామాటల పాటింపకుందురేమో యని తలఁచియే యింతకాలము సమయ నిరీక్షణము సేయవలసెను"

"ధృతరాష్ట్రతనూజా! కృష్ణుఁడు పాండవ పక్షపాతి. నీ వాదినుండి వారల ద్వేషించుచుందువు. ఆకారణమున నీపైఁ గృష్ణునకు విరోధ మొదయించుట సహజము. నేను మీ యుభయులయెడ సమభావము గలిగి వర్తించు వాఁడను. కాఁబట్టి నీ వేపట్టున నేది యడిగినను గాదను వాఁడను గాను. నీకెప్పటికి నట్టిసంశయము వలదు."

అని యాడి నాఁటి మొదలు లాతనికి గదావిద్యయందలి మర్మములఁ గఱపుచుఁ గ్రమముగ గదాయుద్ధ కుశలుని గావించెను. సుయోధనుఁ డప్పుడు దన మది నిట్లు తలపోయఁ జొచ్చెను.

"అయ్యో! భీముఁడు సజీవుఁడై యుండకపోయెనుగా! అతఁడు బ్రతికి యుండిన నామదిఁ గసిదీఱ వానితో యుద్ధము

చేసి జయించి సంతుష్టుండ నగుదును గదా ? తొలుదొల్త గదా విద్యాభ్యాసము బలరామునొద్ద నేర్చవలయునని యెంచినది వానికొఱకే కదా ? ఇప్పుడు ప్రయత్నించిన కార్యమును జక్కంబఱచికొనుట ముఖ్యమని యెంచి వచ్చితి నంతియకాని లక్ష్యమును బోఁగొట్టికొంటిని గదా ! నా తెలివి తేమిని వాని జంపుకొని యిప్పుడు చింతించిన లాభమేమి ? ఎప్పుడును శత్రువును ప్రాణముతో నునిచి కసిదీఱ వాని బాధించుట సరికాదన తలంచినపుడే చంపుట సరికాదు. వానితోఁబాటు వాని తల్లిని భ్రాతలను గూడ జంపించితిని. క్రుద్ధుండగువాఁడు ముందువెన్క లారయఁడనుట నాయెడ నరిపోయెను. కాఁశీవుడు సజీవుండైయుండిన వాని జయించి నా దాసునిగా జేసికొని యుందును. వానితోఁబాటు వాని భ్రాతలును నాకు దాసానుదాసులై యుందురుగాదె! ఇంతకును నా యవిమృశ్యకారితయే కారణము.''

అని తలంచుచుండెను. బలుఁడును దన శిష్యుని చురుకు దనమున కెంతయు మెచ్చుకొనుచుండెను. ఇట్లు బలరామునిచేఁ జక్కఁగా శిక్షితుండై యాతని యాజ్ఞవడసి సుయోధనుఁడు హాస్తినాపురమున కరిగెను.

అర్ధరాజ్య దానము

"రాజేంద్రా! నాఁడు కాంపిల్య నగరమున మత్స్య యంత్రమును దెగనేసినవాఁ డర్జునుఁడఁట. కుంతి యాజ్ఞచేఁ బాండవు లేవురును ద్రౌపదిని వివాహమాడిరఁట. భీముఁడు బ్రదికియున్న వాఁడని తెలియుటచే బలరామునొద్ద నే నభ్యసించిన విద్యకు లక్ష్యము చిక్కెనుగదా యని సంతోష మొకవైపున నాకుత్సాహశక్తి నభివృద్ధి పఱచుచుండినను శత్రుఁ డుత్కర్షమును బొందియుండుట విని యోర్వలే కున్నాను. అభిమాన ఘనుఁడగువాఁ డెవ్వఁడరుల వైభవమును జూచి యోర్వఁగలఁడు? నే నద్దియేనిఁ జెప్పఁదలఁచి వచ్చిన నప్పుడెల్ల విదురుఁడు మీచెంతన యుండును. కాఁబట్టి నే నేమియుఁ బలుకలేక యూరక వెడలి పోవుచుందును. అతఁడు పాండవ పక్షపాతి యగుట మీ కెఱిఁగియు చెంతఁ జేర్చుకొనుట యెంతయు ననుచితము."

అని కర్ణసహితుఁడగు సుయోధనుఁ డొకనాఁ డేకాంతమున నున్న తండ్రిం గాంచి పలికెను. ధృతరాష్ట్రుఁడును కుమారుని మాటలు విని;

ధృతరాష్ట్రః:—విదురుఁడు మున్నే ద్రౌపదీ వివాహాదికములు నా కెఱిఁగించెను. పాండవులకు వివాహ మయినందులకై నీవేల చింతింపవలయును? సుందరియగు నాభానుమతిని నీవు వివాహమాడియుంటివిగా! విదురునిఁ దొలఁగద్రోసిన మన కపవాదము గలుగును. అతనియొద్ద నీపైఁగల ప్రీతిని

పల్లవించుటలేదు. అది యటుండనిమ్ము. పాండురాజ పుత్త్రులు దైవరక్షితులు. కాఁబట్టి వారి నొరులెన్ని విధముల బాధించినను అవి సఫలములు గానేరవు. అంతమున వారియెడ నీకు విరోధము వలదు.

సుయోధన:—నామాటలు సాంతముగా వినక మీరిట్లు పలుకుట యుక్తముగాదు. పాండవులు పాంచాలుని యొద్ద నున్నారు. వారలతో బలరామ కృష్ణులును, యదు వృష్ణిభోజాంధకాదులును గూడిన వారప్పుడు జేయఁగలుగుదురు గదా? కాఁబట్టి వారిని ద్రుపదునొద్దనుండి వేఱు కలుప వలయును. ఎట్లును శత్రుపక్షము బలహీనము గావలయును. పాండవ పాంచాలులకును, గాంగేయ మాద్రేయులకును, ద్రౌపదీ పాండవులకును బరస్పర ద్వేషము గలిగింపవలయును. ఏయుపాయమున నైనను వారిని లుప్తబలులఁ గావించినఁగాని వారు మనకు వశులు గానేరరు.

కర్ణుఁ డీమాటలు విని నవ్వుచు ;

కర్ణ:—ఆర్యావర్తనుఁడను, గుణవంతుండునగు పాంచాల రాజు తన యల్లుర వీడుట యసత్యము. గుణసంపన్నుఁడగు ధర్మరాజును, అన్నమాటల నిరాకరింపలేని యతని సోదరు లును గౌరవింపఁదగిన మామయెడ ద్వేషము వహించుట యబద్ధము. కాఁబట్టి వారలయెడ భేదోపాయమును బ్రయో గింప వీలుగాదు. సతీతిలకమగు ద్రౌపది పాండవులయెడ విరక్తయగుట కల్ల. ప్రీతిని బెండ్లిపాడిన పాండవు లామెయెడ విరోధము వహించుట కలలోని వార్త. కాఁబట్టి వారి

స్నేహమును భంగము సేయఁ గడఁగుటకు వలనుగాదు. కౌంతేయ మాద్రేయులాదినుండి భేదము లేక ఏకగర్భ జనితులఁ బలెనుండ వారిని విడఁదీయ నెంచుట యుడియాన. బహిరంగముగ యుద్ధమున కరిగి ద్రుపదుని జయించి పాండవుల బంధించి తెచ్చుట దక్కఁ దక్కిన వెవ్వియు సరిగావు.

ధృతరాష్ట్రః:—యుద్ధసందర్భము భీష్మాదులతో నాలోచింపక చేయుటకు సాధ్యము గాదు.

అని చింతనుండు నొక సేవకుని మూలమున భీష్మాదుల రావించెను. ధృతరాష్ట్రుఁడు వచ్చినవారి నర్హములగున సత్కరించి యుచితాసనాసీనులఁ గావించి;

ధృతరాష్ట్రః:—పాంచాలునిపై యుద్ధమున కరిగి వానిని జయింపవలయునని కర్ణుఁడు నుడువుచున్నాఁడు. ఇందు మీయభిప్రాయ మేమి?

భీష్మః:—కౌరవ పాండవు లిరువురును నాకొక్క రూపువారే. నే నిరువురను సమానముగానే ప్రేమించుచున్నాను. ఇప్పుడు పాంచాలునిపై దాడివెడలుట పాండవులపై యుద్ధమునకుఁ బోయినలాగుననే యగును. అద్దానికి నేను సమ్మతింపఁ జాలను. పితృపైతామహమగునట్టి ఈ రాజ్యమునకు మీయట్లు వారు నర్హులు! కావున వారి కర్ధరాజ్య మిచ్చుట మీకు శ్రేయోదాయకము. కీర్తివిహీనుని జన్మము నిరర్థకము. నశ్వరమగు ధనముపై నాసయుంచి శాశ్వతమగు యశస్సును బోనాడు కొనకుఁడు. పాండవులకుఁ బైతృకమగు రాజ్యమును బంచియిచ్చి వారితో స్నేహముగలిగి వర్తింపుఁడు.

ద్రోణః—సుయోధనా ! కురువృద్ధుఁడగు పితామహుని మాటలు యథార్థములు. వారిచెప్పిన నడచు కొనుము. పాండవులతో విగ్రహమునకుఁ గడఁగకుము. కర్ణాదులమాటలు విని వారలతోఁడ వైరము పెంచుకొనకుము. వారు సత్య శీలురు. ధర్మనిరతులు. అట్టివారితో నీకేల విరోధము ? వారి కర్ధరాజ్యమిచ్చి సుఖింపుము. ఇప్పుడే పాండవులకును, పాంచాల రాజునకును, దృష్టద్యుమ్నాదులకును ప్రియపూర్వ కముగా భూషణాంబరాదులఁ బంపుము. పాండవులఁ దత్క్షణమే రప్పింపుము.

కర్ణః—సుయోధనా ! ఈ ముసలులు చిత్తస్థైర్యము లేని వారగుటచే ఇట్లు పలుకుచున్నారు. నీ కెచ్చటనయినఁ గూర్చుండి తమకుఁ దోఁచిన గ్రంథమును జదువుకొనుచుఁ బ్రొద్దు పుచ్చుచుండక రాజునకు హిత బోధలుసేయ నేల రావలయును ? మంత్రులెలాగునఁ బల్కినను వారి సాధుత్వా సాధుత్వముల విచారించుట రాజునకు విధియగును. రాజు ఎప్పుడును స్వబుద్ధి నుపయోగింప వలయును. వీరి పలుకులు విశ్వాసార్హములుగావు.

భీష్మ ద్రోణులు కర్ణుని వాక్యములు విని కుపితులై;

“కర్ణా ! మే మహితము పల్కెడివారమును, నీవు హితము సెప్పువాఁడవా ? నీవొసర్చిన దుర్నీతిమూలమునఁ గదా యింత వాటిలెను ? ఇంత చేసినదిచాలక ఇంకను మా యెదుట నోరెత్తెదవా ?”

విదురుఁడు:—రాజేంద్రా! భీష్మద్రోణులు ధర్మవిదులు. సత్యము వచించువారు వయోవృద్ధులు. వారు సెప్పెడి లాగున మెలఁగుట మేలు. వారికంటె నీకొరులు హితులు లేరు. ఈ సుయోధనాదులు బాలురు. కాఁబట్టి ధర్మాధర్మముల నారయుటకు వీరేపాటివారు! వీరిపలుకు లాదరణీయములుగావు. తక్షణమే పాండవుల రావింపుము. వారల కర్ధరాజ్యమిచ్చి గౌరవింపుము. వారికి దైవమానవ సహాయములు గలవు. అట్టివారి నుపేక్షించుట క్షేమావహము గాదు. వారి పరాక్రమ మెల్లవారికిని దృష్టపూర్వమే. అట్టివారి విగ్రహము నాశమునకుఁ గారణమగును. సుయోధనా! నీవు వీరి బోధనలకు లోఁబడి యిదివఱలోఁ బురోచనునిమూలమున నక్రమ కార్యము సేయ నుపక్రమించితివి. కానియది ఫలింపదయ్యెను. కార్యము వ్యర్థమైనను భీమార్జునులు దాని మఱచువారు గారు. ఇప్పుడు వారిని బిలిచి యాదరించిన ఆయపయశము పోవుటయే కాక వారలను బ్రీతులఁ గావించినట్లగును. భూపాలా! తప్పక వారల రావింపుము.

ఇదివినిన సుయోధనుఁ డిట్లని వితర్కింపఁ దొడఁగెను.

"ఆహా! నే నాదినుండి యూహించిన లాగుననే యాయెను. ఆ కార్య మెంతగుప్తముగా నాచరించినను అది బయలుపడక తీఱదు. ఈవిషయము ఈతనితోఁ బెక్కుతడవలు చెప్పియుంటిని. ఈశకుని తానెంతో గుప్తముగా నాచరించితి నని కదా పలికెను! ఏకీ! అది దాఁగియుండ నేర్చునే! గుట్టు బట్టబయలయ్యెనుగా! 'రాజరాష్ట్రకృతంపాప' మ్మనులాగున

వీరాచరించి నందునఁ గలిగిన యపనింద నాకుఁగదా కలుగు చున్నది? ఇంతకును గతమునకు వగచి యేమిలాభము? ఇంద ఱిట్లు పట్టుగాఁ జెప్పునప్పుడు నే నెదిరించినచో ఆయకార్యా చరణమునకు నేన కారకుఁడనుట స్థిరపడిపోవును. కాఁబట్టి ఋప్పుడు మౌనము వహించుటయ మేలగును.”

అని తలపోసి యూరకుండెను. ధృతరాష్ట్రుఁడు దానిప్పు డుపేక్షించిన లాక్షాగృహ దహనమునకుఁ దనకొడుకుఁ గారకుఁ డని స్థిరపడిపోవుననుట యెఱిఁగినవాఁడు కాఁబట్టి విదురునిఁ గాంచి ;

ధృతరాష్ట్రు:—విదురా ! నీవును భీష్మ ద్రోణులు నాదు మాటలకునే నన్యథా యాచరించువాండనే?

అని ధృతరాష్ట్రుఁడు నాఁటి సభ చాలించెను. విదురు నంపి ద్రావతితోఁడఁ బాండవులఁ గుంతిని హస్తినకుఁ బిలిపించెను. పాండుసుతు లంబికాతనయుని పాదములకు మ్రొక్కిరి. అతఁడు వారరణ్యమునఁ గుడిచిన యిడుములకుఁ గడు దుఃఖించుచు ; “విధిఁ గడువనేరు శక్తుఁడు? కాఁబట్టి యావిషయము మఱచిపొం”డని యోదార్చెను.

ఆవల వారి నాదరించి యర్ధరాజ్యమిచ్చెను. ఇంద్ర ప్రస్థమును వారికి రాజధానిగా నొసర్చి రాజ్యపాలనము సేయ నియోగించి యంపెను.

సభా నిర్మాణము

"మామా! నీవును నాఁడు పాండవుల రాజసూయ యాగము చూచితివిగదా! ఎట్టిరాజులును వారికి వశులై మిక్కుటమగు కానుకలనిచ్చి వారి నాదరించిరి. అది కదా చక్రవర్తిత్వము! నిర్గంధ కుసుమములాగున నున్నవాని జన్మమేల? అగ్నినుండి స్వర్ణము గలిగినదనుట యసత్యము కాదు. అది వారి యజ్ఞము మూలమున నాకు అనుభవసిద్ధమయ్యెను. ఆ స్వర్ణరాశి తలఁపునకు వచ్చుకొలఁది రాత్రిందివమును నా మదిని దహించుచున్నది."

"అల్లుడా! వారి యైశ్వర్యమెల్లను నీవనుభవింపఁ గలను గాని నీతండ్రి యానతి గావలసియున్నది."

"ఐశ్వర్యమబ్బుట యటుండనిండు. మీరాదినుండి యేదియో కుట్రపన్నుచునే యున్నారు. ఒక్కటియైనను సఫలమగుట లేదు, తుదకది విపరీతముగాఁ బరిణమించి నా ముప్పునకే కారణమగుచున్నది."

"నీకు నా మాటలలో విశ్వాస మున్నలాగునఁ దోఁచుట లేదు. నేనేల నీకుగా జోక్యము కలిగించుకొని యపవాదముల పాలు గావలయును? నే నాచరించునట్టి పని యొక్కొక్కటియు నీమేలును గోరియే కాని స్వార్థపరతచే నేమియుఁ జేయుట లేదు."

"మాతులా! కోపగించుకొనకుము. నామది కలఁక వాటి యుండుటచే న్యాయాన్యాయ పరిశీలన సేయలేక

యున్నది. దాన నే నేవేనిఁ బరుషోక్తు లాడిన క్షమింపవలయును గాని యాగ్రహింప నగునా? అజాత శత్రుఁడగు నాతని యెడఁ గుట్ర నాచరించినఁ బాపములకు మూలమగును గదా యని భావించి యిట్లాడితిని."

"నేఁ జెప్పఁబోవునది యిట్టిదని తెలియకమున్నే నీవది కుట్రయని భావించుట సరి కాదు. అది యటుండ నిమ్ము. 'తామసించి చేయఁదగ దెట్టి కార్యం' బనుట నీ వెఱుఁగవా? కాఁబట్టి యాలసింపక వెంటనే నీతండ్రి యొద్దకు రమ్ము. అట నంతయు వివరింపఁగలను."

వీరిటు సంభాషించుకొనిన పిమ్మట ధృతరాష్ట్రునిపాలి కరిగిరి. అతఁడు గొడుకు నొడలంటి చూచి కడు దుఃఖితుఁడై;

"వత్సా! కౌరవైశ్వర్యమున కెల్ల నీవకదా రాజవు! పరిజను లెల్లరు నీ యాజ్ఞానువర్తులై యున్నవారు. సర్వ సౌఖ్యములఁ దులఁదూగుచున్నావు. అట్టి నీ దేహ మీలాగునఁ దఱుఁగుటకుఁ గారణ మేమి?"

"బావా! పాండవుల రాజసూయయాగ మీతని కార్శ్యమునకుఁ గారణము."

"కుమారా! వలయు నేనట్టి యాగముల వేయింటిని నీవు సేయవచ్చును గదా! ఈమాత్రమునకై యింత కృశింప నేల?"

"తండ్రీ! వినుము! ధర్మరాజు రాజసూయ యాగమున నను రత్న పరిగ్రహణమునం దునిచెను. సర్వరత్నములకు స్థాన మతని గృహము. కౌంతేయుల యందు

ఏరాజుల యైశ్వర్యమును వారి యైశ్వర్యముతో సమానము గాఁజాలదు. లక్షబ్రాహ్మణులు భుజించిన ఒక్కతూరి మ్రోగు పట్టి శంఖ మొక్కనిముసమేని నిలువక శబ్దించుచుండెను. ఆవైభవమును జూచి నేను వెలవెలఁ బోవుచుంటిని. అదిగాంచి కృష్ణ సాత్యకులును, ద్రౌపదీ పాండవులును నను బరిహసించిరి. జనకా! మఱియొక విశేషము వినుము. మయనిర్మితమగు సభను గలయఁజూడ నే నరుగుచుండ తెఱచియున్న ద్వారముల మూయఁబడిన లాగునఁ దోఁచుటచేఁ జొరనొల్లకుంటిని. ఇట్లే నాకచ్చటఁ బెక్కుభ్రమలు గలిగెను. ఇది చూచుచుండిన ద్రుపదపుత్రిక ననుజూచి గొప్పధ్వనితో నవ్వెను. నా ప్రాణవాయువు తనతోడ లాచరించిన యీ కార్యమునకు మెచ్చుకొనుటకు వలె నా శరీరమునుండి వెలుపలికి రానున్నది.”

అల్లుఁడా! ఈమాత్రమునకే ఇంత చింతింపనేల? నీకు వారి యైశ్వర్యమునెల్ల సులభముగా సంపాదించి యిచ్చెదను.”

‘ఏయుపాయమునైనను ఆచరించుటకు మున్ను అది యుపాయము హితమా యనుట యాలోచింపవలయును.”

“బావా! వంకమున్నే ఱాలు రువ్వనేల? నామాట సాంతముగా విని యావలఁగదా ఇది యుక్తమిది యయుక్తమని చెప్పనగును! ముందే మీరిట్లడ్డము పలుకుచుండిన నేఁజెప్పుటెట్లు?”

“ఏపనిగాని విమర్శించి చేయవలయు నని యంటిని గాని నీమాటలు వినరాదని నా యభిప్రాయము కాదు.”

"సుయోధనా! ధర్మజునకు జూదమున మిక్కిలి ప్రియము గలదు గాని నావలె నాతఁడు ఆయాటలోని మర్మ మెఱుఁగఁడు. కాఁబట్టి యతని నోడించి వాని వైభవమెల్ల నీకర్పించెదను."

"జనకా! మామయ్య చెప్పు నుపాయమున హింసా కార్యమేమియును గావించుటలేదు గాని జూదమాడుట యక్రమకార్యమగునేమో యని యాలోచించెదను."

"కుమారా! నేనును అదియే యాలోచించుచున్నాను. జూదమాడుట శాస్త్రగర్హితమని నా యభిప్రాయము."

"బావా! ద్యూతక్రీడ రాజనీతి ప్రసిద్ధము. అది యెప్పటికిని గర్హ్యము గానేరదు."

"శకునీ! నీతిశాస్త్ర పారంగుఁడు విదురుఁడు. అతనితో నాలోచించి జరుపనగు గాక."

"బావా! పక్షపాతియగువానితో నాలోచన చేయుట తగునా? అట్టివానివలన న్యాయము బైలువడఁజాలునా?"

"తండ్రీ! మామ చెప్పుట యథార్థము. విదురుఁడు పాండవ పక్షపాతి. కాఁబట్టి యతఁడు ద్యూతక్రీడ శాస్త్రగర్హితమనియే చెప్పును."

"బావా! రాజు లెల్లప్పుడు స్వబుద్ధి నుపయోగింపవలయును."

"జూదమాడుటకొఱకు మీరిప్పటికి రండని వారికిఁ జెప్పిపంపుట నాకు ఉచితమగునని తోఁచుటలేదు."

"అందుల కొక యుపాయము దెల్పెద వినుఁడు. నానారత్నవిచిత్రితమగు నొక సభను నిర్మింతము. దానిఁ జూచునిమిత్తము ధర్మరాజాదుల నిచ్చటికిఁ బిలిపింపుఁడు. ఆవలపని నా యధీనము."

"మండప నిర్మాణము మనచే నున్నది కాని ధర్మజాదులఁ బిలిపింప నచ్చినవాని నొక్కనిఁగా వంపవలయును."

"బావా! విదురుఁడే దానికిఁ దగువాఁడు."

"అట్లే యునర్చెదను."

వెంటనే ధృతరాష్ట్రుఁడు పాండవుల రావింప విదురునిఁ బంపెను. సుయోధనుఁడిట యుక్తమగునా కాదాయని మది నొక్కింత కాల మూలోచించి తుదకు ద్యూతక్రీడ సరియగు నదియే యని తీర్మానించుకొని సంతుష్టుఁడయి శకునితోడ నటనుండి వెడలి, పెక్కుర శిల్పాచార్యుల రావించెను. విశేష ధన వ్యయము చేసి మయునిర్మితమగు నాపాండవుల సభాభవనముతో సాటి రాఁదగు నొక మండపమును గట్టించి పాండవుల రాకకై నిరీక్షించుచుండెను.

రథికులు

ఆకాశ మధ్యగతుఁడగు సూర్యుఁడు అత్యంత ప్రతాప శాలియై విరాజిలుచుండెను. ఆతపమునని భీతిచే యెల్లరును వారి వారి యావసథములందు యుండిరి. అతరుణమున హాస్తినాపుర రాజవీథి నొకరథము వచ్చుచుండెను. అరథమున నేవురు

రథికులు నిర్వ్యాజము వాండ్రు నుండిరి. రథికులచెంత ప్రతియొక యాసనమున నొక్కఁడాసీనుఁడై యుండెను.

రథికులలో నొక్కఁడు రత్నకిరీటము ధరించియుండెను. ఆజానులంబములగు బాహువు లాతనికిఁ బెట్టని భూషణములయి యొప్పుచుండెను. అతని మోమునందలి తేజస్సాతని మహారాజత్వమును వెల్లడి సేయుచుండెను. అతని కుడివైపున నొక్కఁ డాసీనుఁడై యుండెను. అతఁ డున్నత కాయుఁడై పొడవుగనుండి బలముగలిగి యొప్పుచుండెను. అతనిహస్తము నందలి గదాదండ మాతని శౌర్యత్వమును బ్రకటించుచుండెను. అతని ప్రక్కనఁ దెల్లని యాకృతిగలవాఁ డొక్కఁ డమరియుండెను. జయంత వసంతాదులనుగూడఁ దిరస్కరింపఁ జాలు నాతని సౌందర్యము కామినీజన కాముకముగ నుండెను. కరమున ధరించియుండు చాప మాతఁడు ధన్వి యగుటఁ దెలుపుచుండెను. కిరీటధారియగు వాని యెడమ ప్రక్కన యిర్వురు యువకులాసీనులై యుండిరి. వీరుభయులును ఆకారముల నొండొరుల నించుకయు భేదింపకుండిరి. ఈ యేవురిలోఁ గిరీటధారి వీరికంటెఁ గొంచెము వయసు ముదిరిన వానివలెఁ దోఁచుచుండెను.

ఈ రథికుల కించుక దూరమున నాసీనలగు నంగన లిరువురలో నొక్కయామె యువతి. ఆమె నల్లని చాయగలిగి యుండినను యౌవనలావణ్యములతో విరాజిలుచుండెను. ఆమె యాకారసౌష్ఠవము చూడ మహారాజపుత్రికయగుట చెప్పకయ తెలియుచుండెను. ఆమె మోమించుక సేపు చూచు

చుండిన అనిర్వచనీయమగునట్టి యొకవిధమగు శక్తి ఆమె నావహించి యుండులాగున దోఁచుచుండెను. ఆవిశ ప్రక్కన నందుండిన వేఱొక యామె వృద్ధవనిత. వీరిరువురిలో యువతి శరీరమునిండ భూషణము లనేకములు దాల్చియుండెను. వారి యప్పటి యాకారములను గాంచినంతనే వృద్ధ వితంతువనుట విశదమగుచుండెను. ఆ రథమున వచ్చుచుండిన రథికవరు లొండొరు లిట్లు సంభాషింపఁ దొడఁగిరి.

"అన్నా! వీరూరక మనలఁ బిలుపనంపి యుండరు. వయసు చెల్లిన వాఁడయ్యును రాజిట్లు వీరి మాటలకు లోఁబడి యకార్యముల కొడిగట్టుచున్నాఁడుగా!"

"తమ్ముఁడా! నీవెప్పుడు నిట్లు మోటుతనము గలిగి యుండుట బాగుగాదు. బాల్యమునుండి నీవు వారి యెడ నాచరించుచున్న మోటుపనియే వారి యసూయకు మూలకారణము. దానికిఁ దోడు నీగదావిద్యా కౌశలము నగుచున్నది. ఎవ్వడు నొరుల నోనాడుటలో లాభమేమి?"

"అన్నా! చిన్నయన్న తప్పేమియుఁ బలుకలేదుగా! ముదుసలియయ్యును ఈరాజున కీదుర్బుద్ధి యేలయని కదా యాతఁడు నుడివెను?"

"అగ్నికిఁ దోడు వాయువు చేరినలాగున నున్నది. బాగు బాగు! మీకట్టి యభిప్రాయము గలిగియుండిన వారును మీయెడ నట్టి యభిప్రాయము గలిగియుండురో యాలోచించితివా? ఈకంటి కాకన్నెంత దూరమో అకంటి కీకన్ను నంత దూరమే యనుట యెఱుఁగవా?"

రథికు లిటు సంభాషించుచుండఁగ వారికించుక దూరమున నాసీనుఁడగువాఁ డిట్లనియెను.

“ఓ రథికవరులారా! మీ రేల వాదులాడెదరు? మును పటి కొడుకులయిష్టము ననుసరించువాఁడు. వారు తమ మాతులు నిచ్చచొప్పున నడుచువారు. వాఁడక్రమములకుఁ గైవట్టు. ఆలాగుననుండఁగా రాజువర్యులలో నక్రమములెట్లు లేకుండును?”

అని యాతఁడు పలుకుచుండఁగనే రథము రాజసౌధమునొద్దవచ్చి నిలిచెను. రథములోని వారిల్లను నగరులోని కరిగిరి.

జూదము

ధృతరాష్ట్రు నానతిని పాండవులు హస్తినాపురమునకు వచ్చిరి. అటరాచనగరునఁ బ్రవేశించి గాంధారీ ధృతరాష్ట్రాది గురుజనములకు నమస్కరించి వారివలన దీవనలఁ బడసిరి. సుయోధనాది సోదరవర్గము నాదరించిరి. బాంధవు లనేకులు రాఁగా వారి యోగక్షేమము లారసిరి. వీరూరికి వచ్చుట తెలిసి మిత్రులు పెక్కురు రాఁగా వారితో నిష్టకథాగోష్ఠి సల్పుచుండిరి. సుయోధనానుమతిచే పెక్కుడు శ్రద్ధతోఁ బరిజనులు సత్కరించుచు వారికుత్సాహమును వృద్ధిపఱచుచుండిరి.

అంత సుయోధనుఁడు వారిని సమీపించి;

సుయోధనః— అన్నా! నేనొక సభా భవనమును నిర్మించి యున్నాను. మీరు సోదరసహితులై యిటకువచ్చి దాని యందమును జూడవలయునని నాయభిప్రాయము.

ధర్మరాజు:— సోదరా! నీమాటల కన్యథా వచింతునే! తప్పక నీవెంటనే మే మీపురమును వచ్చెదము.

ఈ మాటలు వినిన సుయోధనుఁడు సపరివారుఁడై పాండవుల వెంట నిడికొని సభా భవనమునకు వచ్చెను. ధర్మజుఁ డా భవనము యొక్క యందమున కంతరంగమున నాశ్చర్యము నొందెను. అది సుధర్మతో సాటియగునది యని మెచ్చుకొనెను. ఇట్టి భవనముగల సుయోధనుని వైభవమును మిగులఁ గొనియాడెను.

ఇట్లాతఁ డాసభాభవనము కలయఁజూచి వచ్చియచ్చటి యాసనమున నాసీనుఁడయ్యెను. సోదరులును అతని ప్రక్కనఁ గూర్చుండిరి. సుయోధనుఁడు వారి యెదుటి వైపున నాసనమున నాసీనుఁ డయ్యెను. కర్ణ శకుని ప్రభృతులు అతని వెంటఁ గూర్చుండిరి. ఇంక ననేకు లాభవనమును జూచుటకై వచ్చిన వారు ఉచితాసనముల నధిష్ఠించి యుండిరి. అప్పుడు సుయోధనుఁడు ధర్మరాజును గాంచి;

సుయోధనః—అన్నా! మన మిచ్చట ఇంచుక ప్రొద్దు పోవుటకై అక్షక్రీడ సలుపుదము.

ఈ మాటలు వినిన ధర్మరాజిట్లు తలఁపఁ జొచ్చెను.

"ఆటయందలి తమక మొకవైపున నన్ను ప్రేరేపించు చున్నది గాని అది యక్రమమగుట నామానసము మాత్రము

దాని కంగీకరింపక యున్నది. వలదని వారింతమన్నను ఎచ్చట వీని మనసు నొచ్చునోయని యెంచుచున్నాను ఏమి సేయుదును? ఏ యుపాయము చేత వీనిని ఈ ప్రయత్నము నుండి మాన్పువాఁడను? సామవాక్యముల చేతనే ఈతని నరి కట్టవలయును.

అని యాలోచించి సుయోధనుని గాంచి;

ధర్మరాజు:—తమ్ముఁడా! జూదమాడుట యధర్మకార్యము. అది పాపమున కారకమగునది. క్షేమము గోరువారెవరును ద్యూతక్రీడకుఁ గడఁగరు. మహాత్ములు సప్తవ్యసనముల కెడగలుగ వర్తింతురు. వీని మూలమున యర్థధర్మములు నశించును.

ఇది విని బదులేమి చెప్పుటకును దోఁచక సుయోధనుఁ డూరకుండెను. సమీపమున నుండిన శకుని ధర్మరాజుఁ గాంచి;

శకుని:—ద్యూతకలా కుశలుఁడు లోకానుభవజ్ఞుఁడగును. దీని బుద్ధి వైశద్యము గలుగుటచే విఖ్యాతుఁ డగును. రాజనీతి దెలిసినవాఁ డెవ్వఁడును దీని దూషింపఁడు. జూదమాడుటకు వెలిచినచో నేనాడఁజాలననిన నిన్నిట నిర్బంధించు వారెవరు?

ధర్మరాజు:—ధర్మద్యూత మార్యసమ్మతము గాని మాయాజూదము పాపమునకుఁ గారణము. కాఁబట్టి ఇది తగదని యాడితిని.

శకుని:—ఇది ధర్మద్యూతమె యగును.

ధర్మరాజు:—అట్లే నామాటకు సమ్మతించితిని.

అంతఁ గ్రీడోపకరణములు సిద్ధపఱుపఁ బడియెను. అక్షఫలకమున కిరుపంకల నాడువారు పరస్పరాభిముఖులై యాసీనులగుట కనువుగా ఆసనములు వేయఁబడెను. ధర్మరాజు వానిలో నొకదానియం దాసీనుఁ డయ్యెను. సభాసదు లదిగని ఈలాగునఁ దలఁచిరి.

"ఔరా! ఏమి యీకాల వైపరీత్యము! ధర్మాత్ముఁడగు నీతఁడిట్టి యక్రమ ప్రవర్తనమునకు సాహసించెఁగా! ద్యూతానభిజ్ఞుఁడు ఎట్లు గెలుపొందఁ గలఁడు? జూదమునఁగల యాన ఇతని నిట్టియక్రమమునకుఁ బాల్పడు లాగునఁ జేయుచున్నది. తప్పక ఈతఁ డోడఁగలఁడు. దీనఁ బెక్కుకష్టములకు గుఱికాఁగలఁడు. వఁదని వారింత మన్నను మన మాట వినఁడని తోఁచెడిని. వయోవృద్ధులును, జ్ఞానవృద్ధులునగు పెక్కురుండునట్టి యీసభలో ఈలాగున నిర్భయముగా ఆడుట కుపక్రమించుట కెంతటి సాహస ముండవలయును? ఇట్టి తెగుదారి తనమునకుఁ గడఁగినవాఁ డేలాగున ఒరుల హితము వినఁగలఁడు? తెలిసి తెలిసి ఇట్టియనుచిత కార్య మాచరించిన, దోష మీతనిపైనఁ గదా నిలుచును? ఒరులకు వేన వేలు ధర్మము లుపదేశించు వాని కిది పాపమని ఏల తెలియ కుండును? చేటుకాలము దాపించినవాఁడు ఇది తగదని యెట్లు వీడఁగలడు?"

అని యా సభలోనివారు తలఁచుచుండిరి. ఆసనాసీనుఁడగు ధర్మరాజు సుయోధనుని గాంచి;

ధర్మరాజు:—సుయోధనా! ఇంక నాడుటకుఁ దొడఁగ వచ్చును గదా! ఏల యాలసించెదవు?

సుయోధన:—నాకు బదులు నామామ యాడఁగలఁడు.

అని తన యాభరణముల విడిచి పందెమునకై క్రింద నునిచెను. ధర్మరాజు కాలోపహతుఁడు కాఁబట్టి యొకనికై వేఱొకఁ డాడుట యుక్తమా యనుట యాలోచింపక తన యాభరణములఁ దీసి యెదురొడ్డెను. ఆపల వారిరువు రాట కుపక్రమించిరి. ధర్మజున కపజయము గలుగఁ జొచ్చెను. ఓడు కొలఁదియును ఆతనికి మత్సర మధిక మగుటచేఁ గ్రమముగ ధన, కనక, వస్త్ర, వాహనాదులతోడి రాజ్యమెల్ల నోడెను. తన సోదరుల నొడ్డి యోటమి గాంచెను. తన్నొడ్డి పరాజితుఁ డయ్యెను. తుదకు ద్రౌపదిఁ గూడ నొడ్డి ఓడిపోయెను. ఇంక నొడ్డుట కేమియు లేనందున విషాదము నొందెను. సభాసదులు ఇది గని మిక్కిలి చింతించిరి.

ఓదార్పు

“రాజేంద్రా! నీకుమారుఁ డతిక్రూరుఁడై జూదమునఁ బాండవుల నోడించెను. ద్రౌపదిని సభామధ్యమునకుఁ బిలిపించెను. భీముఁ డాయసమతిచేఁ గోపించి నీకుమారుల సంహరింతు నని శపథము గావించెను. ఇంక నీసుతులకు వినాశకాలము సమీపించె నని తలఁచుచున్నాను.”

అని యిటు విదురుఁడాడిన పలుకులు విని ధృతరాష్ట్రుఁడిట్లు తలపోయఁ దొడఁగెను.

“ఆహా! చెట్టు చెడు కాలమునకుఁ గుక్కమూతిపిందె జనించు ననుట నిశ్చయము. వీని మూలమున నావంశ మంతరించులాగునఁ దోఁచెడిని. ఆదినుండియు విదురుని హితము వినకుండినందుకుఁ దగిన శాస్తియాయెను. వీని చెలులయిన వారికిఁ బ్రియవాదమనినఁ గర్ణాది దుర్మంత్రులు చేరి సన్మార్గమునఁ జడనీక చెఱుచుచున్నారు. మొట్టమొదటనే వీనిఁ దారికిఁ దేవలసి యుండెను. అప్పుడెల్లఁ బుత్రప్రీతిచే విచ్చలవిడిగా విడుచుటచే నేఁడిట్టి యక్రమప్రవర్తనకుఁ గడఁగెను. దోషము నాపైఁ గలుగ నొరుల దూషింపనేల? ఇప్పుడైన విదురునితో సంప్రతించి వాని యభిప్రాయము చొప్పున నడచికోలు మేలగును”

అని వితర్కించి చెంతనుండు విదురునితో నిట్లనెను.

“విదురా! నాఁటినుండి నీమాటలు వినకుండినందునఁ గదా యింతలు పుట్టెను! ఇంక నేఁటి యాపద గడచుటెట్లు? ఏలాగునఁ బాండవుల క్రోధమును శాంతింపఁ జేయవచ్చును? పతితిలకమగు యాజ్ఞసేనిని ఎట్లు ప్రసన్నురాలిం గావింపవగును? ఇందులకుం దగు నుపాయము చెప్ప వలంతివి.”

“రాజేంద్రా! ఇప్పటికైనఁ బాండవుల రావించి వారి రాజ్యము మఱల వారి కిప్పింపుము. అంత వారవగత క్రోధు లగుదురు. అట్లైన నీసంతతికిఁ గీడు కలుగకుండఁ గలదు.”

విదురుని యీ హితోపదేశము వినిన ధృతరాష్ట్రుఁడు ద్రౌపదీ సమేతులగు పాండవులను దన చెంతకు రావించి;

“ధర్మాత్ములారా! జూదమువలన మీకలవడిన దాస్యవృత్తినుండి మిమ్ముఁ దొలఁగించితిని. మీ రాజ్యమును మీ కిచ్చుచున్నాను. నా కొడుకు నేరమి నాచరించిన యీ నేరమును క్షమించి వానియెడఁ బ్రసన్నులుగండు. మీరింద్రప్రస్థమున కరిగి యథాపూర్వము రాజ్యము పాలించుచు సుఖముగా నుండుఁడు.— ద్రౌపదీ! లోకులు తాము చేసిన సుకృత దుష్కృతముల మూలమున సుఖదుఃఖము లనుభవించుచుందురు. సంసారము ద్వంద్వసహిత మనుట నీవెఱుఁగనిది కాదు. పరతంత్రమగు నీసంసారమును సూత్రధారుఁడు బొమ్మల నాడించు లాగున ఈశ్వరుఁ డాడించుచున్న వాఁడు. జనులాతనిచేతి కీలుబొమ్మలయి మెలఁగుచున్నారు. కాఁబట్టి భంగపఱచువా రెవరు? భంగపడువా రెవరు? ఇది తెలిసిన నీయట్టి వారాగ్రహము పొందరనుట నిక్కము.”

ధృతరాష్ట్రుని యీ సాంత్వవచనముల మూలమున ద్రౌపదీ భీమార్జునులు దక్కఁ దక్కినవారు శాంత క్రోధు లయిరి. వారి కాగ్రహము తగ్గకుండినను ధర్మసుతుని యాజ్ఞ కెదురాడలేనివా రగుటచే మంత్రబద్ధములగు సర్పములవలె ఏమియు బదులాడక యూరక యుండిరి. అంత రాజు వారిని కథారూఢులఁ గావించి యింద్రప్రస్థమునకంపెను.

అరణ్యగమనము

పాండవులఁ గారవించి రాజనుపిన పిమ్మట సుయోధ నుఁడు శకుని మున్నగువారిని బిలిచి యిట్లనెను.

సుయోధనః— తెలియునే మాతండ్రిచేయుచున్న నేత ! పాండవుల రావించి వారిరాజ్యము వారికొసఁగి మఱల ఇంద్ర ప్రస్థమున కంపెను! శత్రువులఁ బరాభూతులఁ గావించి పిదప వారిని గారవించిన మాత్రమున శాంతివము మానునే? తలఁచిచూచి వారు మనల హింసింపకయుందురే? దెబ్బదినిన పాము దప్పించుకొని కలుగులో దూరినంత మాత్రాన అది వెడలెను గదాయని సంతోషింపవచ్చునే? పగవట్టి మనలఁ గాటువైపక విడుచునా? ఇతఁ డాచరించిన కార్యము మనకు మేలుగాదు. విదురుఁ మాటవిని ఈలాగునఁజేసెను. అతఁడు పక్షపాతియగుట తెలిసియును అతనితోడనే మఱల మఱల ఆలోచించు చుందును. నేనేదే నడిగినఁ "దండ్రీ! నీకేల వారలతోడి వైరము? ఇంకనైనఅన్యులమాట వినకవారలతో మైత్రి గావింపు" మనును.

శకునిః—నీవేఁగి నీతండ్రితో మఱల వారిని బిలువనంపు మని వేడుకొనుము.

సుయోధనః— నే నింతకుమున్నరిగి యుంటిని. మా తండ్రితో వారిని బుద్ధ్యాగముకొఱకుఁ బిలువనంపుమని చెప్పితిని. మొట్టమొదట అతఁడు వారిఁ బిలువ నంపుట కంగీకరింపఁ డాయెను. తాను రాజ్యమునొసంగి మఱల వారి రాజ్య మపహరించుటకుఁ గారకుఁడు గారాదని నా మాట నిరాకరించెను. అపవాద పాత్రుఁడ నగుదును గాన నీవని

చేయుననెను. ఆవల నేను, వారలఁ గొంత కాలము దేశము నుండి వెడలఁగొట్టుదు నంతియు కాని రాజ్యము నపహరింప ననియుఁ, దిరుగ వారు వచ్చులోపలనే రూఢమూలుల మగుదుమనియును యెంతయో బోధించినంత నా మాట కెదురాడలేక యొప్పుకొనెను. వారిని బిలుచుకొనిరాఁ బ్రాతి గామిని బంపియున్నాఁడను. వారిప్పుడు తిరిగి యిచ్చటికి వచ్చు చుందురనియే భావించెదను.

అటఁ బాండవులు ధృతరాష్ట్రునానతిచొప్పున మఱలి వచ్చుచుండిరి. ధర్మరాజు నిష్కపట స్వభావుఁడగుటచే మగుడఁ దండ్రిని సోదరులను జూడవచ్చును గదా యని సంతోషించుచు వచ్చుచుండెను. భీమార్జునులు మాత్రము రాజీలాగునఁ బిలిపించుట యేదేనొక కపటకృత్య మాచ రించుటకే యని నిశ్చయించిరి. మఱల వారలు దమప్రతినలు సఫలములు గావచ్చును గదా యని యించుక సంతోషము నొందిరి.

పాండవులు మగిడి హస్తినకువచ్చి చేరిరి. యథావిధి సభామండపమునకు రాఁగనే శకుని వారిఁగాంచి యిట్లనెను.

శకుని:—ధర్మసుతా! పునర్ద్యూతమునకై మిమ్మిప్పుడు రాజు రావించియున్నాఁడు. ఇందు మీరాజ్యమును బందెముగా నొడ్డుట సరికాదు. యేలన? రాజేంద్రుఁడు మఱల మీకు రాజ్యమిచ్చి యుండుటచే దాని నొడ్డుట యయుక్తము. అట్టి పందెమున కేమిచ్చగింపము. ఇంక నెద్దే నొకపణ మొనరింప వలయును గదా? దేనినొడ్డఁ దలఁచి యున్నారు?

ధర్మరాజు:— అట్టి దెద్దియే నుండిన నీవే తెలుపుము.

శకుని:— ఇప్పు డెవ్వరోడినను బండ్రెండేండ్లు లరణ్యవాసము సలుపవలయును. పదమూఁడవయేఁట నెద్దేని యొక జనపదమున కరిగి యజ్ఞాతవాస మొనర్పవలయును. ఈ పందెమున కొట్టపడితివేనిఁ బునర్ద్యూత మాడఁగఁదగును.

ధర్మరాజు విధిప్రేరణచే ఆ పందెమున కంగీకరించెను. యథాపూర్వ మపజయ మందెను. అంతఁ బాండవులాభరణాదుల వీడి, వల్కలాజినముల ధరించిరి. ద్రౌపదితోడ నచ్చటి గురుజనములకు నమస్కరించి, వారి యనుమతి వడసిరి. అటనుండి కదలి కుంతీదేవియొద్దకు వచ్చిరి.

ఆబిడతో జరిగిన విషయమెల్లఁ జెప్పి ఆమెను విదురుని యింట నుండవలయుననిరి ఆమెయు నెంతయు విషాదమంది;

కుంతి:— సుతులారా ! నేఁటివఱకు మిము వీడక ఎట్లో భర్తృమరణ వ్యసనమును మానసమున నణఁచికొని యుంటిని. ఇంక నొంటరినై యిట నుండుట కెట్లోర్తును? అట్లని మీతో నరుదెంచి మీకుఁ గష్టము లీయ నెంచుటలేదు. విదురుఁడు ధర్మాత్ముఁడు. అతఁడు పరోపకార పారీణుఁడు. మహాభాగుఁ డగు నాతనియింట నుండుటకు నేనంగీకరించెదను. కష్టములు గడచివచ్చి నన్ను మఱల మీరాదరింపఁ గలరు. ధర్మము మీకు జయమొసఁగును గాక. సత్యము మీకు శుభము లిచ్చును గాక.

ఇట్లు తల్లివలన నాశీర్వాదములను బడసిన పాండవులు హస్తినవదలి యరణ్యమున వసింప నరిగిరి.

రహస్యాలోచన

పాండురాజసుతు లడవిని నానావిధ కష్టములువడయు చుండిరి. సుయోధనుఁడు దనచారుల మూలమున వారి యప్పటప్పటి స్థితి నరయుచుండెను. అరణ్యము నందలి క్లేశములను లెక్కసేయక వారు నిశ్చింతులై యుండుట దెలిసి యాతని కంతస్తాపము గలిగెను. అభిమానియగు వీరుఁడు తన విరోధియొక్క వైభవముచూచి యోర్వకుండుట సహజమే కదా! సుయోధనుఁడు పాండవు లిడుములు గుడువవలయునని తలఁచి వారిని గానలపాలు గావించెను. వారి కప్పటి పాటులు దుఃఖకరములు గానప్పుడీతని యుద్దేశము వ్యర్థ మగుటలేదా? అలాగునఁ దన యభిమతము సార్థకము గానందునఁ జింతాక్రాంతుడై యుండెను. అప్పుడప్పుడు విదురుని బోధన వినిన ధృతరాష్ట్రుఁడు పాండవులఁ బొగడుచుండుట ఈ వ్యసనమును మఱింత యతిశయింపఁ జేయుచుండెను. అంత నొకనాఁ డాతఁడు దన యనుజ వర్గముతోడను, కర్ణాది మిత్రవర్గముతోడను గూడి రహస్యాలోచన, మొనర్పఁదొడఁగెను.

సుయోధనః—మామా! మాతండ్రి యేల ఇంతటి వెఱ్ఱియయ్యెను? భీముని తేజము చెప్పనలవి కానిదఁట. వాఁడు అన్న మాటల జవదాఁటఁడఁట, అర్జునుఁడు గడు బలవంతుఁడఁట. ఈ భూమండలమంతయును ఆతనికే లోఁబడి యుండవలసినదఁట. రాత్రి నశించినంతఁ బగలును, బగటి కావల రేయియు వచ్చులాగునఁ గొంతకాలము సుఖమనుభవించితిమి గావున మనకు దుఃఖములు రానున్నవఁట.

పాండవులపైఁ గల యభిమాన మతనిని ఈలాగునఁ బలికించు
చున్నది. తండ్రియగుటచే గౌరవార్హుఁడగు నాతని మాటల
కెదురాడ లేక అతఁ డేమి సెప్పినను వినుచు నూరకున్నాను.

శకుని:—వృద్ధుఁడగుటచే నీతండ్రి మతిసెడి ఇట్లు పలుకు
చున్నాఁడు. అతనిమాటల మన మేల లక్ష్యము సేయవలయును?

సుయోధన:—కన్న పెంచిన యాతనిమాటల గౌరవ
ముంచవలయును గాదే! కాఁబట్టి అతని పలుకుల యం
దనాదరము చూపఁదగదు. అతఁడు మాత్రము నామాటల
నిరాకరించుచున్నాఁడా? పాండవ పక్షపాత మవ్వాడవ్వాను
తలచూపుచుండినను మనయెడ నభిమానము వీడకున్నాఁడు
గదా?

కర్ణ:—నీమాటలు నాకు నచ్చకున్నవి. నిక్కముగ
నీయెడ నాతనికిఁ బ్రీతియుండిన నీతండ్రి పాండవులఁబొగడునా?
ఇంక నీవిట్టజ్ఞానమునఁ బడకుము. నామాటల వినుము. మహా
రాజవైతివి. రాజరాజ బిరుదము నంది వెలయుచుంటివి.
పౌరజానపదులు నీక్షేమమునే కోరుచున్నారు. కాఁబట్టి
నీయిచ్చ చొప్పుననే కార్యములనెల్ల జరుపవలయును.

దుశ్శాసన:—అంతయు సమంజసముగనే యున్నది. గాని
శత్రుశేష మింకను అట్లే నిలిపియుంచుట సరికాదు. వారిప్పు
డగతికులై కానలఁబడి గాసిసెందుచున్నారు. వారిని సమూల
ముగా ఛేదించుటకు ఇదియే తగిన తరుణము.

అనువింద:—గుప్త మార్గమున వారిఁ గడతేర్పు
టుచితము.

కర్ణః—శౌర్యవతుఁ డెప్పటికిని ఇట్టి కార్యమునకుఁ గడఁగడు. శత్రువుల నోర్చి గెలుచుటయు పౌరుషమగును.

శకుని:— విషమునకు విషమే యౌషధమగునట యెఱుఁగవా? వంచకులయెడ వంచనయే ప్రయోగింపఁదగినది.

వికర్ణ:—మీవలె వారు వంచకులు గారు.

శకుని:— ఓరీ! పసివాఁడవు నీకేమి దెలియును? రాజునెడల భక్తివినయము చూపుచుఁ, బ్రజలయెడ సత్యాదరము చూపుచు వారుండినది రాజ్యమాక్రమింపఁ దలఁచియే యగును. ఇది వంచన కాదా? శత్రువులు మరణించిరని తలఁచి మనము నిర్భయులమై యుండవలయునని యెంచి లాక్షాగృహము నారు దహించి యరిగినది కపటకృత్యము గాదే? బ్రాహ్మణవేషమున వచ్చి ద్రౌపదిని బరిగ్రహించినది మాయాకార్యమే కదా? నాఁడు జరాసంధునొద్దకు బ్రాహ్మణవేషమున నరిగి యుద్ధభిక్ష మడిగినది సత్యప్రవర్తనము కాఁబోలు? ఇట్టి వారిని మనము హింసించిన దోషమేమి?

సుయోధనః:— ఎల్లప్పుడును హింసాపరత్వము కాని మీ కన్యచింత గాన్పింపదు. మీ రాచరించిన ప్రయత్నమెద్ది కొనసాగెను? నాఁడు వలదనిన వినక భీముని సంహరింప యత్నించితిరి. యేమాత్రము ఫలించెను? లాక్షాగృహదహనమునకు నన్ను బురికొల్పితిరి? దానివలని యపవాదము నే నపనిందల పాలగుటయే కదా? జూదమాడి

వారిని వెడల నడచితిరి ? దానివలనఁ బ్రయోజనమేమి గల్గెను ? వారించుకైన అరణ్యవాస క్లేశమునకుఁ జలింపరైరిగా!

శకుని:—సుయోధనా ! నామాటవిని జూదమాడుటచేఁ గదా యిప్పుడు నిస్సపత్నముగ రాజ్యమేలుచున్నావు ? వారి యెడ నీకంతటి యనుగ్రహమున్నచో వారినిఁ బిలిపించి మఱల వారికి రాజ్యమిమ్ము. కాదని యడ్డుపడువా రెవరు ?

సుయోధన:— గతమును గుఱించికదా వచించితిని ?

వికర్ణ:— మనమిప్పుడు రాజ్యము నిచ్చెద మనినను వారు ప్రతిజ్ఞాభంగము గావింపరు.

సుయోధన:— మన మాచరించినది యక్రమకార్య మనియు, దాన లాభము శూన్యమైనదనియుఁ గదా వచించితిని?

కర్ణ:— నీ తండ్రికిఁ బాండవులయెడఁ బక్షపాతము మెండుగఁగదా పలికితివి ? నీకీ ధర్మాభాసచింత తఱచుగఁ గలుగుట కేమి కారణము ? రాజులకు శాత్రవహనన మధర్మము కాదు. నాఁడు నేఁజెప్పినపుడే యుద్ధమున నాక్రమించి యుండినచో ఈపాటికే వారుండినచోటఁ బూరి మొలిచి యుండును గదా ?

సుయోధన:— మన కవమానము గలిగించిన వారికిఁ బ్రతిగా మనము గర్వభంగము గావింప వలయుననుట యొక్కటియే యాదినుండి నాయుద్దేశము. ఒకరిని హింసించుట నా యభిమతముగాదు. శత్రువు చచ్చిన వానియెడఁ దిరుగఁ బగ సాధింపఁ గలమా ? జీవముతో నుంచి వానిని దఱుముగ దుఃఖాక్రాంతుని గావించుట కదా సంతోషదాయకము?

కర్ణ:— నీకట్టి యుద్దేశముండిన నా మాట చొప్పున నాచరింపుము. పాండవు లిప్పుడు ద్వైతవన సరోవరము చెంత నున్నారని కదా మనచారులు వచించి యుండిరి? గంభీర స్వభావులగుటచేఁ దమదుఃఖము బైటఁజూపకున్నను మానసమునఁ జింత యుండకదని తలఁచితివే? నీ విపుడు సామ్రాజ్య వైభవముతోడ వారున్నయెడ కరుగవలయును. గోరుచుట్టుపై రోఁకటిపోటు దగిలిన లాగున ఇదివఱకే దుఃఖితులగువారు నీ వైభవము చూచి మఱింత దుఃఖింపఁగలరు.

సుయోధన:— నేఁ దలఁచినదియు నదియే యగును. మిత్రజనులకు సంతోష మొదవించులాగున, శత్రుజనులకు దుఃఖము కలిగించుట కదా సంపద గలిగియుండుట వలని ప్రయోజనము? మనమచ్చటికి కరుగుటకు మా తండ్రి సెలవీయఁ డేమోయని తలఁచెదను.

కర్ణ:— ధైర్యసాహస సంపన్నునకుఁ గాని సంపద నిలువఁజాలదు. మహారాజవగు నీ వా ముదుసలి యానతి కేల యెదురు చూడవలయును?

సుయోధన:— మా తండ్రి యనుమతి లేనిదే నే నే కార్యము నాచరింప సాహసింపను.

కర్ణ:— నీవు నిక్కముగ నీ జనకు నానతి దాఁట వాఁడవైనచో అతఁడాజ్ఞ యిచ్చుట కేదేనొక యుపాయ మాచరింపవలయును?

వికర్ణ:— ఇంతదాఁక పాండవులు వంచకులని యీ శకుని నుడివెనుగదా? మా తండ్రి నమ్మించుట కేదేని కుయుక్తి గావించుట మాత్రము వంచనగాదే?

శకుని:— ఇది వంచన యెట్లగు? రాజులొనర్చు తంత్రములలో నిది యొకటి. సుయోధనా! వేఁటకు వెడలు నెపమున తండ్రిగారి యానతి గొనుము.

కర్ణ:— పాండవులు ద్వైతవనమున నున్నారనుట యాతఁడెఱుఁగును. కాఁబట్టి వేఁట కేఁగవలయు నన్నను అతఁడా వైపునకుఁ బోవలదనియే చెప్పఁగలఁడు. ద్వైతవన ప్రాంతమున మనకు గోవులు విశేషించి యున్నవి. వానిఁజూడఁ బోవలయు నని ఆజ్ఞ యీఁగలఁడు.

శకుని:— గోవులఁజూడ నిప్పుడేమవసరమని చెప్పి మన మాటను త్రోసి పుచ్చవచ్చును.

కర్ణ:— మిత్రవరా! సమంగనామధేయుఁడగు గోపాలుఁడొకఁడు గలఁడు. వాఁడు మనమెట్లు చెప్పిన నాలాగునఁ బలుకఁగలఁడు. "ద్వైతవనమునందలి పశువులు దుష్టమృగ బాధితములై నశించుచున్నవి. కాఁబట్టి క్రూరమృగ నాశనమునకుఁగా మీకుమారుఁడు సుయోధను పంపవలయు" నని వాని ముఖమునఁ జెప్పింతము. అప్పు డాతఁడు తప్పక నిన్ను బొమ్మని యాజ్ఞ సేయఁగలఁడు?

సుయోధన:— నీ యూహ కడు మెచ్చఁదగినది. రేపు ఉదయముననే ఆ ప్రయత్నము చేసెదము.

అని యటనుండి కదలి యందఱును వారివారియిండ్లకేగిరి.

ఘోషయాత్ర

ధృతరాష్ట్రు ననుమతిని సుయోధనుఁడు ఘోషయాత్ర వెడల నెంచెను. బ్రాహ్మణులకు యాత్రాదానము సేసెను. పురోహితులు పుణ్యాహ జలముల నాతనిపైఁ బ్రోక్షించి మంగళాశీర్వాదములు గావించిరి. పుణ్యాంగనలు సేసలు చల్లిరి.

అంత జ్యోతిషికోద్దిష్టమగు శుభ ముహూర్తమున సుయోధనుఁడు వెడలెను. ముందుఁ దూర్యధ్వానములు సల్పుచుఁ గొందఱు నడుగుచుండిరి. వారి వెనుకఁ జతురంగ బలములు గదలుచుండినవి. వానిపిఱుంద జయజయధ్వానములు సేయుచు, బిరుదావళిఁ బాడుచు వందిమాగధ జనులు నడుచుచుండిరి. పిమ్మట సుయోధనుఁడు రథారూఢుఁడై చనుచుండెను. వాని వెనుక నతని సోదరులును, కర్ణాది మిత్రులును నడుగుచుండిరి. ఆవల నంతఃపుర నారీవర్గము శిబికలయందెక్కి పరిచారికాజనము చుట్టుముట్టి వచ్చుచుండ నేఁగుచుండెను. వారి కావల మఱలఁ జతురంగ బలము వచ్చుచుండెను.

ఇట్లఖండవైభవముతోడ సుయోధనుఁడు పురమునుండి బయలువెడలెను. మార్గమున ననేకారణ్యములఁ దాఁటెను. పెక్కునదుల నుత్తరించెను. ఘోషములుండు స్థలమునకుఁ జేరెను. రాజరాజురాకను మిక్కిలి యలరిన గోపకులెల్ల రచ్చటికి వచ్చి యాతనిఁగాంచి;

"స్వామీ! మహారాజ సందర్శన మబ్బిన యీదినము గదా మాకు సుదినము! దేవరవారి రాకవలన మేముకాక

మానవములు నెంతయు సంతసమందుచున్నవి. అదె యావెల్ల కోడె బసవఁడను పేరఁబరఁగినది. మిమ్ముఁ నందర్శించి యుత్సాహమున నత్తత్తి అంకెవేయు గమకించుచున్నది చూడుఁడు. అల్లదె కత్తెమూఁడ కృష్ణాంగ మనునది. తన నేత్ర పుటముల మీ ముఖ సౌందర్యామృతము గ్రోలుచున్నది వీక్షించితిరే? ఈ కపిలవన్నె యావు నందినీ నామకము. మిమ్ముఁ జూడఁ గలుగుటచే ద్విగుణితోత్సాహముతో నిశ్చలమై నిలిచి యున్నది.

సుయోధన:— గోపకులారా! మీ రాజభక్తి మిక్కిలి మెచ్చఁదగినది. మీకును మీ పశుగణమునకును గుశలమా?

గోపాల:— దేవరవారు రాజ్యమేలుచుండ నేరికేఁగాని కుశలమునకేమి కొదువ! మీ యనుగ్రహమున జలసమృద్ధియుఁ, దృణసమృద్ధియుఁ గలిగియుండెను. ఇంతకంటె మాకేమి కావలయును? పశువులు గడుపారమేసి మంచినీరు ద్రావి నెమరు వేయుచుండఁ జూచుచుండు మా యదృష్టము మీకటాక్షమునఁ గలిగినదే!

సుయోధన:— మేము ఇచ్చటి పాలము గలయఁజూడ నెంచుచున్నాము.

గోపాల:— దేవరచిత్తము.

అని యాతనిం దోడ్కొని చనుచు;

గోపాల:— సార్వభౌమా! ఈ యెదుటఁ గనుపడు నాగుడిసె మామందరునిది. వాఁడె గూడెమునకెల్ల మేటియగు వాఁడు. ఆతఁడొకనాఁడు ఇచ్చటికి దాపుననుండు ఘోరా

రణ్యమున వేఁటాడుటకై యరిగెను. ఒక్క పులి వచ్చి వానిపైఁ బడ నుంకించెను. వాఁడు దాని మూఁడు బాణముల సంహరించెను.

సుయోధనః— అశూరుఁ డిప్పుడెచ్చట నున్నాఁడు?

గోపాలః— వాఁడిపుడు గిరివ్రజమున కేఁగి యున్నాఁడు. ఆ తాటియాకుల గుడిసె మాసంగునిది. అతఁడెట్టి దుష్టపశువు నైనను ఒక్కనిముసములోఁ దనవశము గావించుకొనఁ గలఁడు. తూర్పువైపునఁ గాన్పించు నావెదురుపాక మానందునిది. వాఁడు మావ్రజములోని పశువైద్యుఁడు.

సుయోధనః— మీకిట జీవన మెట్లు జరుగుచున్నది?

గోపాలః— అల్లదె యుత్తరపు వైపునఁ గనుపించు పొలమున నీవార ధాన్యము పండుచున్నది. అదియే మాజీవనమున కాధారము.

సుయోధనః— ఆపొలములోని ధాన్యమును మీరు గ్రహించుకొని పోవుటకుగా మాకెంతపన్ను చెల్లించు చున్నారు.

గోపాలః— పంటలోని షష్ఠాంశమును మీకుఁ జెల్లించు చున్నాము.

సుయోధనః— మేము మీ వనమున వేఁటాడ నెంచు చున్నాము.

గోపాలః— ఇందుఁగల క్రూరమృగము లేరిని హింసించుటలేదు. హింసాకరములగు మృగములను గదా రాజులు వేఁటనెపమున సంహరించుచున్నారు.

సుయోధనః—క్రూరజంతువు లిప్పుడు హింసింపలేదు గదాయని వానిని సాధువులని యెంచఁబోకుఁడు. జాతికి సహజ మగు వాని హింసాగుణము మానఁజాలదు. ఇప్పుడు వాని కచ్చట నేదే నెఱచిక్కుటచే నూరకున్నవి. లేని మఱల హింసకుఁ గడఁగవచ్చును. కాఁబట్టి రేపు మాయనుచరుల మూలమున ఈ యడవియందుఁగల దుష్టమృగములు నశింపఁ గలవు.

అనియాడి వారలతోడ నటనుండి కదలెను.

వేఁట

ద్వైతవన ప్రాంతమునఁ బెక్కు క్రూరమృగము లుండె డివి. అచ్చట మహర్షు లనేకులుండుటచే నెట్టిరాజులును వేఁ టాడ వచ్చుటలేదు. తపశ్శీలురగు నాధారణీ సురుల సహ వాసము మూలమున అచ్చటి మృగములు పరస్పరము మైత్రి గలిగి వర్తించు చుండెడివి. ఒక్కెడఁ బశువులు పులులతోడను, సింగపుఁగొదమ లేనుఁగుల తోడను జెఱలాట సలుపు చుండెను. మఱియొక ప్రదేశమునఁ బిల్లులు నెలుకలును జేరి నీవార ధాన్యము నేరి తినుచుండెను. కాకములు ఘూకముల కెఱ నందించు చుండెను.

అట్టి యడవిని ఒక్కనాఁటి యుదయమున నొక రాజు వేఁటాడవచ్చి యుండెను. రాజును రాజ బంధువులును

వసించుటకుఁ దగుచోటికి యమర్పఁబడెను. రాజభటులుం గొందఱు వేఁటకువలయు సాధనములఁదీసికొని వచ్చుచుండిరి.

ఇట్లు పరిజనులెల్లరు నా ప్రదేశమునకు వచ్చినంతనే వేఁట యారంభ మయ్యెను. రాజభటు లనేకులు దుష్టమృగముల సంహరించు చుండిరి. వేఁటగాండ్రతోడ వచ్చిన వేఁట కుక్కలు పొదలలోఁ జొచ్చి పెక్కుజంతువులఁ జంపుచుండెను.

రాజు నవక్ర పరాక్రమమున ఆయడవిని గలజంతు జాలములనెల్లఁ గలఁచెను. చెంతవచ్చినవాని ఖడ్గప్రహారమున సంహరించెను. పాఱిపోవువాని బాణములు వైచి చంపెను. వీరి వేఁటకతమున ఆయరణ్యమునఁ గల మృగముల సంఖ్య స్వల్ప కాలము లోననే తగ్గఁ జొచ్చెను.

అంతఁ గొంతవడికి మృగయా పరిశ్రాంతుఁడగు రాజు ద్వైతవన సరోవరతీరమున కరిగి అచ్చటఁగల యొకగున్న మామిడినీడ నాసీనుఁడయ్యెను. ఇంతలోనఁ గొందఱు గోపకు లరుదెంచి అమృతముతో సమానమగు నావుపాలు దెచ్చి యిచ్చి త్రాగుమనిరి. వారి వేఁడికోలు చొప్పున నరపాలుఁ డా క్షీరములఁ గ్రోలి తనివిపొందెను. ఇంతలోనఁ జెదరి యుండిన యాతనిభటు లచ్చటికివచ్చి చేరిరి. రాజు దన పరివారమును గాంచి;

“మీ యీనాఁటివేఁట కడుమెచ్చఁదగినది. మీరెల్లరు మీ కష్టమునకుఁ దగినలాగున బహుమతుల నందవలసి యున్నారు. శిబిరము చేరినవెంటనే యా కార్యము జరుగఁ గలదు.”

"దేవా! సేవకులమగు మేము చేసిన యీకార్యము మాధర్మము గాని వేఱు గాదు. మీమెచ్చుకోలునకుఁ దగినంత పని యేదియు మేమాచరింపలేదు. ఇట్టి స్వల్ప కార్యమునకా మీరు బహుమతు లొసఁగనున్నారు? మీయభిమానమునందిన మాకదియే పదివేలు?"

"భృత్యధర్మమును బాటించి మీ రిట్లాడుట మీకు సహజమైనను నాయుత్సాహమునకుఁ దగులాగున నే బహూకరించుటయే యుక్తము. నా యిప్పటి యుత్సాహము చొప్పుననైన మిమ్మిప్పుడే గౌరవింపవలసి యుండును. మా వారెల్లరు చూచుచుండ మిమ్మాదరింప వలయునను పట్టుదల యొకటి దాని కడ్డువడుచున్నది. వారింకను రాకుండుటకుఁ గారణము తెలియకున్నది."

"వేటాడ నరిగినవారు రాక యేల తడయుదురు? తామీ జలాశయమునొద్ద నుండుట వారికెట్లు తెలియఁగలదు? తా మచ్చటఁ గాన్పింపమిఁ దిన్నఁగా శిబిరమునొద్దకు వారేఁగి యుందురు?"

"ఔనౌను. మీ యూహ సరియగునదే. మనమింక నిటఁ దడయ రాదు. శిబిరమునొద్దకుఁ బోవుదము. రేపుదయమున నీ జలాశయము నొద్ద నాకొక క్రీడాగృహమును నిర్మింపుము. ఇది వాసయోగ్య మగునది. మన రాచనగరును ఇంతటి సౌఖ్యము నీజాలదు."

అని యా రాజు నిజపరివారము తోడను గోపకుల తోడను బటకుటీరములుండు వైపున కరిగెను.

మానభంగము

"ఓ రాజభటులారా! ఈ కొలను చిత్రసేనుఁడను గంధర్వ రాజునకుఁ గ్రీడార్థముగాఁ గల్పింపఁబడినది. కాఁబట్టి మీ రీ ప్రదేశమునుండి తొలఁగిపొండు. లేకున్నఁ గష్టముల పాలగుదురు."

"ఓ వికృతాకారులారా! రారాజగు సుయోధన మహారాజీ ప్రదేశమున కెల్ల నధికారి యనుట దెలియదా? మేము వారి భటులము. మీరు నుడివిన చిత్రసేనుఁ డెవ్వఁడగు నదియు మాకుఁ దెలియదు. అట్టి యప్రసిద్ధుని కొఱకా ఈ కొలను నిర్మింపఁబడెను? చాలు చాలు మీ పలుకు లిఁక నూరకుండుఁడు. నలువురు విన్న నవ్వి పోవుదురను లజ్జ యించుకయును లేక, రాజు వినిన దండించు ననుభీతి సుంతైన లేక, ఏల యీ లాగునఁ బ్రేలెదరు? మాఱు మాటాడక మీ రిచ్చటినుండి చప్పున వెడలిపొండు."

"ఎదురుల కొలఁదియుఁ, దనకొలఁదియుఁ దెలియక త్రుళ్లిపడుచుండు మీ రాజును వెంటనే యిటనుండి పాఱి పొమ్మని చెప్పుఁడు. లేకున్నఁ దగిన శాస్తి జరుగఁగలదు."

ఈ మాట లాలకించిన సుయోధనుని భటు లించుక చకితహృదయులై యిట్లాలోచింపఁ దొడఁగిరి.

"రారాజగు మనరాజును దిరస్కరించి యాడుచుండు వీరెంతటి బలవంతు లగుదురో? భటులే యింతటి ధైర్యవంతు లగునపుడు యజమానుఁ డెంతటి బలవంతుఁడుగా నుండ నోపును? ఇట్టివారితోఁ గలహము పెంచికొనుట సరికాదు.

మనరాజు ఈప్రయత్నము మానుకొనుట సరియగును. అతనిని ఇట్టి కార్యమునకుఁ గడఁగ వలదనుటకు మన మెవ్వరము? భృత్యుఁడా స్వామి నాక్షేపించుట? అట్లని యూరకుండినఁ బ్రభువునకు సంకటము గల్గిన తరుణమున తత్త్వ మెఱిఁగి పలుకకుండు సేవకుఁడపరాధి యగునుగదా! కాఁబట్టి మన మిచ్చట జరిగినవానిని బూసగ్రుచ్చినలాగున వివరింతము. ఆపల నాతని చిత్తము. వడ్లతోడఁ దట్టయు నెండులాగున రాజున కెద్దే నిక్కట్టు గలిగిన అతనితోఁబాటు మనమును అనుభవింప వలసినదియే న్యాయము."

అని తలపోసి సుయోధనుని పాలికరిగిరి. గంధర్వులకును దమకును జరిగిన సంభాషణమును సాంతముగ విన్నవించిరి. సుయోధనుఁడు వీరి మాటలు విని రోషావేశ పరవశుఁడై;

సుయోధన:— కర్ణా! వింటివే వీరిమాటలు! గంధర్వులఁట. వారి యానతి చొప్పున మన మీయరణ్యమును వీడి యేఁగవలయునఁట. లేకున్నఁ దగినశాస్తి సేయువారఁట. ఇదేటి మాట? అజేయులని వాసిగాంచిన మనమేడ? దేవదాసులకు నాట్యము గఱపు వారేడ? ఇంచుకేనంతర మెఱుఁగక ఇట్లు చెప్పిపంపుట వారి వినాశమునకే కారణమగును. అహో! నక్క సింహమును మార్కొనఁ దలఁచినలాగున నున్నది. ఇట్టి నీచుల నిఁక నూరక విడువరాదు. దుశ్శాసనా! వెంటనే సేనల నాయత్తపఱచునది. కర్ణా! నీవును సన్నద్ధుఁడ వగుము. మామా! మీరును మాతోడ వచ్చెదరుగదా?

దుశ్శాసన:— కుక్కనుగొట్ట బచ్చనకోల గావలయునా? ఆ నీచుల సంహరించుట కింత సన్నాహమేల? ఇదె నాకానతిచ్చిన తెప్పపాటు కాలములోన వారి నెల్లర నిహతము గావించెదను.

వికర్ణ:— అన్నా! తొందఱపాటెప్పటికిని బనికిరాదు. అర్జునుఁ డింద్రపుత్త్రుఁడు గదా? ఇంద్రుఁడు మన యుద్దేశ మెఱిఁగి మనల భంగపఱుప వీరిని బంపి యుండునేమో? ఇంద్ర పాలితున కెంతటి బలముండునో యూహింపుము.

అనువిందుఁడు:— నాకుఁ జూడ నిది ఇంద్రకార్యమని తోఁచుటలేదు. అర్జునుఁ డింతకుమున్న స్వర్గమునకు వెళ్ళి యుండెనఁట కాదా? అప్పుడీతనితో స్నేహమలవడి యుండవచ్చును. మన మిచ్చటికి వచ్చుట దెలిసి మిత్త్రప్రీతిచే మనతోఁ గలియఁబడ నెంచి ఈతఁడు దన భటులతోడ వచ్చి యుండునని తోఁచెడిని.

వికర్ణ:— ఎట్లును నీతఁ డజేయుఁడని నాకుఁ దోఁచుచున్నది. ఇంద్ర ప్రేషితుఁడైన నాతని సహాయముండును గదా? మిత్త్రప్రీతిచే వచ్చినఁ గిరీటి యీతనికిఁ దోడ్పడఁ గలఁడు. అతఁడు పరమశివునిఁగూడ రణమున నొప్పించిన మేటి. పాశుపతాస్త్రము వడసిన ధన్యుఁడు. కాఁబట్టి మన మీతరుణమున యుద్ధముసేయఁ బూనుట కంటె నూరకుండుట మేలగును.

కర్ణ:— అర్జునుఁ డంత మొనగాఁడని యెంచి భయపడెదవా? అది వట్టికల్ల. పరమశివుఁ డాశ్రితపక్షపాతమున

వాని శౌర్యము మెచ్చుకొనెను. అతఁడు నిక్కముగ శూరుఁడు గాఁడనుట నే నెఱుఁగుదును.

సుయోధనః—ఎది యెట్లే నుండనిమ్ము. యుద్ధయాత్రకై వెడలఁదలఁచిన వారము వెనుదీయుట శూర ధర్మము కాదు.

అన నంతఁ గర్ణాదులు దమసేనల సంసిద్ధము గావించు కొనిరి. సుయోధను నానతిచొప్పున బయలు వెడలిరి. ముందుఁ జతురంగబలము మరిగెను. వారి పిరుందన కర్ణాదులు రథారూఢులై వెడలిరి. సుయోధనుఁడు మాత్రము శిబిరముననే యుండెను. ఇట్లు కౌరవసేన వచ్చుచుండఁ దానిఁ గాంచిన గంధర్వ భటులు,

"కల్లులఁగు నోరాజ భటులారా! మిడుతలు ఫల భ్రాంతిచే నగ్నిలోఁ బడులాగున మీరేల యిచ్చటి కరుదెంచెదరు? ఇట్టి వలవని విద్వేషము మీకు క్షేమావహము కాదు."

"యుద్ధమాడవచ్చిన వారితోడ నాయీ వినయోక్తులు వల్కుటకా? రణము సేయఁజాలకుంటిరేని మారాజును శరణు పొందుఁడు. అతఁడు దప్పక మిమ్ము రక్షింపఁ గలఁడు."

"మీపైఁ గనికరమూని మేమట్లాడితిమిగాని మా యశక్తతచేతఁ బలుకుచున్నామని యెంచకుఁడు. మీకుఁ జేటు కాలము దాపించి యుండుటచే ఇట్టి బుద్ధి యుదయించెను. "వినాశకాలే విపరీతబుద్ధిః" అనుట నిశ్చయము కదా? కానిఁడు ఇంక మా బలము చవిచూడుఁడు."

రాజభటుల ఈమాటలు విన్నతోడనే ఆగ్రహము పెచ్చు పెరుఁగఁగా హుంకరించుచు గంధర్వ భటులపై బాణములు

వైచిరి. వారు వీరిశరములు దమపైఁ బడకుండఁ దమ చేతి యమ్ములచే ఛేదించి కౌరవసేనపై శరవర్షము గురిపించిరి. గంధర్వుల బాణములచేఁ సుయోధనుని సైన్యము మిగుల నొచ్చి మిక్కిలి యలిగి వాఁడి యలుగులచే గంధర్వ సేనను నొప్పించెను సైనికులతోఁ బాటు సేనానాయకులును విజృంభించిరి. క్రమక్రమముగ గంధర్వుల బలము దఱుగఁ జొచ్చెను. అంతఁ గలఁతజెంది గంధర్వ సైనికులు చిత్రసేనునొద్ద కరిగి మొఱలిడిరి. అతఁడాగ్రహోదగ్రుఁడై తనసేనల మగుడ యుద్ధసన్నద్ధులు గావించి తగిన సేనాపతుల నేర్పఱచి రణరంగమునకుఁ బంపెను. వచ్చినవా రెదురులపై బాణవర్షము గురిపించిరి. కౌరవులను వెనుదీయక బాణములఁ బ్రయోగించుచుండిరి.

ఇట్లిరువాగుల వారును బరస్పరము సమానముగా యుద్ధము సేయుచుండిరి. గంధర్వసైన్య మప్పటప్పటి కభివృద్ధ మగుచుండెను. అట్లభివృద్ధి యగు కొలఁదిఁ గౌరవసేన దఱుగఁ జొచ్చెను. కర్ణుఁడుదక్కఁ దక్కిన సేనాపతులు సుయోధనుని యొద్ద కరిగిరి. రాధేయుఁడు మాత్రము సుస్థిర హృదయుఁడై నిలిచి యర్ధచంద్రాది బాణములఁ బ్రయోగించి వారి దేహములు ఖండించుచు నిమిష మాత్రమునఁ బెక్కుర సైనికుల నిహతులఁ గావించుచుండెను.

ఇటుల సంహరించు కొలఁదియు గంధర్వులు శతసహస్ర సంఖ్యలుగా నభివృద్ధు లగుచుండిరి.

అచ్చట సుయోధనుఁడు దన సైన్యములును సేనానాయకులును బర్వెత్తివచ్చుటఁ జూచి క్రోధావిష్టుఁడై తిరిగి సేనల సన్నద్ధములు గావించుకొని సోదర సహితుఁడై రాఁటరిగానుండు కర్ణునకు సాయపడనెంచి యుద్ధభూమికి వచ్చెను. అతని యుత్సాహ వచనములచే ద్విగుణితోత్సాహము లగు సేనలు శాత్రవుల మఱల డీకొనెను. శత్రుభీకరుఁడై కౌరవనాథుఁ డరుదెంచి యుద్ధముసేయు చుండుట దెలిసి చిత్రసేనుఁడు రణరంగమునకు వచ్చెను. మాయాయుద్ధప్రవీణుఁడగు నాతఁడు దనమాయా బలమున సూర్యుని మఱుఁగుపఱచి దిక్కులెల్ల దట్టమగు చీఁకట్లు క్రమ్ములాగున నొనర్చెను. ఆయంధకారమునఁ గౌరవసేన కేమియుఁ గోచరింపకుండెను.

ఆతరుణమున గంధర్వసైనికులు కౌరవ సైనికసంహారము గావించుచుండిరి. శత్రుహతి తాళలేక సుయోధనుని సేనలు చెల్లాచెదరై పాఱఁజొచ్చెను. కర్ణుఁడు విరథుఁడగుటచే వికర్ణుని రథమెక్కి యుద్ధభూమినుండి తొలఁగి చనియెను. సుయోధనుఁడు మాత్రము ధైర్యము వీడక పరబలముల సాధ్యమయినంతవఱకుఁ దంపుచుండెను. చిత్రసేనుఁడు వాని సమీపించి యొలసి రథమును బ్రద్దలుగావించెను. విరథుఁడయ్యెను సుయోధనుఁడు గాందిశీకమైయున సైన్యమును మఱల నుత్సాహపఱచుటకు ద్యుక్తుఁ డయ్యెను. అతఁడట్లున్న వరత నుండుటగావించి యాతనిఁబట్టి నేలపైఁ బడవైచి పెడచేతులు గట్టి సింహనాదము గావించెను. చిత్రసేన సహచరులు

సుయోధన పరివారజనమును, దుశ్శాసనాదులను బట్టి బంధించి చిత్రసేనున కర్పించిరి. హతశేషులు చెదిరి యాక్రోశించుచుఁ బఱచిరి. గంధర్వరాజు నిజ భటులఁగాంచి;

"ఈనీచుఁడు రాజపదవి కనర్హుఁడు. వీఁడు మహారాజు కదా యని భావించి మన్నన సేయవలదు. సానుజుని వీని శృంఖలాబద్ధుఁ గావించి నావెంటఁ గొనిరండు. వీని స్త్రీజనమును మాత్రమూరక కొనిరండు. వారి నే మాత్రమును బాధింపకుఁడు."

అని తన భటుల కానతిచ్చి యచటనుండి కదిలి చనెను. భటులు చిత్రసేను నానతిచొప్పునఁ గౌరవులకు సంకెళులు దవిలించి తమ వెంటఁ గొనిపోవుచుండిరి. అంతఃపుర నారీవర్గము వారి యాజ్ఞకు లోఁబడి యూరక వారివెంట జనుచుండెను.

ఆపన్న సంరక్షణము

ద్వైతవనమున ధర్మరాజొక యజ్ఞము గావించుచుండెను. నానా ప్రదేశములనుండి ఆ యాగము గాంచ మహర్షు లనేకులు వచ్చియుండిరి. వేదఘోష మెల్లెడల ధ్వనించుచుండెను. సూర్యదత్తమగు పాత్రము మహిమచే వారల కందఱకు యథేచ్ఛగా యాజ్ఞసేని మృష్టాన్న మిడుచుండెను. భీమాదులు వారినిఁ బెక్కువిధముల సత్కరించు

చుండిరి. ఋషులు వీరి యాదరణ కెంతయు నలరి వీరిని దీవించు చుండిరి.

ధర్మసుతుఁ డిట్లు యజ్ఞ దీక్షితుఁడై యుండ నొక్క-నాఁటి యుదయమునఁ గొంద అచ్చటికి వచ్చిరి. వచ్చిన వారు కౌరవ సేనలోని వారగుటచే ధర్మజునకుఁ బరిచిత పూర్వులయి యుండిరి వారి మోముల వైవర్ణ్యము చూచి ధర్మరాజు విభ్రాంతుఁడాయెను. కౌరవసైనికు లాతనిఁ గాంచి;

“మహాత్మా! శరణాగతులగు మాకభయ మొసఁగుము. అదె మీసోదరుల సుయోధనాదుల వనితా జనములతోడ గంధర్వులు బంధించి కొనిపోవుచున్నారు. వారిని గాపాడ నీవ వలంతివి.”

భీమసేనుఁ డిదివిని యత్యంత సంతుష్టాంత రంగుఁ డయ్యెను. నవ్వుచు ధర్మజుం గాంచి;

భీమః— అన్నా! ఎట్టి సువార్త నేఁడు వినఁగలిగితిమి! మనము చేయవలసిన పనిని మన కేలాటి కష్టము లేక గంధర్వులు సులభముగా నొనర్చిరి. మనకుఁ జాలకనయ్యెను. మన మూతకుండఁగనే జయము గల్గుట గదు మోదావహము. సుయోధనుఁడు పుట్టుకల్లరి. పాపములకుఁ బుట్టినిల్లు. లోకులచేఁ దిట్టులు పడుచుండువాఁడు. అట్టివానిని యిట్టి కష్టముల పాలు గావించిన విధాత యతిచతురుఁడు. వాఁడు రాజ్యమదాంధుఁడై, యడవినిఁబడి వలుకష్టము లనుభవించుచుండు మనలఁ బరిహాసింపనెంచి యిచ్చటి కరుదెంచెను. కాఁబట్టి

దానికిఁ దగు ఫల మనుభవించెను. ఇఁక వానియెడ దయ తలఁపకుండుట భావ్యము.

ధర్మరాజు:— సోదరా! నీ విట్లాడుట సరియా! ఇది రక్షించుటకుఁ దరుణముగాని పరుషవాక్యములు పలుకుచు నుపేక్షింప సమయము గాదు. మనల శరణుసొచ్చిన కౌరవ సైనికుల కభయ మొసఁగవలదా? వారిరాజు నాపదనుండి తొలఁగించినఁ గదా వారి కభయమిచ్చి నట్లగును? ఏకవంశ సంజాతుల కర్ధాదుల మూలమున నొక్కొక్కమారు విరోధము కలుగుటకలదు గాని సహజస్నేహము మానునే? జ్ఞాతి జనమునకుఁ దమలోఁ నెట్టి వాదైన నొవ్వనుగాని యన్యుల వలనఁ బరిభవము కలిగినప్పుడు దామొండొరు లేకమగుటయే యుక్తము. సుయోధనుఁడు దుష్టుఁడే యగుఁగాక. వనితా జనములతోడ శత్రువులచేఁ బట్టువడినప్పు డుపేక్షించుట న్యాయవిరుద్ధము. ఆపదఁజెందిన వాఁడెట్టివాఁడైనను రక్షించుట యవశ్యకర్తవ్యము. భూతదయా వరుఁడవగు నీ కిది క్రొత్తగాదు. లెమ్ము. నీవును నీ సహోదరులును వెంటనే వెడలి శత్రువుల దాఁకి సానుజుఁడగు సుయోధనుని దెండు. ఆలసింపకుఁడు.

భీముః— అన్నా! అనుమాన మించుకయును లేక నాఁడు నను జలములలోఁ ద్రోచినది మఱచితివా? విషమిశ్రితమగు నన్నమును బెట్టి నన్నుఁజంపఁ జూచినది యెల్ల విస్మరించితివి? లాక్షాగృహమున నాఁడు మనల దగ్ధులఁ గావింపఁ బూనిన దింతలోనన మఱువునకు వచ్చెనే? మాయజూదమున

మనల నోడించి యడవులపాలు గావించిన దేల తలఁపవు? ఆదినుండి యీ నీచుఁడు మనల నే దినము కష్టపెట్టకుండెను? అట్టి ద్రోహిమీఁదనా కరుణచూపుట! ఇది తగదు. తగదు.

ధర్మరాజు:— వాఁడట్టి ద్రోహియైనను ఆపద చెంది యుండ నవి విస్మరింపవలయును. వానికి మన పరాక్రమము దెలియును గాఁబట్టి మనము వచ్చి వానిం బ్రోఁచెదమని గంపెఁడాసతో నెదురు చూచుచుండును. యజ్ఞదీక్షితుఁడ గాకున్న మిమ్మింత నిర్బంధింపక యేన యరిగియుందును. కాఁబట్టి మీ రేఁగి గంధర్వుల సాంత్వవచనపూర్వకముగా ననునయించి వానిని విడిపించునది. సామవాక్యములు పనికిరాని యెడలఁ బరాక్రమముఁ జూపియైనఁ గార్యము కొనసాగించుకొని రావలయునది.

భీమ:— అట్లే దేవరవారి యానతిచొప్పున జరిపెదము అని యాడెను. అంతఁ బాండవులు నల్వురును యుద్ధసన్నద్ధులై తమ యగ్రజన్మని వీడ్కొని కదలి చనిరి. గంధర్వులు వెడలిన దిక్కు సుయోధనుని పరిజనులవలన నెఱిఁగి యతి త్వరితగతి నావైపున కరిగిరి. కౌరవ సైన్యమును వారి తోడఁ బోవుచుండెను. గంధమాదనమునొద్ద వారిని గలిసికొనిరి. గంధర్వులు జయముఁ బొందిన వారగుటచే ద్విగుణితోత్సాహులై శాత్రవుల నెదుర్కొనిరి; అన్నమాటఁ దలఁచిన యర్జునుఁడు వారి నెదురింపక;

"గంధర్వులార! మీకును మాకును యుద్ధమేల? కౌరవరాజును వదులుఁడు. రాజశ్రేష్ఠుఁడగు ధర్మరాజు నానతి యిది. మీరు దీనిని తిరస్కరించుట పాడిగాదు."

"వీరవరేణ్యా! ధర్మరాజు మాకుఁ బ్రభువుకాఁడు. మేమేల యాతని యాజ్ఞ పాటింపవలయును? మా ప్రభువగు దేవేంద్రుఁడు నానతి నే ఈ కార్యము మాచేఁ గావింపఁబడియెను. అతఁడు దక్క మమ్మెవ్వఁడును శాసింపలేఁడు."

"మాయన్న పలుకులు పాటించి మీతో మున్న సామవాక్యము లాడితిని. ఇఁక నాల్గవ యుపాయమే యాచరింపఁ దగినది. ఇదె నా శరములు మిము దారికిఁ దేఁగలవు. నా గాండీవము సుయోధనుని విడిపించుననుట మీ రింకను తెలియకున్నారు."

అని యా గంధర్వులపై బాణజాలములు ప్రయోగించి వారిని నొప్పించెను. వారును వెనుదీయక పోరాడ దొడఁగిరి. పార్థుఁడు వారి శరముల ఖండించుచుఁ, జాపములఁ దెగనఱుకుచు, బాహువుల ఛేదించుచుఁ, దలలఁ దునుమాడుచు; ఆరణరంగమెల్ల రక్తమయముగా గావించెను. హతశేషులు వీరితో జగడమాడలేక సుయోధనాదుల వెంటఁబెట్టుకొని యాకాశ మార్గమునఁ బాఱ నుపక్రమించిరి. ఇది తెలిసిన సవ్యసాచి యాకసమును చుట్టును బాణములతోఁ గప్పెను. ఆ శరములఁ ద్రెంచుకొని వెడలలేక తన్మధ్యమున వలఁదగులుకొనిన మృగములవలెఁ జిక్కుకొనిరి.

అంత వారు చేయునది లేక యర్జునునిపైఁ బెక్కుబాణములనేసిరి. అతఁడు వానినెల్ల ఖండఖండములు గావించుచుఁ దన శరములచే వారి యొడలెల్ల రక్తమయముగా నొనర్చెను. ఆగ్నేయాస్త్రమున వారిని దహింప మొదలిడెను.

హతశేషులగు గంధర్వభటులు అర్జునిపైని శిలలు విసిరివైచిరి. పార్థుఁడు వానిని నుగ్గుచేసెను. మాయాయుద్ధకోవిదుఁడగు చిత్రసేనుఁడు మఱుఁగుననుండియే కిరీటిపై బాణవర్షము గురిపించెను. గాండీవియు శబ్దవేదులగు బాణముల మూలమునఁ జిత్రసేనుని గాత్రము గాయపఱచెను. అర్జునుని బాణములచే నొచ్చి యాతని మార్గణజాలని చిత్రసేనుఁ డింతదాఁక మఱుఁగున నుండిన వాఁడిప్పు డాతని యెదుట వచ్చి నిలిచెను. విజయుఁ డింతవఱకుఁ బగతుఁడని తలఁచినవాఁ డత్యంత మిత్రుఁడగు చిత్రసేనుఁ డగుట కాశ్చర్యము నొంది;

"ఆహా! మిత్రమా! నీతోడనా నేను యుద్ధమున కుపక్రమించితిని? కౌరవరాజగు సుయోధనుని సోదరవర్గము తోడను వనితాజనముల తోడను విడిచి పుచ్చుము."

"నచ్చెలీ! ఈదురాత్ముఁడు రాజ్యవిహీనులై కానలఁ గష్టపడుచుండు మిమ్ముపహసింప దలఁచి వచ్చెను. ఇది తెలిసి ఇంద్రుఁడు వీనిఁబట్టనన్నంపెను. కాఁబట్టి వీని నింద్రుని పాలికిఁ గొనిపోవుచున్నాను. నీవింక దీని కడ్డుపడకుము. నిను బ్రార్థించెదను."

"ఈ సుయోధనుఁడు మాకు సోదరుఁడు గావున వీనిని విడుచుట ముఖ్యము. ధర్మరాజునకిది యెంతయు సంతోష

కరము. అమరేంద్రు నాజ్ఞయే యైనను నీవు నా మాటలఁ బాటించి ధర్మరాజునొద్ద కీతనిఁ దోడ్కొనిరమ్ము. అతని యానతి చొప్పున జరుప వచ్చును."

ఆవలఁ జిత్రసేనుఁడు సుయోధనాదుల వెంట నిడుకొని పాండవులతోడ ధర్మరాజు చెంతకు వచ్చెను. అజాతశత్రుఁ డాతనిఁ జూచి;

"మహాత్మా! ఈ సుయోధనుఁడు సపరివారుఁడై మీచే వధింపఁ బడకుండుటకు ఏనెంతయు సంతసించుచున్నాను. ఇతఁడెట్టి మహాపరాధి యైనను మాకుగా నితని విడువవలయును."

"యుధిష్ఠిర చక్రవర్తీ! ఎట్టివారైనను మీమాట దాఁట నేర్తురే? మీయానతి చొప్పున వీని విడిచి పుచ్చితిని. ఇంకనే నిట్టి యకృత్యముల నేయకుండు లాగున బుద్ధి గఱపి యుంపుడు."

అని వారిని విడిచి ధర్మజుని సెలవుగైకొని చిత్రసేనుఁడు తన పరివారముతోడ నరిగెను. యుధిష్ఠిరుఁడు సుయోధనునకు బుద్ధులు సెప్పి విడిచిపుచ్చెను. సుయోధనుఁడు దన యసమీక్ష్యకారితకెంతయు నొచ్చుకొనుచుఁ జనెను.

ప్రాయోపవేశము:

ద్వైతవనమునకుఁ గొంతదూరమునఁ గొన్ని పటకుటీరము లమరి యుండినవి. వాని నడుమున నొక శిబిరముండెను. దానిలో భాగమున నానావిధచిత్ర కంబళములు పఱపఁబడి యుండెను. వానినడుమన ఆసనములు బెక్కులుండెను. అందొక్క దానిపై నొకఁ డాజానువిలంబి బాహుఁడై దీర్ఘకాయుఁడై, స్థూలశరీరుఁడై, మహారాజలక్షణలక్షితుఁడై యుండెను. అఖండ వైభవోపేతుఁడుగా నుండఁదగిన యా యువకుఁ డేలొకో యొంటరిగాఁ గూర్చుండి చింతాక్రాంతుఁడై మౌనమువాంచి యుండెను. గద్దియపైనున్న యాతఁ డిట్లు తలపోయ సాగెను.

'ఆత్మబుద్ధి సుఖమనుట నిక్కము. దాని ననుసరింపక పోవుటయే యిట్టి చిక్కులకుఁ గారణమయ్యెను. గురుబుద్ధి విశేష సుఖప్రదము. అట్టిదానిని ధిక్కరించిన వాఁడు గష్టము లనుభవింపక తీఱునే? పరబుద్ధి వినాశమునకు మూలమనుట యెఱిఁగియు దానిచొప్పున జరిపి యిప్పుడు చింతించిన లాభమేమి? తినఁ గట్టఁ గుడ్డలకు తెచ్చుకొన్న లాగున నా యాభంగపాటునకు నేనే కారకుఁడనయి యుండఁగా ఇతరులను నిందింపనేల?

ఆహా! సోదరులైన నేమి? మామయైన నేమి? మిత్రుఁడైననేమి? మనస్సాక్షికి విరోధముగా ఎట్టివారి మాటలున్నను వాఁడు తప్పక చెడును. పెక్కుతడవలు వీరిమాటలు విని భంగ

పడియు మరల మరల వీరియుభి ప్రాణము లనే యనుసరించుట నా తెలివి లేమిని ప్రకటించు చున్నది. ఇంతటికివిమూలకారణము మాతురాశయే యగుచున్నది. పుట్టు బీదైనను కలిగిన నాటి తోఁ దృప్తిపడు వానికుండు సౌఖ్యము ధనికునకైనం దురాశా పీడితుడవకుండఁజాలరు. ఆశ విడచినవాఁడే ధన్యుఁడు వాఁడే సర్వసుఖములు ననుభవించు వాఁడు. లోభము మూలమునఁ గదా నాకింతటి యవమానము కలిగెను?

ఓరా! రారాజని పేరుగాంచి యొక భూపునికిఁ జిక్కుట కంటె మానహాని యొకటి గలదే? నాకుఁ దటస్థించిన దానికి నే నంతగా వగచుటలేదు. నాకంటి యెదుట అవరోధజనమును గాలినడకం బిలుచుకొని వచ్చుచుండఁ బ్రతీకారము సేయఁజాలక జీవచ్ఛవమై మిన్నకుండుట నాహృదయమును గాల్చివేయు చున్నది.

అపకారి యని భావించి యుపేక్ష సేయక ఆపన్నుఁడను గదా యని కనికరించి నన్ను గాపాడిన యీ మహాభాగుల సుస్వభావ మెంతయును గొనియాడఁ దగినది. అట్టి మాట విని యట్టివారిని అనేక బాధలకు గుఱిచేసితిని. ఇట్టి నా బ్రదుకేల? నే నిచ్చటఁ ప్రాయోపవిష్టుఁడనై ప్రాణముల వీడు వాఁడను."

అని యీలాగున యనకుఁడు చింతించుచుండ వాని యొద్దకుఁ గొందఱు వచ్చిరి. వారలఁగాంచి యాతఁడత్యంత విషాదముతోడ ;

"మీపలుకులు విని నేఁబడసిన పాటులు చాలును. ఇంక నాజోలికి మీరు రావలదు. నేనిస్థలముననే ప్రాయోపవిష్టుఁడనై ప్రాణములు వీడెదను. నే నీసంసారము వలన విరక్తుఁడనైతిని. సుయోధనుఁడు ఇంక నామమాత్రావశిష్టుఁడగునను మాట యెఱుఁగుఁడు. దుశ్శాసనా! నీవిఁకఁ బట్టాభిషిక్తుఁడవు కమ్ము. ఎప్పటివలెను పరబుద్ధి వీడి నీకుఁదోఁచిన లాగునఁ బ్రవర్తించుట సరియగును.—కర్ణా! నీవును ఇది మొదలు సద్బుద్ధిగలవాఁడవై మనుము. ఋజ్జువానిని మంచిదారికిఁ ద్రిప్పియారయుచుండుము.—వికర్ణా! నీమాటలాదినుండియు వినకుంటిని. దానిఫలమిపు డనుభవించితిని. నీపై నలిగి కన్నాడిన యాపరుషవచనముల మఱచిపొమ్ము. సోదరప్రీతిని విస్మరింపకుము.—మామా! ఈకుట్ర నేరిని ఎవ్వరును గపటకృత్యము లాచరింపఁబురికొల్పక యూరకయుండుము."

ఈ పలుకులు విని దుశ్శాసనుఁడు కడు దుఃఖితుఁడై అతని పాదములపైఁబడి ప్రాయోపవేశము మానుమని ప్రార్థించెను. కర్ణుఁ డాతనిచెంతఁ జేరి మరణోద్యోగమునుండి నివర్తింపఁ బలువిధముల హితబోధ యొనర్చెను. శకునియు వానికి పెక్కురీతుల బుజ్జగించుచు వాని వ్యసనము మాన్పఁ జూచెను. వీరి మాటలఁగాని, చేఁతలఁగాని సరకుసేయక యా సుయోధనుఁడు వారిని గాంచి;

"మీరేల నాకొఱకై పరితపించెదరు? ఇంక నా కైహికసుఖముల యందభిలాష లేదు. ప్రాయోపవిష్టుఁడనై మరణింపఁ గృతనిశ్చయుఁడ నైతిని. మీరిఁక నెంత యడ్డు

వాట్లు వేసినను అప్రయత్నము మానఁజాలను. మీరిచ్చట నిలువకుఁడు. వెంటనే వెడలుఁడు. ఇది నాశాసనమని భావింపుఁడు.”

అంత వారెవ్వరును ఆతని యానతి కెదురాడ వెఱచి చింతతోడ ఆశిబిరము వీడి వెలుపలికి వచ్చిరి. సుయోధనుఁడు దన యాసనమునుండి దిగి యొకదర్భాసనము పఱచుకొని అందాసీనుఁ డయ్యెను. పరబ్రహ్మను ధ్యానించుచు బాహ్యేంద్రియ జ్ఞానము వీడి సమాధినిష్ఠితుఁ డయ్యెను.

అసురోపదేశము

ఇంద్రావమానితులగు నసురులు నాగలోకమున వసించుచుండిరి. వారు దేవేంద్రు నవమానింపఁ దఱివేచి యుండిరి. ఇంద్ర ప్రేషితుఁడగు చిత్రసేనుని మూలమున సుయోధనుఁ డవమానితుఁ డగుట తెలిసికొనిరి. ఈతని నాధారము గావించుకొని దేవాంశ సంభూతులగు పాండవుల సంహరించి దానిమూలమున దేవతల కవమానము గల్పింప నెంచిరి.

అంత వారు శుక్రాచార్యు ననుమతిని యథావిధిగా నగ్నిని వేల్చిరి. అందుండి కృత్యయొక్కటి యుదయించెను. దానిని బంచి సుయోధనుని దనయొద్దకుఁ దెప్పించుకొనిరి.

ఇంతదనుక సమాధినిష్ఠనున్న రాజరాజున కేదియుఁ దెలియ కుండెను. వార లాతనిఁ జూచి ;

"సుయోధనా! లెమ్ము లెమ్ము. క్షేమకాల మాసన్న మయియుండఁ బౌరుషముమాని ఈలాగున సమాధినుండుట దగదు.''

అని వారాడిన పలుకులు విని అతఁడు కనులువిచ్చి చూచెను. తానిప్పు డొక క్రొత్తలోకమునకు వచ్చి యుండుటయుఁ, దనయెదుటఁ గ్రొత్త వారెవ్వరో, యుండుటయుఁ గాచి విభ్రాంతుఁ డయ్యెను. అప్పు డసురులు వానిభ్రాంతి నాఁపఁగోరి ;

"అయ్యా ! నీవు వింతపడ నక్కఱ లేదు. ఇదిపాతాళ లోకము. మేమిచ్చట వసించునట్టి యసురులము. సాహస కార్యమునకుఁ గడఁగిన నిన్నుద్ధరించఁ దలఁచి కృత్య మూలమున ఇచ్చటికిఁ బిలిపించితిమి. నీవు శూరుఁడవు. బల వన్మరణము శూరునకుఁ దగినది కాదు. ఆత్మఘాతి ఇహపర లోకముల కెంటను జెడును. కాఁబట్టి ఈ దురధ్యవసాయము వీడుము. ధైర్య మవలంబింపుము. నీవు మనుష్యమాత్రుఁడవు గావు. నీ ప్రభావము నీ వెఱుఁగవు.''

నా ప్రభావ మెట్టిదియో తెలుపఁగలరా?''

పూర్వము ఇంద్రునిచే జయింపఁబడిన మేము శివుని గూర్చి తప మొనరించితిమి. అతఁడు మాయెడఁ బ్రసన్నుఁ డయి మమ్ము రక్షించుటకుగా నిన్ను సృజించెను. నీవు మా కధిపతివని యాతఁడనెను. నీకు సాయపడుట కయి మాయంత

ములు భగదత్తాదులు జనించియున్నారు భీష్మాదులు దేవాంశమునఁ బుట్టిన వారయ్యును వారి భావములు రాక్షసావేశమును బొందఁగలవు. దానఁజేసి వారు నిర్దయులై, పరుషమును పలుకుచుఁ, గోపము మిగుల, గురుశిష్య బాలవృద్ధభేదము విచారింపక యుద్ధము చేసి పాండవ పక్షమును నాశము గావింతురు. పాండవులు దేవాంశ సంభూతులు. కాఁబట్టి మన కవశ్యము విరోధు లగుదురు. బంధుస్నేహము వీడి నీతో యుద్ధమున నుపక్రమించి నశింతురు. కృష్ణునిచేఁ జచ్చిన నరకాసురు వంశము కర్ణు నావేశించియున్నది. ఆ కారణమున రాధేయుఁడు కృష్ణార్జునులఁ జంపఁగలఁడు. సంశప్తకులను నసురులు మనకు సాయపడెదరు."

ఇదివిని సుయోధనుఁ డీలాగునఁ దలపోయఁ దొడఁగెను.

"ఐహిక సౌఖ్యముల విరక్తుఁడై పడియుండు నాకు వీరిటు బోధయొనర్చి మఱల సంసారమునఁ బడవేయఁ జూచుచున్నారే? పరమశివుఁడు వీరి సాయమునకై నను బుట్టించినాఁ డనిరి అతని యానతి తప్పుటెట్లు? తప్పక నే జీవించి ఈ కార్యము జరుపవలసి యుండుట చేత నే మరణోద్యుక్తుఁడ పడియుండిన నన్నిప్పటికి దైవము చేర్చెను. కాఁబట్టి యీశ్వరాజ్ఞను నే జరుపుట నాకు విధి యగుచున్నది."

అని తలపోసి వారి యిష్టము చొప్పునఁ గార్యము పూర్తి గావింప నంగీకరించెను. అసురులు సంతోషించి కృత్యకాల మున సుయోధనుని భూలోకమున కంపిరి.

వైష్ణవ యాగము

హస్తినాపుర ప్రాంతమున ఒక విశాలమైన బయలున యజ్ఞవాట మొక్కటి యమరియుండెను. అచ్చట యూప స్తంభములు నాటి యుండిరి. అందు యజ్ఞవేదికలు గట్టఁబడి యుండెను. యజ్ఞవాట మెల్లెడలను దోరణాదులచే నలంకరింపఁబడి యుండెను. సుయోధనానుమతిని నానా దేశాధీశులు కానుకలతోడ వచ్చియుండిరి. భూసురులనేకులు ఆ యజ్ఞముఁగాంచ నరుదెంచి యుండిరి.

అంతఁ గౌరవశ్రేష్ఠుఁడు ఒక్క సుముహూర్తమున యాగదీక్షఁ బూనెను. యజ్ఞ మారంభమయ్యెను. వేద ఘోషలు చెవుల పండువ సేయుచుండెను. స్వాహాకారముల తోడ స్రుక్ స్రవములనుండి యగ్నిని వ్రేల్చఁబడునాహుతి ఘ్రాణ తర్పణము గావించుచుండెను. వీరు వారని భేదము లేక ఎల్లవారు సంతృప్తులై భుజించుచుండిరి. దానాధికారము విదురు నందిడి యుండెను. దానమందరును భూరిదక్షిణలఁ దనియుచుండిరి. అచ్చటికి వచ్చినవారిలో ఒక్కఁడైన రిక్తచేతులలో మరలిన వాఁడు గాఁడు.

యజ్ఞాంతమున సుయోధనుఁ డవభృథ స్నానము చేసెను. అధ్వర్యులు మున్నగువారలు దగురీతిని గారవింపఁ బడిరి. వచ్చిన బ్రాహ్మణు లాతని దీవించి;

"హరిశ్చంద్రుఁడు మున్ను గొప్పయాగ మొనర్చెనని వినియుంటిమి గాని చూచి యెఱుఁగము. ధర్మసుతుని రాజ

మాయము చూచి యుంటిమి. అది దీంతో సాటిరాంజాలదు. పూర్వపురాజు లనేకులు ఈ యజ్ఞము చేసి కాదె అఖండ కీర్తి వడసిరి.”

అని నానావిధముల స్తుతించి వెడలిరి. సుయోధనుండు భీష్మాది గురు జనులకు నమస్కరించెను. వా రాతని దీవించిరి. అనంతరము నగరులోని కరిగి కర్ణశకుని దుశ్శాసనాది పరివృతుండై;

సుయోధనః— చూచితిరే యీ పాండవుల గర్వము! రాజు లెల్లరును నాయాజ్ఞ శిరముల దాల్చి యజ్ఞమునకు వచ్చి యుండ వా రుదాసీనులై రాకుంటిరి. ధర్మరాజు నొద్దకుఁ బ్రత్యేకముగా దూత నంపియుంటిని. అనూయాగ్రస్తుఁడై తాను రాకుండుటకుఁ బదమూఁడేండ్లు గడువ లేదని నెపము గల్పించెను. అది యటుండనిండు. ఈ వృకోదరున కింత గలువతనము దగునే? “పదమూఁడేండ్లు గడచిన పిమ్మట శస్త్రాస్త్ర దహనమునఁ గౌరవులఁ బశువుంగా వరించి ప్రేల్చి యుద్ధయాగము సేయు ధర్మసుతుండు రాఁగలఁ” డని చెప్పి పంపెను. జ్యేష్ఠునకు దూత నంపితిమి గాని వీనిఁ బేరెత్తియేని బిలిచితిమే? అట్టుండ వీని కేల ఈ యధిక ప్రసంగము? అర్జునుండును వాని మార్గమునే యనుసరించెనఁట.

దుశ్శాసనః— అన్నా! భీమునిఁ బరిమార్ప నా కనుజ్ఞ యిండు. ఇప్పుడ యరిగి వాని తలఁద్రెళ్ల నేసెదను.

కర్ణ:— అర్జునుఁడాతని మార్గము ననుసరించిన వానిని నా బాణాగ్నికి ఆహుతి యొనర్చెదను. వాఁడేమి యంతటి పోటు మానిసియా?

సుయోధన:— సోదరా! మిత్రమా! మీ బలములు నే నెఱుఁగనివాఁడను గాను. తొందరపాటు పనికిరాదు. ఇంకను గొంత యోరిమి వహించుట యుక్తము. శస్త్ర చికిత్సకుఁడు వ్రణము పండుటకై నిరీక్షించుచుండును గాని లేఁతలోననే కోఁత వెట్టఁ జూడఁడుగదా?

శకుని:— నీకింకను బాండవులయెడ నభిమానము మానకున్నది. కాఁబట్టియే వీరిమాటల నిరాకరించుచున్నావు.

సుయోధన:— అలాగున మీ రెంచుట పొరపాటు. మన మెల్లరము పాండవులకు సహజవైరులము. వారు దేవాంశ సంభూతులు. మన మసురాంశ సంజనితులము. అట్టియెడ నాకు వారిపై నేల యభిమానముండును? మీ సహాయమునఁ గదా నిన్నపర్ని ముగ రాజ్యమేలుచున్నాను. నే నెల్లప్పుడు మీ యెడఁ గృతజ్ఞుఁడ నని భావింపుము. ఇఁకఁ బాండవులఁ దప్పక నామమాత్రావశిష్టులుగాఁ జేయఁ గలను. ఇది నిశ్చయము.

శకుని:—అట్టి నిశ్చయము గల్గియుంటివేని నేఁటి మొదలు భీష్మద్రోణాదులఁ బెక్కువిధములఁ దృప్తిపఱచుచుండుము.

సుయోధన:—ఇదియింతకుమున్నే సంకల్పించుకొంటిని.

అని నాఁటి రహస్యాలోచనాసభ చాలించి ఎల్లరు వారివారి యునికిపట్లకరిగిరి.

మత్స్యపుర ప్రయాణము

పాండవులు పన్నెండేఁడులు అరణ్యవాసము సల్పి పదమూఁడవ యేఁట నజ్ఞాతవాసము సేయ మొదలిడిరి. సుయోధనుఁడు వారిని వెదుక వేగులవాండ్రఁ బెక్కుఱఁ బంపెను. వారనేక స్థలముల వెదకిరి. పాండవుల జాడ వారి కెందును గాన్పింపకుండెను. ఈలాగున వెదకి వెదకి వేసారి వారు సుయోధనుని పాలికి వచ్చి;

" మేము పెక్కుచోటుల వెదకితిమి ఎందును బాండవుల యునికి మాకు గోచరింపకుండెను. ద్వారకకొక రథము పోవుచుండ అందుఁ బాండవులున్నారేమో యని తలఁచితిమి కాని యా రథము వారిది కాకుండెను. విరాట నగరమునఁ గీచకుని వాని సోదరులతోడ నొక వనిత కొఱకై గంధర్వులు చంపిరని తెలిసి అది భీముని కృత్యమేమో యని యెంచి యందు వెదుకఁ జొచ్చితిమి. పాండవుల జాడ యించుకయుఁ గానుపింపకుండెను. మిక్కిలి పాడిబాటయు నుండుటచే గర్వించి మీ మాటలఁ దిరస్కరించు నా విరాటుని వ్యసనవృత్తాంత మగుటచే దేవర కెఱుక విన్నవించితిమి. దేవరవారి యాజ్ఞయైనచో మఱల వెదుకఁ బోయెదము "

సుయోధనుఁ డీమాట లాలకించి వేగులవాండ్ర వెంటనే పాండవుల వెనుకఁ బంపెను. తాను సభాభవనమునకు వచ్చి సభలోని వారిఁ గలయఁజూచి;

సుయోధనః— పాండవులఁ గనిపెట్టుట కుపాయమేమైన నున్నదే?

దుశ్శాసన:— ఏమి యీ వెఱ్ఱి! వారప్పుడే యే మృగ ముఖానో ఆహారమయి యుందురు. మీ కేల వలవని కష్టము?

ద్రోణ:— బలవంతులగు పాండవుల కాపద గలుగుట కల్ల. మీకు శక్తియున్న వారిజాడ లారయుటకుఁ గడఁగుఁడు.

భీష్మ:— ఆచార్యుని మాటలు నిక్కములు. దైవ మానుష బలములు రెండునుగల యీ పాండవుల కాపద గలుగ నేరదు. పాండవధార్తరాష్ట్రు లిర్వురును నాకు సమానులే యగుదురు. అయినను సభలోఁ దన్నుఁ బ్రశ్నించినపుడు తెలిసినది చెప్పకుండుట యధర్మము. కాఁబట్టి తెలిపెదను. వినుఁడు. ధర్మస్వరూపుఁడగు ధర్మపుత్త్రుఁ డుండుచోట ధనధాన్యములును, బసులపాడియు సమృద్ధములయి యుండును. అట్టిదేశ మెద్దియని తెలిసికొని యచ్చట వారిని వెదుకఁ బంపుట సరి యగును.

సుయోధన:— సింహబలుఁడు, భీమసేనుఁడు, శల్యుఁడు బలరాముఁడును సమాన బలులు. సింహబలునిఁ జంపినవారు దక్కన మాపురిలో నొక్కరు కావలయును. శల్యుఁడు బలరాముఁడును దూరదేశవాసు లగుటచే వారాతని మృతికిఁ గారకులు గాఁజాలరు. ఇంక శేషించినది భీముఁ డొక్కఁడే గదా! కావునఁ గీచకుని జంపినది భీముఁడనుట నిశ్చయము. ఆవనిత ద్రౌపదియే యయియుండును. గంధర్వులను నెపమున నచ్చటఁ బాండవు లున్నారలు. పితామహుఁ డాడిన యీ లక్షణములు ఆదేశమునఁ గలవఁట. విరటుఁడు మనకు శత్రు వగుటచే అతనిపై దండెత్తిపోయి యతని గోధన మపహరింతము.

ధర్మరాజాదు లిట్టిమోసకు నూరకుండ నేరరు. తప్పక మనపైకి వత్తురు. అప్పుడు వారి సమయభంగము దెల్పి క్రమ్మఱం బన్నెండు వత్సరములు వనవాసమున కంపుదము.

సుశర్మ:— రాజరాజ! ఈ మాత్రమునకు మీ రేల దాడి వెడలం గడంగెదరు? నాకును విరటునకును బూర్ణ విరోధము. కావున నన్నంపుఁడు. వాని యైశ్వర్య మెల్లఁ జూఱం గొని వచ్చెదను. పాండుసుతుల బంధించికొని వచ్చెదను.

సుయోధన:— త్రిగర్త దేశాధీశుఁడవగు నోసుశర్మా! నీవు ఈదినమే నీ సేనలఁగొని యేఁగవలయును. అట విరటుని పసులఁ బట్టవలయును. విరటుఁ డూరకుండక నీపైఁ బడును. పాండవు లాతని సాయమునకై వెడలుదురు. కాఁబట్టి వారు నీకుఁ జిక్కవచ్చును. అలాగున వారు రాకుండిన మఱునాఁడు మేము వేఱొకవైపున గోవులఁబట్ట వచ్చెదము. రాజును ఆతని సేనలును నీతో యుద్ధము సల్పుచుండుటచేఁ దప్పక పాండవులు అచ్చటికి వచ్చియే తీరుదురు. ఓయీ! ఆలసింపక వెంటనే పయనమునకు సిద్ధుఁడవగుము—దుశ్శాసనా! రేపు మన సేన లరుగుటకుఁ దగిన సన్నాహములఁ గావింపుము.

సుశర్మ:— దేవర యానతి చొప్పుననే యాచరింతును.

అని యాతఁ డటనుండి కదలెను. తన సేనల సజ్జీకరించుకొని మత్స్యనగరాభిముఖుఁడై చనెను. దుశ్శాసనుఁడు దన సేనల సంసిద్ధములు గావింప నరిగెను. సుయోధనుఁడు భీష్మాదులఁ దనకు సాయముగా రావలయునని కోరెను. వారద్దాని

కంగీకరించిరి. అంత నాఁటి సభచాలించి యెల్లరును వారి వారి యావసథముల కరిగిరి.

గోగ్రహణము

“రాజపుత్రా! మనపురమునకు దక్షిణపు దెసనుండు పశువుల శత్రుహస్తము దోలుకొని పోవుచుండఁగా ఈ లాగున మిన్నకుండుట దగునా? రాజుగారటు సుశర్మతో యుద్ధము సేయఁ బోయిరనుట తెలిసి ఇదియే యదనని భావించి సుయోధనుఁడు దనసేనతో వచ్చి గోగ్రహణ మాచరించు చున్నాఁడు. మన పశువుల మఱల్చుటకు నీవు దక్క వేఱెవ రిచటఁగలరు? బాబుగారు నీబలమును గుఱించి పలువుర యెదుట నుగ్గడించు చుందురుగదా? దానికిఁ దగులాగున నేఁడు శత్రువుల సంహరించి గోవుల మఱలింపవలయును. వెంటనే తేరు బూన్పఁ బంపుము. ఆలసింపకుము.”

అని కాంతాజన మధ్యమునందుండు భూమింజయునిఁ గాంచి గవాధ్యక్షుఁడు పల్కెను. ఇది వినిన రాజకుమారుఁ డుత్తరుఁడు;

ఉత్తర:— కౌరవుల జయించుట యొక కష్టముతో నిడికాదు. గోవుల ముహూర్తమాత్రములోఁ దేఁగలను. ఇపుడు నాకుఁ దగినసారథి లేకున్నాఁడు కాఁబట్టి యేమి సేయుదు నని యాలోచించుచున్నాను. తగుసారథి దొరికె

నేనిఁ బగతుర సంహరించుట యెంతపని ? సారథి నారసి రథముదోలుకొని నేఁ బోవులోపల యెచ్చటికఁ వారు పశువులఁ దోలుకొని పోవుదురోయని తలఁచుచున్నాను. నాకును గౌరవులతో యుద్ధ మాడవలయునని పెక్కు దినములుగా అభిలాష గలదు, అది యిప్పుడు గదా చేయి కూడి వచ్చెను. సారథి దొరకమిని యిప్పుడు అది వ్యర్థముగా బోవుచున్నది గదా యని చింతిల్లుచున్నాను.

భూమింజయుని యీ మాట లాలకించిన పాంచాలి బృహన్నల యనుపేరఁ బేడిరూపుననున్న యర్జునునకు దాని నెఱిఁగించెను. అతఁడు యాజ్ఞసేనిని గాంచి ;

అర్జునః— మన యజ్ఞాతవాస వత్సరము తీర మయ్యెను. కాఁబట్టి ఇంక భయపడవలసిన యవసరము లేదు. నీవు పోయి వారలతో; "బృహన్నలకు సారథ్యమున సామర్థ్యము మెండు. మున్ను ఖాండవ దహనమునఁ ఖాండవ మధ్యమునకు సారథ్యముసల్పి యతని మెప్పువడసెను. తత్సహాయమునఁ గురుసైన్యముల నవలీలగా జయింపవచ్చు" నని తెల్పుము. ఎట్లైన నన్నుఁ బిలిపించులాగునఁ జేయుము.

అంత ద్రౌపది యట్లే యొనర్పులాగునకుఁ బోయి యుత్తరను సమీపించి,

ద్రౌపది:— రాజకుమారుఁడు సారథిలేమిఁ జింతిలు చున్నాఁడఁట. మన బృహన్నల కిరీటిమనసు మెప్పించులాగున

సారథ్య మాచరించియుండెను. ఖాండవ దహన కాలమున విజయునకుఁ గలిగిన విజయమునకుఁ బృహన్నలయే కారణము.

యాజ్ఞసేని యీలాగునఁ జెప్పినంతనే యుత్తర దానిం దోడ్కొని యుత్తర కుమారుని యొద్దకరిగి;

"అన్నా! మన బృహన్నలకు సారథ్యమున సామర్థ్యము కలదని సైరంధ్రి పలుకుచున్నది. నరునకు సారథియయి ఖాండవదహనాది తరుణములందు జయము సంపాదించి యిచ్చినది ఈ బృహన్నలయే యఁట."

ఉత్తరః— సైరంధ్రీ! నన్నేల పరిహసించెదవు? నేను పేడిసిఁ గన్నెత్తియైనఁ జూడ రోయుదును. అట్టి వానితోడ నా బృహన్నలను సారథిగా నొసర్చుకొను మనెదవు? ఆలాగున నొనర్చిన లోకములోనివారు నవ్వరే?

ద్రౌపదిః— ఈ కురుసైన్యమును గాదుకదా! ముల్లోకము లెత్తివచ్చినను బృహన్నల సారథిగా నుండునటుకు నిన్నెవ్వరును గెలువనేరరు. వెంటనే బృహన్నల నిటకు రప్పింపుము.

ఉత్తరః— సారథి దొరకనప్పు డింకేమి సేయవచ్చును? మీ మాటలచొప్పున జరిపెదను. ఇంక బృహన్నల నిచ్చటికిఁ బిలుచుకొని రండు.

ఉత్తరా ద్రౌపదులు వెంటనే యర్జునుఁడున్న యెడకు వచ్చిరి. రాజకుమారుఁడు పిలుచు చున్నాఁడని యాడి యాతనిఁ దోడ్కొని మరల నుత్తరునియొద్ద కరిగిరి. భూమిం

జయుఁడు బృహన్నలను సారథిగా నొనర్చుకొని రథ మెక్కి కురుసైన్యము లున్నయెడల కేఁగెను. రాజ కుమారుఁడు రెండవ సముద్రముఁబోలిన శత్రుసేనల దూరమున నుండి చూచినంతనే వెల్లుగ భీతిల్లెను. అర్జునుఁడాతని బెక్కువిధముల నోదార్చుచుండెను.

ఆసమయమునఁ గౌరవసేనలోఁ గలిగిన యుత్పాతములు గాంచి ద్రోణాచార్యుఁ డీలాగున ననెను.

ద్రోణ:—సూర్యుఁడు మలినత నందెను. నక్కలు కూయుచున్నవి. తూర్యములు దమంత విశ్రుతముగా మ్రోగుచున్నవి. గుఱ్ఱములు నిష్కారణముగాఁ గన్నులనుండి నీరు విడుచుచున్నవి. ఈ యుత్పాతములు చూడ జయము మనకుఁ గలుగునని తోఁచుట లేదు. ఇదె యర్జునుఁడు గజయూథమును జూచి యలిగిన యాకొన్న సింగమురీతిని వచ్చుచున్నాఁడు. ఈతని నెదురింప జాలు సమర్థులు మనసేనలో నెవరును లేరు. పరమశివుఁ డీతని గారవించి యున్నాఁడు. వీనితో యుద్ధము సేయుటకంటె గోవుల వానికర్పించి మఱలుట మేలగును.

కర్ణ:—పాండవులయెడఁ బక్షపాతమున నోటికి వచ్చిన లాగునఁ బల్కుట యుచితము గాదు. కౌరవసేనలో రథికవరు లెందఱుండ లేరు. వారెల్ల మిన్నకుండ మీరేల జోక్యము గలిగించుకొనెదరు? శక్తిగల్గిన యుద్ధము సేయుఁడు. లేకున్న నూరకుండుఁడు. నిక్కముగ వీఁడర్జునుఁడే యయిన నావాఁడి యమ్ములఁజీల్చి చెండాడఁ గలను. ఒక్క వీరునకుఁ బ్రతివీరుఁ డొక్కఁడు చాలఁడా? పెక్కు దినములుగ నేఁబార్థునితో

దలఁపడఁ బ్రతీక్షించుచుండ నేఁటి కది చేకూఱెను. మీ రేల దీనికి విఘ్నము సేయ నెంచెదరు.

సుయోధనః—మిత్రమా! నీవు తప్పఁ బలుకుచున్నావు. ఇతఁడు పార్థుఁడే. పడవి కేఁగి ప్రాల్పాయుతముగా మఱలఁ బన్నెండేఁడులు వసింపవలయును.

భీష్మాదు లీతనిమాటలు విని మందహాస మొనర్చుచుండిరి. సైనికు లెల్లరు మేము మేలని సంతసించుచుండిరి. యుద్ధము తటస్థించిన మాందెన్వారు రణమునకుఁ గడఁగవలయునని వారెల్లరు నాలోచించుచుండిరి.

అప్పు డర్జునుఁడు పితృవనముందలి శమీవృక్షము చెంత రథము నిలిపెను. చెట్టుపైనుండు నాయుధముల కట్ట నుత్తరుని మూలమునఁ దెప్పించెను. దానిలోని యాయుధములను, వానిదాల్చు వారిని ప్రత్యేక ప్రత్యేకముగా వాని కర్జునుఁడు వివరించెను. తానర్జునుఁడగు టయుఁ, గంకాదులు ధర్మజాదు లగుటయు నతని కెఱింగించెను. గాండీవము చేతఁ దాల్చెను. ఇంద్రదత్తమగు కిరీటమును ధరించెను. రథమునఁ గపిధ్వజమును గట్టించెను. అర్జునుని ప్రాపున నిర్భీకుండగు నుత్తరుఁడు సారథ్యము సేయ సమకట్టెను. అంతఁ బార్థుఁడు రథముపై నెక్కి దేవదత్తమును బూరించెను. ఇట్లర్జునుఁడు వచ్చుచుండుట గాంచిన యాచార్యుఁడు సుయోధనుని గాంచి;

ద్రోణః—సుయోధనా! అదె కపిధ్వజము గాంచుచుంటివే? అవచ్చువాఁడ యర్జునుఁడు. ఇప్పుడు మనము పరస్పరము వాదప్రతి వాదములకుఁ గడఁగుట యుక్తము

గాదు. ముందు నీవు చనుచుండుము. పసులం జుట్టుముట్టి మేము సాయుధులమై నీవెనుక వచ్చుచుందుము. అర్జునుఁడు చెంతకు రాఁగనే అభిముఖులమై వానితో రణ మొనర్తము.

సుయోధన:— రోషముననేని రాజ్యాభిలాషముననేని నర్జునుఁడు వచ్చియుండవలయును వీనితో రణ మొనర్పవలయు టుచిత మగుచుండ ఆచార్యులు నను భీతుఁగాఁ దలంచి కొంద నిపి తిక్కినవారు పసులను నన్ను గాపాడుచు వెనుక రావలయునని యానతిచ్చుచున్నారు. ఎవ్వని చెనకఁజేసి, నను భీతుఁజేసి పలుకుట తగునే? వృద్ధులగుటచే యుద్ధ మొనర్పఁ జాలకుండిన ఇంటికడనయుండరాదా? ఏల ఇచ్చటికి రావలయును?

అశ్వత్థామ:—తన్ను నెదిరి నిలుఁగక గర్వాంధుఁడవై నోరికి వచ్చినలాగున వాగుచున్నావు. రణ మొనర్చి శాత్రవులఁ గెల్చి రాజ్యమును గైకొనియుండిన గర్వించుఁడవు గావచ్చును. మాయ జూదమున అమాయకులగు పాండవుల నోడించిన నీకింత నోరుండఁజేసినదియే. నాఁటి శకునియే నేఁడు నీకు సాహాయ్యము సేయును గాక. బ్రాహ్మణులము భోజన ప్రియులము. మాతో నీకేమి కార్యము గలదు? తన ప్రియశిష్యుఁడగు పార్థుని పరాక్రమము దెల్పుట యాచార్యునకుఁ దగదా? సిగ్గుమాలి యుద్ధ మొనర్చిన మాతండ్రి యాచరింప నిమ్ము. నేనిట్టిదాని కొడఁబడఁజాలను—ఓరీ! ఇది జూదము గాదు. ఇచ్చటఁ గపటబుద్ధి యుపయోగింప వీలుగాదు. ఇది రణరంగము. శత్రువుల నెదిర్చి ఘోరముగఁ బోరు సల్పవలయును. సమర్థుఁడగు వాఁడా కార్యమున నుపక్రమింప వచ్చును.

కర్ణ:—భీతిపొంపున మీరెల్లరు ఇట్లాడుచున్నారు. ఇట్టి వారు తగుదుమని మేటి మొనగాండ్రవలె యుద్ధరంగమునకు ఏల రావలయును? నేనొక్కఁడ యీఫల్గునుని ఎదురింపఁ జాలనే? కర్ణార్జునులలో ఎవ్వఁడు బలవంతుఁడగు మీకీనాఁడే ముమును చూపఁగలను. పరశురాము ననుగ్రహమునఁ బడసిన విలువిద్య ప్రకటించుటకుఁ దఱి గల్గెను. మీరు నాపోరు చూడ నిష్టమే యుండుఁడు లేకున్న నావలకుఁ బొండు.

కృప:—కర్ణా! నీవెల్లప్పుడు గర్వమునకు పాలు ద్రవ్వుచుందువు. దేశకాలాదుల విచారింపవు. అర్జునుఁడేకాకియే కదా యనియెంచి ఇల్లాడెదవు కాఁబోలును? నాఁడు ఖాండవ దహనమున ఇంద్రాది దేవతలతోఁ బోరు సల్పినది అతఁడొక్కఁడే కదా! యాదవ బలమెల్ల నెదురింపఁగా అలనాఁడు వారి నోడ్చి సుభద్రను దెచ్చినది అతఁడొక్కఁడే కదా! గంధర్వరాజు నోడించి నీయీరాజును విడిపించినది అతఁడొక్కఁడే కదా! నాఁడు నీ వచ్చటనే కదా యుంటివి? చిత్రసేనుని ధాటి కాఁగలేక పాఱిపోవుటయు కాక పేతేమి చేయఁగలిగితివి?

కర్ణ:—కలకాల మీరాజు సన్నముఁదిని కృతఘ్నులై సమయమునకు తటస్థించినప్పుడు ఇట్లాడుటనుచితము. మీమాటల విననొల్లను. నేనొక్కఁడ వానిని జయింపఁగలను.

భీష్మ:— సుయోధనా! ఆచార్యునిమాట లధిక్షేపార్హములు గావు. కృపాశ్వత్థామల పలుకులు యుక్తతరములు. ముందు వెనుక లారయక వారిని దూషింపకుము— కర్ణా!

సమయ మెఱుఁగక కేవల మసూయాపరవశుఁడవై ఈలాగున నాడుట పాడిగాదు—ఆచార్యా! ఆచార్యపుత్రా! కృపాచార్యా! బాలుఁడు. మీ శిష్యుఁడు. తెలివిలేమి నేదియో పల్కిన దాని క్షమింపవలయును గాని ఆగ్రహము పొంద వచ్చునే?

ద్రోణః— పితామహా! మా యలుక యంతయు నీ పలుకులు వినినతోడనె పోయెను. మీఁదికార్యము నాలోచించుట యుక్తము. అర్జునుఁడు ధర్మవిదుఁడగు ధర్మజునిచే శిక్షితుఁడు. అట్టివాఁడు సమయ మతిక్రమింపక బయలుపడి యుండఁడని నావిశ్వాసము. దానిని నిరూపింపఁ గురువృద్ధుఁడవగు నీవ యర్హుఁడవు.

భీష్మః— రెండవ యేఁట నొక్క యధిక మాసము వచ్చెను. ఇట్లెక్కిన యానెలలఁ గూర్చిన నిన్నటితో వీరి యజ్ఞాతవాస సమయము నిండెను. అయినను. ఎదుటివారు యుద్ధసన్నద్ధులై వచ్చియుండ వెనుదీయుట క్షత్ర ధర్మము కాదు. కాఁబట్టి మనము రణమునకు సంసిద్ధులము గావలయుట యుక్తము. సంధి యొనర్చుకొనుట అంతకంటె యుక్తతరము.

సుయోధనః— నేను పాండవ హననమునకై యీశ్వ రాజ్ఞను జనించినవాఁడను. కాఁబట్టి వారితో సంధికొడఁబడఁ జాలను. యుద్ధ మొనర్చుటయే కర్తవ్యము.

ఆవల వారు చేయునది లేక యుద్ధసన్నద్ధులై నిలిచిరి. అర్జునుఁ డాచార్యులకు నమస్కారబాణము లర్పించి శత్రువులతో యుద్ధముసేయ సాగెను. కౌరవులుత్సాహపూరితులయి

యుద్ధము చేయుచుండిరి. ఒంటరిగాని జయించుట కష్టమా యెను కౌరవ సైనికులలోని వీరులును జయశీలుఁడగు తనకు వీరేపాటివారని యర్జునుఁడును దలఁచుచుండిరి. జయమేవంకను గలుగు ననుట నిశ్చయింప వీలుగాకుండెను.

ఈలాగున ఒకరికొకరు తీసిపోవక యుద్ధము జరుగు చుండఁ క్రమక్రమముగా అర్జునుని బాణవేగమతిశయించు చుండెను. పార్థుని పరాక్రమ మధికముగు కొలఁదిని గురువీరుల శౌర్యము దఱుఁగఁ జొచ్చెను. విజయుని శరవేగమున కాఁగఁ జాలక కురుసేన పసులఁ దోలుకొని వెనుదిరిగి యరుగ నారం భించెను. ఇది గాంచిన యర్జునుఁడు సుయోధనుని బిలిచి;

అర్జున — సుయోధనా! భీతిని నీసేన వెట్టిరిగిన నీకు కవ మానము లేదా? ఇట్టైన నీకు రాజరాజ బిరుదము దక్కఁ గలదా? నలుగురు విన్న నగుబాట్లగుటను చింతనైన లేకున్నదే? ఇట్టి భీరుఁడ వింటనే యుండక తగుదునని రణాంగణమున కేల వచ్చితివి?

ఇది వినిన సుయోధనుఁ డత్యంత క్రోధావిష్టుఁడై వెనుక మఱలి పోవుచుండు తనసేనల నుత్సాహ వాక్యములఁ బురికొల్పెను. సుయోధనుని పలుకులచే ద్విగుణితోత్సాహు లగు సైనికులు మఱల యుద్ధముసేయఁ జొచ్చిరి. పార్థునకును గౌరవ బలమునకును ఘోర సంగ్రామము జరుగుచుండెను. అంతఁ బాండవ మధ్యముఁడు శత్రువులపై మోహనాస్త్రము ప్రయోగించెను. కౌరవులు దాని దాఁకున మూర్ఛితులయిరి. అర్జునుఁ డుత్తరకు బొమ్మ పొత్తికలకై భీష్ముని పాగఁ వస్త్రఁ

దక్షిణ వారి శిరస్త్రాణములను ఉత్తరుని మూలమునఁ దెప్పించెను. పసుల మరల్చుకొని పార్థుఁడు నగరాభిముఖుఁడై చనెను. అవలఁ గొంతవడికి మూర్ఛదేఱిన కౌరవులు విషణ్ణ హృదయులై హస్తిపురాభిముఖులై వెడలుచుండిరి.

సుయోధనుఁ డీలాగున పరాజయము గలుగుటచేఁ దనతోఁ బాండుసుతులు పలికినవెల్ల స్వప్రయోజనపరతచే నేర్పడిన కల్లమాటలయి యుండునేమోయని సంశయించెను, అలాగున వారు దన్ను బిలచి యసత్యము లాడినవారికి లాభమేమిటి గలదు? కాబట్టి అవి యథార్థములే యగును. ఎదుటి వారికి ఇంచుక జయము చూపినఁగాని వారు దమతో రణమునకు డీకొనరు. వారు యుద్ధమునకు వచ్చినఁగాని దమకు జయము గలుగదు. కావున భారతయుద్ధ మారంభమయి అందుఁ దమకు జయము గలుగుటకై, ఎదుటివారిని యుద్ధమునకుఁ బురికొల్ప నీశ్వరుఁడీలాగునఁ వారికి గించిజ్జయము గలిగించి యుండనోపునని తలఁచి యుత్సాహముతోఁ దన వెడలెను.

సాయము కుదిర్చికోలు

"ఆహా! పాండవులకు విరాటుని సహాయ మొనఁ గూడెను గదా! యాజ్ఞసేని మూలమునఁ బాంచాలురును, కృష్ణుని మూలమున యదువృష్ణ్యంధకాదులును గూడుదురు గాని ఇంకెవరు వారికి సాయపడఁజాలరని తలఁచి యుంటిని. ఇప్పు డుత్తరా వివాహ మూలమున విరాటుఁడు వారికెంతయుఁ

దోఁచెడను. ఇంక నే నూరకుండుట సరి కాదు. చిన్నపాము నైనను బెద్దకఱ్ఱతోఁ గొట్టుట మేలగును. ఇంక నాకును దగినంత సాయము గుదుర్చుకొనుట కర్తవ్య మగుచున్నది.

ఇప్పుడు కృష్ణుని నా వైపునకుఁ ద్రిప్పుకొనుట మేలగును. అట్లని యదువృష్ణ్యంధకాదులు నాకు వశవర్తులు కాఁగలరు. కాని పాండవ పక్షపాతియగు వాసుదేవుని నా వైపునకు ఎట్లు త్రిప్పుకొనుట యనునంశ మాలోచనీయము. ఇప్పుడు పాండవులు యుద్ధమునకుఁ దమకుఁ దోడ్పడ వలయునని అతనిని ప్రార్థింప వత్తురుగదా? అంతకుమున్న నే నరిగి అతని నాకు సాయపడులాగున వేఁడుకొనెదను. అతఁడు మొదటి వేఁడుకోలు నా దగుటచే దీనిని ద్రోసి పుచ్చఁజాలక నా వైపు నుండును. 'నే బాండవ పక్షపాతి యగుటచే రా'నని యాడునే? బాంధవ్యమున మే ముభయులము సమానుల మగుచుండ బహిరంగముగా అట్లాడఁ జాలఁడని తోఁచెడిని. ఎట్లును నే నాలసించుట దగదు."

అని ఈ లాగునఁ దలపోసి సుయోధనుఁడు సారథిని బిల్చి తేరు బూన్ప నియోగించెను. దివ్యాభరణాలంకృతుఁడై రథమునెక్కి ద్వారవతికరిగెను. కృష్ణుని మందిరము చొచ్చెను. వాసుదేవుఁడు నిద్రించుచుండెను. కాఁబట్టి సుయోధనుఁ డాతని శిరము వైపు గూర్చుండెను. అంతఁ గొంతవడి కర్జునుఁడు వచ్చి హరి నిద్రించుచుండుటఁ గాంచి అతని పాదములకడ నిలుచుండెను.

నిద్రమేల్కొన్న దేవకీతనయుఁ డాదిని అర్జునుని గాంచి కుశలప్రశ్న గావించెను. పిమ్మట వెనుదిరిగి సుయోధనుని జూచి యోగక్షేమము లారసెను. వారి రాకకుఁ గారణము దెలియఁ గోరి ;

కృష్ణః— మీ రిరువురు నిచ్చటి కేల వచ్చితిరో తెలుపుఁడు. నాచేఁ గాఁదగిన దెద్దేనుండినఁ బూర్తిగావించెదను.

సుయోధనః— మాకును పాండవులకును యుద్ధము జరుగఁ బోయెడిని. అట్టియెడ నీవు మాపక్షమునఁ జేరవలయు నని కోరెదను. ఈ కార్యము నుద్దేశించియే నే నిచ్చటికి వచ్చి నాను. మున్నునీయొద్దకు వచ్చినవాఁడను నేనుగాని యొరుఁడు గాఁడు. నీకు మే మిరువురము సమానులమే కదా !

కృష్ణః— నీవిచ్చటికి మున్ను వచ్చుట యథార్థము. నేను పార్థుని మున్నుఁ జూచితిని. కాఁబట్టి మీయిరువురకును దోడ్పడవలయుట నాకు విధి యగుచున్నది. ఇందులకుఁ దగు విధానము చెప్పెదను వినుఁడు. నాతో సమానులగు వారు నారాయణాభిధానులు పదివేవురు గోపాలురు గలరు. వారొక వైపున సాయుధులయి యుద్ధము సేయువారు. నేనొకవైపున నిరాయుధుఁడనై రణ మొనర్పక యూరకుందును. ఈరెంట నెవ్వరి కేది ప్రియమగునో కోరుకొనుఁడు. మీలోఁ జిన్న వాఁడు మున్ను గోరుకొనుట న్యాయము. అర్జునా ! నీవు చిన్నవాఁడవు కాఁబట్టి ప్రథమమునఁ గోరుము.

అర్జునః— బావా! నాకు నీకంటె నన్యులు వలదు. నీవు చెంతనుండినచో నాకు విజయము గలిగిన లాగుననే యగును.

ఇది వినిన సుయోధనుఁ డీలాగునఁ దలఁచెఁ జొచ్చెను.

"కృష్ణునితో సమానబలులగు పదివేవురుండ వారి నంగీకరింపక నిరాయుధుఁడై యుద్ధవిముఖుఁడగు కృష్ణునీతఁ డంగీకరించుటలో ఏదేనొక మర్మముండవలయు నని తోఁచుచున్నది. వాసుదేవుఁడు పూర్వమే వానికిట్టిబోధ యొనర్చి యుండునే? అదెట్లు సంభవించును? ఇప్పుడే కదా నేనీతనిఁ దోడ్పడ రమ్మని వరించితిని! కాఁబట్టి ఆ యూహ సరి కాదు. దేవాంశ సంభూతులగు పాండవుల వధింప నీశ్వరుఁడు నన్ను సృజించెననికదా యసురు లాడియుండిరి! దానికిఁ దగు సహాయసంపత్తి వలయును. కావుననే ఈశ్వరుఁ డీతనికిట్టి బుద్ధి పుట్టించియుండ నోపును."

అని ఈలాగున నాలోచించుకొని కృష్ణు నాలోకించి;

సుయోధనః:—ఇంక నేను గోరుకొనవలసిన యవసరము గాన్పించుటలేదు. శేషించినవారలు నావారలే యగుదురు.

కృష్ణః:—ఆహా! ముమ్మాటికిని వారు నీవారలే. అందులకు సందియమేమి? ఇదె వారలను బిలిచి నీవశము గావించెదను.

అని తత్క్షణమ వారల రావించి సుయోధనున కర్పించెను. వారిని దోడ్కొని రారాజు బలరామునిచెంత కరిగెను. రాముఁడు దనశిష్యు నాశీర్వదించి యాదరించెను. సుయోధనుఁడు వచ్చినకార్య మాతనికి నివేదించెను. బలభద్రుఁ డదివిని;

బలరాముః—వత్సా! అభిమన్యుని వివాహ సమయమున ఆసభలో నేనొక్కఁడ నీపక్షము బలికిన వాఁడను. తక్కినవారలు పాండవ పక్షపాతులై నామాటల కసహ్యపడి ప్రతికూల వచనములాడిరి. కృష్ణున కవి ప్రియములయి యుండెను. నేనతని వీడి ఒక్క నిమిషమే నుండఁజాలను. అతనికి గష్టము దోఁచులాగునఁబలుక నొల్లను. కాఁబట్టి ఒక నిశ్చయము చేసికొంటిని.

సుయోధనః— గురువరేణ్యా! అది యెట్టిదో సెలవిండు.

బలరాముః—మీరును వారును పోరునప్పుడు ఎవి రెట్లున్నను నేను పలుకకుండులాగున నిశ్చయించుకొంటిని.

సుయోధనుఁడామాటలు విని ఎట్లైనను ఎవరి పక్షమునఁ జేరకుండెను గదా యని సంతసించెను. బలదేవుని వీడ్కొనెను. కృతవర్మపాలికిఁ బోయెను. తన యాగమన ప్రయోజన మాతనికి దెలియఁ బలికెను. అతఁడు గొంతసేనం దోడ్కొనివచ్చి సుయోధనునకు సాయపడెదనని పలికెను అంత నారాయణగోపాలగణమును వెంటనిడుకొని కౌరవేశ్వరుఁడు హస్తిపురమున కరిగెను.

మిత్రభేదము

పాండవులు శల్యునకు దూతనంపుట కౌరవేశ్వరుఁడు దెలిసికొనెను. శల్యుని బల మెఱిఁగిన వాఁడగుటచే వానిఁ దనవనము గావించుకొనుట కుపాయ మాలోచించుచుండెను.

"శల్యుఁడు మాద్రేయులకు మామ కాఁబట్టి వారి యెడఁ బ్రీతి యుండవచ్చును. కౌంతేయులపై వానికేల ప్రీతి యుండును? కాఁబట్టి వాని స్వాధీనము గావించుకొనుట అంత కష్టములోనిది కాదని భావించెదను. శల్యుఁడు వచ్చుమార్గమునఁ దగువారల నియోగించి ఆతనికి సుఖవసతు లేర్పఱిచెదను. దానిమూలమున అతఁడు మనయెడ ననురక్తుఁడు కాఁగలఁడు. మామనను సరించి మేనల్లునను మనపక్షము నవలంబింపవచ్చును. అప్పుడు ధర్మపుత్రుని పక్షమంతయు శిథిలమగును. రాజనీతి దెలిసినవాఁ డెల్లప్పుడును శాత్రవుల యెడ మిత్రభేదము గావింప వలయునది. అట్టివాఁడు గాని జయమును బొందనేరఁడు."

అని ఈ లాగున నాలోచించిన రాజరాజు సమర్థులగు పరిజనుల రావించెను. శల్యుఁడు వచ్చుమార్గమున సర్వసౌఖ్యము లతని కమర్పవలయున దని వారి కాజ్ఞ చేసెను. గూఢాకారముతోడఁ దానును వారి ననుసరించి వచ్చుచుండెను. శల్యుఁడు దన కాలాగున మార్గమధ్యమున సర్వసౌఖ్యము లబ్బుట కబ్బురపడెను. అంత నాతఁడు దన పరిజనులఁ బిలిచి;

శల్యు:— ఈలాగున మనకు వలయువాని నెల్ల సమకూర్చునంతటి సమర్థుఁడగు యుధిష్ఠిరు సమాత్ముఁ డెవ్వఁడయి యుండును? వాని నారసి దోడ్కొని వచ్చునది. వాఁడు నా యనుగ్రహమునకుఁ బాత్రుఁడు కావలయును.

మాఱువేసమున నుండు సుయోధనుఁ డామాటలువిని;

"ఇది నే నాతని సందర్శించుటకుఁ దగు సమయము. ఇప్పుడు నే బయలువడిన నా కోరిన కార్యము పూర్తి గావించును. మద్రరాజు, అనుగ్రహింతునని వచించి వెనుదీయు నంతటి నీచుఁడు గాఁడు. ఆడినమాట తప్పఁడు"

అని తలఁచి యాతని యెదుటి కరిగెను. శల్యునిపరిజను "లీతఁడే మన కన్నివసతు లేర్పఱిచిన వాఁ"డని తెలిపిరి. శల్యుఁడు వానిఁజూచి సంతసించి,

శల్యు:— ఓయీ! నీ కేమి కావలయునో కోరుకొమ్ము. తప్పక నే దాని నిత్తును. నే నెప్పుడును అసత్యమాడు వాఁడను గాను. నాచే వరము వడసిన మీ రా జెచ్చటఁ గోపించునో యని తలఁపకుము. దీనిమూలమున నీవాతని యాగ్రహమునకుఁ బాత్రుఁడు కాఁజాలవు. ఇది నిక్కము. నా పలుకుల విశ్వసింపుము.

సుయోధన:— మద్రేశ్వరా! నీవు సత్యవాదివి. ఎట్టి యిక్కట్టు గలిగినను ఆడినమాట తప్పని వాఁడవనుట నే నెఱుఁగుదును. నా కోరు వరము నడుగుటకు మున్ను నన్నెఱిఁగించుకొనెదను. వినుము. ఎవ్వఁ డభిమానధనుఁడగుటచేఁ దన కవమానము గల్గించిన పాండవుల, నజేయపరాక్రములని

వాసిఁగాంచిన వారల నడవులఁ గడు నిడుములఁ బడులాగునఁ జేసెనో? ఎవ్వఁడు రాజరాజ బిరుదాంకితుఁడై రాజులనేకులు దన్నుఁ గొలువ సింహాసనాసీనుఁడై, ప్రజలఁ బుత్త్రనిర్విశేషముగఁ బాలించుచుండెనో; ఎవ్వఁడు వైష్ణవ యాగము చేసి, ధారుణీసురులఁ దనియించి ధన్యతఁగాంచెనో; ఏవాఁడు కౌరవజ్యేష్ఠుఁ డగుటచే న్యాయబద్ధమగు రాజ్యపాలనమున కర్హుఁడై, అక్రమముగ రాజ్యభాగముఁగోరి తనతోఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచున్న పాండవుల సమయించి లోకమున న్యాయమును నిలుపనెంచెనో; అట్టి సుయోధనుఁడు నీకిప్పుడు పరిచారకుఁడుగ నిదె యున్నవాఁడు. నీవు ననుగ్రహింపుము. మద్రనాథా! ఇప్పటఁ నీకుఁ బరిచర్య లొనర్చువారు నా పరిజనులు. వారెట్టి లోపములు సేయకుండు లాగున ఈవేసమున వచ్చి చూచుకొనుచుంటిని. పాండవుల తోడ నా కనివార్యమగు యుద్ధము తటస్థించి యుండుట నీ వెఱిఁగినదే కదా! నాకుఁ దగుమంత్రి యొక్కఁడు గావలసెను. అట్టివాఁ డిప్పటఁ జిక్కఁగలఁడని యాలోచించుచుండ నీవు స్మరణకు వచ్చితివి. అంత నీకు దూతనంపఁ దలఁచితినిగాని నీవిటు వచ్చుచుండుట దెలిసెను. నీ మనసు పాండవులనుండి మఱలింప నెంచి ఈ వేసమూనవలసెను. అది యిప్పుడు సఫలమయ్యెను. పాండవులకై పనిసేయు నరుగువాఁడ నాపక్షమంగీకరించుట సరియా యని తలఁచెదవు గాఁబోలు? నీకుఁ గౌంతేయులు మేమును ఒక్కరూపు వారమే. ఇఁక మాద్రీ తనయులను గుఱించి కదా నీవు వారితోఁ గూడవలయును? నకుల సహదేవుల

సోదర నిర్విశేషముగా నేఁ బ్రోచెదను. వారిని నాతోఁ జేర్పుము.

ఈమాట లాలకించిన శల్యుఁ డతి విస్మితుఁడై ఈ లాగునఁ దలఁపఁ జొచ్చెను.

"ఔరా! సుయోధనుని రాజనీతి పాండిత్యము! శత్రుపక్షమును ఎంతలో భేదింపఁ జొచ్చెను? నాయట్టి వాని నీతఁడు వలలో వైచుకొనుట ఈతని సామర్థ్యమును బ్రకటించు చున్నది. కానీ! ఇంక నేమి సేయఁగలను? ఆడినమాట తప్పు టుచితము కాదు. ఈతని పక్షముననే చేరవలసి యున్నది. ఈ విషయమున సుయోధను నం దావంతయు లోటు లేదు. అతఁడు రాజనీతి విశారదుఁడు. కాబట్టియే యిట్టి మిత్రభేదము గల్పింపఁగలిగెను. ఇట్లాచరించుట యాతని కుచితమే యగును. అయినను నేను వంచితుఁడ నగుట యదార్థమేకదా! సమ యము చూచి వంచనకుఁ బ్రతివంచన గావించెదను. ఆ లాగునఁ జేయుట దోషావహము కాదని నాయభిప్రాయము."

అని తలఁచి సుయోధను నుద్దేశించి :

శల్యః— సుయోధన రాజేంద్రా! నీవు నుడివినలాగున నాకుఁ గౌంతేయులు నీవును ఒక్క రూపువారలే. కాఁబట్టి నేను నీ యిచ్చచొప్పున అమాత్య పదవి నంగీకరించితిని. మాద్రేయుల మఱల్చుట నాచేఁగానిపని. కాఁబట్టి ఆప్రయత్న మును మానుము. వారును ఇది మొదలు నాకు శాత్రవకోటి లోని వారలే. క్షత్రియునకు రణరంగమునకు వచ్చినపిమ్మటఁ దండ్రియైనను గుమారుఁడైనను గురువైనను ఎదుటి పక్షము

వాఁడు సంహరింపఁ దగినవాఁడే యగును. అట్టుండ వారిని మన పక్షమునకేల పిలువవలయును? పిలిచితిమిపో! వారేల మన పక్షమునకు రాఁగలరు? యాజ్ఞసేనియట నేవుర నొక్క-టిగాఁ జేర్చి బంధించియున్న దనుట మఱచితివి గాఁబోలు! వారు రాకున్న మనకిచ్చటఁ గలుగఁబోవు లోటేమిటి?

సుయోధన:— అరుల పక్షము శిథిలమగుట మన కనుకూల మగునది కదా!

శల్యు:— నీవు పల్కినది వాస్తవమే. అయినను అది దుర్ఘటము. ఇంక నీవాచింత మానుము. నాకు సెలవొసంగుము. పాండవుల పిలుపుపై వచ్చినవాఁడ నగుటచే వారిని గాంచి 'నేను సుయోధనపక్ష మవలంబించితి' నని వచియించి హస్తిన కరుదెంచెదను. నీవిఁక సంశయింపకుము.

సుయోధనుఁ డాతనిమాట చొప్పున అతనికి సెలవొసఁగి తాను దనపరివారముతో హస్తినకు వచ్చెను. కిరాతాది సైన్యములతోడ భగదత్తుఁడును, భూరిశ్రవుఁడును వచ్చి కౌరవులతోఁ జేరిరి. కాంభోజాధీశుఁడగు సుదక్షిణుఁడు ఇంకఁ బెక్కురు రాజులు దమసేనలతోడ వచ్చి వారి పక్షమునఁ జేరిరి.

శ్రీకృష్ణనిరాయబారము

కర్ణా! నాతండ్రి వృద్ధుఁడగుటచేఁ జిత్తస్థైర్యము లేక నాబలఁగము విషయమున నేనెంత చెప్పినను నమ్మక నామాట లెల్లఁ గల్లలని భావించుచున్నాఁడు. మొన్న సంజయుని మాటలువిని కృష్ణుఁడొక వీరవరుఁడని భావించి నన్ను బిలిచి యుద్ధ మాపమనెను. రాజగువాఁడు దనమాటలఁ దాను జెల్లింపఁజాలని యెడల వానిని ఎవరు సరకు సేయుదురు? కృష్ణుఁడుండు వైపుననే జయము గలుగునఁట. కృష్ణు నంత బలముగలవారు సాయుధులు నారాయణ గోపాలురు పదివేవు రున్నారని నే నాడిన నామాటల యందు విశ్వాసరహితుఁడై మరలమరల వారికే జయము గలుగు ననుచుండును.

కర్ణ:—సుయోధనా! ముదుసలి మాటల కేమిగాని యుద్ధమునుమాత్ర మాఁపఁజూడకుము. సంధికొడఁ బడకుము.

సుయోధన:—నేనేల యంగీకరింతును? పాండవుల సంహరించుటకై ఈశ్వర ప్రేరితుఁడగువాఁడను ఆవని సేయక మిన్నకుందునే?

అని పలికి సోదరబృందముతోడను మిత్రవర్గముతోడను సభాభవనమున కరిగెను. వీరికిమున్నే ధృతరాష్ట్రుఁడు భీష్మాది వీరులతోడ నచ్చటికివచ్చి యుండెను. శ్రీకృష్ణుఁడు సాత్యకితో ఆ సభాభవనమునకు వచ్చెను. నారదాది మునిబృంద మాప్రదేశమున కరుదెంచెను. అప్పుడు కౌరవులచే యథావిధిగాఁ బూజితుఁడైన వాసుదేవుఁడు ధృతరాష్ట్రు నవలోకించి;

కృష్ణ:— రాజేంద్రా! నీయెఱుఁగని ధర్మములు లేవు. క్షీరనీర న్యాయమునఁ బాండవులును నీసుతులును గలిసి మెలసి యుండుట శ్రేయస్కరమగును. నీపుత్త్రుఁడు కర్ణాదుల మాటలు విని చెడిపోవుచున్నాఁడు. వాని యిష్టము చొప్పున నరిగినఁ గష్టములు గలుగును. వృకోదరార్జునులు యుద్ధరంగమున నిలిచిన వారిని మీవారలలో నెవ్వరెదురింప నేర్తురు?

దుశ్శాసన:— కృష్ణా! నీ విపుడు దూతకృత్యమునకై వచ్చిన వాఁడవు. కాఁబట్టి వారిమాటలఁ జెప్పవలయునే కాని నీ యభిప్రాయములు బయలు వెట్టుట కిది సమయము కాదు.

సుయోధన:— వత్సా! ఈ ఘట్టమున నీ వీలాగునఁ బలుకుట తగదు. అతని ధోరణి యంతయు కానిదే నీవు నడుమవచ్చి అడ్డుపలుకుట దగునా?

కృష్ణ:— బాలుఁడయినను దుశ్శాసనుఁడు లెస్సగాఁ బల్కెను. నీబోటి వారలుండునెడ నావచ్చిన విషయము సెప్పక యన్యము వచించుట తగనిదగును.

సుయోధన:— కృష్ణా! నీవేల యీలాగున ఆగ్రహించెదవు?

కృష్ణ:— ఇది యాగ్రహోక్తి గాదు.

సుయోధన:— అది యటులుండనిమ్ము. నే నొకమాట యడిగెదను. దానికి సరియగు సమాధాన మీఁగలవా?

కృష్ణ:— రాజరాజవగు నీవడిగినఁ జెప్పకయుండుట సాధ్యమగునే?

సుయోధనః:- ఈ చతురోక్తు లింకఁ జాలింపుము. నీవు మాయొద్ద కరుదెంచిన వాఁడవుగదా ? బాంధవ్యమునఁ బాండవులతో సమానులగు మాయింట భుజింపక విదురునింటి కేల యరిగితివి ?

కృష్ణః:- పగవాని యన్నము భుజింపరాదు. పగవానిఁ బిలిచి తనయింట నన్న మిడఁగరాదు. నీవు బాల్యమునుండి పాండవుల ద్వేషించుచున్నావు. వారు నాకుఁ బ్రాణముల వంటి వారు. తమ ప్రాణములపైఁ బగఁ గొన్నవారు ద్వేషులగుటచే నీవు నాకు శాత్రవుఁడవు. అట్టి నీయింట యన్నము దినుట యుచితము కాదు.

సుయోధనః:- నీ కింతటి ద్వేషము గలదనుట నేను గదా తెలిసికొంటిని !

కృష్ణః:- సరే, ఇంక ఈలాటి వృథావచనములతోఁ బ్రొద్దుపుచ్చఁ జాలను. వచ్చినపని చూచుకొనవలయును-ధృతరాష్ట్రరాజన్యా ! పాండవులు నాముఖమున నీకుఁ దెలుప మనిన దాని వివరించెదను. దత్తావధానుఁడవై వినుము.

ధృతరాష్ట్రః:- నాబిడ్డలు కానలఁ బలుగడగండ్లుపడి ఎట్లో విరటుని పాలికిఁజేరి సుఖించుచున్నారని విని ఎంతయు నలరుచున్నాను. ధర్మాత్ములకు ధర్మజున కిట్టి కష్టములు గలుగుటకు దైవమే కారణము. ఎన్నియిడుములు గలిగినను భీమార్జును లన్నమాటకు లోఁబడి వాని నోర్చియుండుట వారి మహానుభావతను బ్రకటించుచున్నది. వనికూనలు

పాప మామాద్రీసుతులు అరణ్యావాస క్లేశమును ఎట్లనుభ వించిరో కదా !

అహా ! నాకోడలు ద్రౌపది ఎట్టి ధర్మస్వరూపిణి ! అట్టి యమవ్రత చెంతనుండుటఁ బట్టియే వారేవురు గానల నున్నను నగరవాసులకంటె సుఖముగాఁ గాలము గడుపు చున్నారు. వారికి నాయెడఁ గలభక్తి చెప్పనలవికానిది. కృష్ణా ! ఆలసింపక వారాడిన మాటలు వచించి నాచెవులఁ దనియింపుము.

కృష్ణః—వినుము వారి మాటలు. "మీావంపునన పన్నెండు వత్సరములు గానలఁ గడిపితిమి. పదమూఁడవ యేఁట నజ్ఞాతవాసము చేసితిమి. ఇఁక మాతండ్రిసొమ్ము పడ యుట న్యాయహితము. మా యర్ధరాజ్యము మీావలనఁ బడయఁ గలుగుదుమని కృతనిశ్చయులమై యున్నారము. మా కెల్ల చుట్టములు మీారయగుదురు. ఎప్పటికైన మిమ్ము గాక యొరుల నమ్మువారము గాము. మన కులముపాడి చెడకుండఁ గాపాడుఁడు." అని నీకుఁదెల్పమనిరి. దీనికి నీవేమి బదులు చెప్పెదవు?

అప్పు డాసభలోనికి వచ్చియుండిన మహర్షుల మధ్య మునుండి జామదగ్న్యమహాముని సుయోధనుని గాంచి;

జామదగ్న్యః— సుయోధనా ! గర్వ మెట్టివానికిని బనికిరాదు. గర్వితుఁ డగుటచేఁ గదా పూర్వము దంభో ద్భవుఁడు నరునిచేఁ బరాభూతుఁ డయ్యెను? ఆనరనారాయణులే

ఇప్పుడు కిరీటియుఁ గృష్ణుఁడునై యవతరించి యున్నారు. వారలతోడి విరోధము నీకుఁ దగదు.

కణ్వ:—జామదగ్న్యుని పల్కులు సత్యములు. తన్నును ఎదిరినిని ఎఱుఁగక నిగ్రహింపఁ బూనుట తగనిపని. అహంకారము పౌరుషమును నాశము గావించును. కాఁబట్టి ఎంతటి బలవంతునకేని గర్వము సరికాదు.

నారద:—కౌరవనాథా! వీరిమాట లత్యంత విశ్వాసార్హములు. ఎట్టివానికేని దుర్మానము దగదు. అది దుర్దశకు మూలము. కాఁబట్టి నీవీకృష్ణుని పలుకుల నాదరింపుము. ఇతఁడు సామాన్యుఁడని భావింపకుము. తలఁచినమాత్రాన లోకముల దహించునంతటి మహిమ గలవాఁడు. సత్త్వస్వరూపుఁ డగుటచే నిన్నిలాగున బ్రతిమాలుచున్నాఁడు. నీవలని భీతిని బలుకుట లేదని తెలిసికొనుము.

సుయోధన:—మహర్షి పుంగవులార! ఎట్టివానికి విధి యలంఘ్యము. ఒక్కొక్కరు గొప్ప కార్యము లాచరించుటకుఁ గాదె భగవంతునిచే సృజింపఁ బడుచున్నారు! అట్టియెడ వారు దమకార్యములఁ దీర్పకుండుట యెట్లగును? వారి యవతార కార్యము వారు తీర్పనెంచిన లాగున నా జనన ప్రయోజనము నేఁ దీర్పవలదా? కాఁబట్టి మీ రీ విషయమున జోక్యము గలిగించుకొనకుఁడు.

ధృతరాష్ట్రు:—కృష్ణా! వీఁడెవ్వరి మాటలును వినకున్నాఁడు. నీవేనించుక శ్రమ తీసికొని దారికిఁ బడఁ జేయుము.

కృష్ణః—సుయోధనా ! గొప్పవంశమున జనించితివి. సకలగుణ సంపన్నుఁడవని వాసిఁ గాంచితివి. అట్టివానికి నీకిట్టి దురాగ్రహము తగునా ? నీ యీ చేఁత ఈసభలోని వారి కెవ్వరికిని సమ్మతము గాకున్నది. బహుజన విరోధము గష్టముల కాకరమని తెలియవా? కావున బట్టి పాండవుల రావించి వారి యర్ధరాజ్యము వారి కర్పించి కీర్తిపడయుము.

భీష్మః—పాండసుతులతో నీకు వైరము దగదు. వారు దైవమానుష బలములు రెండును గలవారు. అట్టివారి నెదిరించుట సమంజసము కాదు. ధృతరాష్ట్రుఁడు జీవించి యుండఁగనే రాజ్యము, యశస్సు, బంధువులు, ఇది యని యననేల ? సర్వము నేల నాశము గావించు కొనెదవు? వృద్ధుల మాటలచే మామాటల నాదరించిన నీకు మేలు గలుగును.

ధృతరాష్ట్రః—కుమారా ! కృష్ణుని మాటల నాదరింపుము, పెద్దల పలుకుల గౌరవింపుము. నీకు సర్వశుభములు గలుగఁగలవు.

ద్రోణః—ధర్మసుతుఁడు సర్వజ్ఞుఁడు. అట్టివానిని నీవు తిరస్కరించుట నిందాస్పదము. అతఁడు నీపై నెంతయుఁ బ్రీతి గలవాఁడు. వానితోడి చెలిమిని నీరాజ్యము స్థిరపడఁగలదు.

సుయోధనః—కృష్ణా! ఆచార్యులును బితామహులును నాతండ్రియు నన్ను ఎల్లప్పుడు దూఱుచుందురు. నీవును వారి లాగుననే నను దూషింపఁగడఁగితివి గాని న్యాయము నారయ వైతివిగా ! మీరు పాండవులను అరణ్యవాసులఁ గావించి

పెక్కుడుములఁ గుడిపించితి నని నన్ను దూషింతురుగాని ఆందు నావలని నేర మావంతయు లేదని తెలియకుండిరిగదా ! జూదరి యగు ధర్మజుఁడు శకునితో జూదమాడి రాజ్యము నోడెను అది చాలక మఱల నాడి యోడి అడవుల పాలాయెను. ఇవి యెల్లను అతఁడు బుద్ధిపూర్వకముగాఁ జేసినవియే కాని నా నిర్బంధముననా యాచరించెను ? తాను జూదమున నోడిన రాజ్యము మఱలఁ దన కెట్లు వచ్చుననుట యెఱుఁగక కేవల రాజ్యలోభమున విరాటాదులఁ బురికొల్పుకొని మాపై యుద్ధమునకు రానున్నాఁడు. ఎదుటివారు రణమునకు వచ్చినప్పుడు మేము సన్నద్ధులమై యుండుటయా యన్యాయము ? ఒకవేళ, మాతండ్రి జూదమున నోడినవారికి మఱల రాజ్యము నిచ్చెను. గాఁబట్టి అది వారిది యగుననెదవేమా ? జూదమున నోడిన దాని మఱలఁ జూదమున గెలిచిపొందవలయునే కాని ఇచ్చుట కాతఁ డెవఁడు ? గ్రహించుటకు వీ రెవరు ? చక్కఁగ నాలోచించిన నామాట న్యాయబద్ధ మగునదియుఁ గాదియు నీ వెఱుఁగఁగలవు.

వికర్ణ:— మీ రెట్లాడినను వారి యర్ధభాగము వారి కిచ్చుటయే సరియగునని నాకుఁ దోఁచెడిని.

సుయోధన:— నీవు కుఱ్ఱవాఁడ వగుటచేఁ దెలియక యాడుచున్నావు. జూదమున నోడుటచే వారు రాజ్యార్హులు గారనుట యటుండనిమ్ము. జననము మూలమునను వారికి రాజ్యార్హత లేదు. ఏలన ? పాండురాజు మనతండ్రి యశక్తుఁ డగుటచే అతనికి బదులుగాఁ గొంతకాలము రాజ్యమును

పాలించెను. దాని మూలముననే అతని కొడుకు రాజు గాఁజాలఁడు. అదియునుగాక పాండవునకు వీరౌరసులుగారు. యమసుతునకుఁ గౌరవుల రాజ్యమెట్లు రాఁగలదు? అధర్మయుక్తమగు వీరిమాటల నమ్మి నీ వీలాగున నాడుట దగదు.

కృష్ణ:— నీ వలనఁ దప్పు లేదనికదా యూహించితివి! బాల్యమునుండి పాండవులయెడ నీ వాచరించిన కార్యములు నే నెఱుఁగనని తలఁచితివా? ఎత్తివిడిచిన వారని ఎల్లతప్పులు వారిపై మోపఁ జూచెదవా?

దుశ్శాసన:— అన్నా? తండ్రియు భీష్మాదులును జేరి ఈ కృష్ణునకు మిమ్మప్పగింపఁ దలచి యున్నలాగునఁ దోఁచుచున్నది. మీ రిట్టి సభనుండుట న్యాయముగాదు. లెండు. ఇటనుండి వెడలుఁడు.

సుయోధనుఁ డీమాటలు వినిన వెంటనే మాఱుమాటాడక యిటనుండి వెడలెను. కర్ణాదులును అతనిని వెంటనంటి చనిరి. వీరీలాగున నరుగుట కా సభలోని వారెల్ల ఏవగించుకొనిరి.

మంత్రాలోచన

ఆలాగున సభనుండి యరిగిన సుయోధనుఁడు కర్ణాదులతోడ మంత్రాలోచనాగారము చేరెను. అల నెల్లరు నాసీనులయిరి. అంత సుయోధనుఁడు రాధేయుని గాంచి;

సుయోధన:—మిత్రమా! వింటివిగదా మామత్రడి యొక్క దురుద్దేశము! కన్న కొడుకని కనికరమింతైన లేక కట్టడియయి ఆ విదురాదుల మాటలు విని నన్ను కృష్ణునకుఁ బట్టి యియ్యఁ జెప్పెనఁట. ఇది నీతి గర్హితమని ఇంచుకైనఁ దలంపఁడుగా! జనకుని యానతి మీఱ రాదనికదా ఇంత కాలము నేను శాత్రవులొనర్చు దుష్కార్యముల నోర్చి యుంటిని? అందులకిది ప్రతిఫలము గాఁబోలును! నీయట్టి వారు వృద్ధుని మాటల గణింపవలదని ఎంత చెప్పినను బెడ చెవిని బెట్టినందులకుఁ దగినలాగునఁ బ్రాయశ్చిత్తము జరిగెను. కన్న తండ్రియే యిట్లుండగా ఇఁక భీష్మాదుల మాట దలఁప నేల? ఆచార్యులుం బెన్నగు నీ బ్రాహ్మణులు నాసొమ్ము తిని నాకే యపకారము సేయఁ దలఁచుచున్నారు. వీరెల్లరు నామొడ నిట్లగుట కాలమహిమ గాకున్న నింకేమగును?

కర్ణ:— నేరమొకచోట జరిగిన నింద మఱియొక చోటఁ గలుగుననుట వాస్తవము. కృష్ణుఁడు తన చాక చాక్యమున వీరి బుద్ధులెల్లను మార్పఁగలిగెను. దానిని నీవు దెలియక కాలముపై నారోపించుచున్నావు. గోపాలుని దుర్మంత్రప్రభావ మింతకుఁ దెచ్చెను. కాఁబట్టి ఇఁకనైన నామాటవిని వానిని బట్టి బంధించుటుచితము. లేకున్న వాఁడిఁక నెన్నియేని దుస్తంత్రములఁ బన్నుచుండును.

సుయోధన:—దూతను నిర్బంధించుట రాచపాడి గాదు గదా!

దుశ్శాసనః—అన్నా! ఆదినుండి నీవీలాగునఁ బల్కుచుండుట చేతనే ఇంతయు పుట్టెను. దూతను హింసించిన దోషమగాని, మానభంగ మొనర్చుట పాపహేతుముగాదు. ఇంతకు నితఁడు దూతయే కాఁడని నామతము. దూత దనకిచ్చిన పనిని నివేదించి బదులు విని యేఁగును గాని వీనివలె లోలోన మిత్రభేద మొనర్చు, బహిరంగముగాఁ దిరస్కరించి పలుకునా? కాఁబట్టి వీని బంధించుట యక్రమము గాదు.

శకుని:—సుయోధనా! చేతఁ జిక్కిన శాత్రవుని కృష్ణుని బట్టి బంధించుట యుక్తము.

సుయోధనః—కృష్ణుఁడు శత్రువుల దూతగాని శాత్రవుఁడు గాఁడు.

శకుని:—"వారు నాకుఁ బ్రాణములవంటి వారు. తమ ప్రాణములకైఁ బగఁగొన్నవారు ద్వేషులగుటచే నీవు నాకు శాత్రవుఁడ" వని వాఁడే నుడివెను గదా? కాఁబట్టి శత్రుని జిక్కించుకొనుటయే యుచితము.

వికర్ణః— మీ దుర్మంత్రముల మూలముననే ఇంతయు పుట్టెను. ఇకనైన నీతిని మానవములను గాపథమునఁ జొరనీయకుఁడు.

శకుని:— పానకములోని పుడకలాగున నీవేల మాటిమాటికడ్డము వచ్చెదవు? నీకుఁ దెలియదు. ఒరులు సెప్పిన వినవు. ఇట్టివానికి పెత్తన మేల?

సుయోధనః— వత్సా! పెద్దవారి సంభాషణములకుఁ గష్టములు గల్పించుటయా తగవు?

వికర్ణుఁడు సుయోధనుని వంకకు నవలోకించి యిట్లని తల పోయఁ జొచ్చెను

"నేఁడిట్లు మాటలాడిన అన్నగారికిఁ గోపమువచ్చెను. పెద్దల మానసములు గలఁగించుట ధర్మము గాదు. కాఁబట్టి యూరకుండెదను. ఆదినుండి వీరి బుద్ధిని మార్చ నీ శకుని రాధేయుఁడు దాఁపురమై యున్నాఁడు. ఇంకీ ద్రోహి కర్ణుఁడు దుర్బోధ చేయుచున్నాఁడు. తక్కిన నా సోదరు లన్నగారు చనిన తెన్ననే పోవుచున్నారు. నేనొక్కఁడను ధర్మమును పాటించి ధర్మజుని పక్షమునఁ బలుకుచుండిన లాభ మేమియును గలుగుట లేదు. వీరికిఁ గృష్ణుని బంధించు ప్రయత్నమును మానరు. వీరి కాలోచన నాచరించుట సాధ్యము గాఁబోదు. దీని మూలమున ద్వేషము పెచ్చు పెరుఁగఁ గలదు. యుద్ధము తప్పక జరిగితీరును. జయము కృష్ణార్జునుల పక్షముననే కలుగఁ గలదు. ఇష్టమున్నను లేకున్నను ఇంటఁ జేరెడ నేను రాజునకుఁ గట్టువడిన వాఁడనే? కానిమ్ము. 'సదాఃఖం బహుభిన్నహా' యను నెంచి మదిఁ గుందుట పలుచుకొనెదను గాక."

అని తలఁచుచు మిన్నకుండెను. శకుని సుయోధనుని విలోకించి ;

శకుని:— ఆలసింపక సభకేఁగి కృష్ణుని బంధింపుము. ఇదియే ప్రథమకర్తవ్యము.

అని యీలాగున వారు మంత్రాలోచన గావించి యటనుండి కదలిరి.

సేనాపతి నిర్ణయము

సుయోధనుని బంధన ప్రయత్న మెఱిఁగిన కృష్ణుఁ డాతని దూషించి సభా మధ్యమునుండి వెడలి పాండవులఁజేరి యట జరిగినదెల్ల వివరించెను. వారలీమాటలు విని యుద్ధోన్ముఖులైరి. కృష్ణుఁ డర్జునునకు సారథి యయ్యెను. కురుక్షేత్రము నుభయులు రణరంగముగా నిర్ణయించుకొనిరి. రారాజు ద్రోణాదులను అక్షౌహిణీ నాయకులుగా నొనర్చెను. వారలతోడ భీష్మునిఁజేరి,

సుయోధనః:—తాతా! తారకలలోఁ జంద్రునివలె నీవు కురువంశమున కెల్లమేటివి. కాఁబట్టి సర్వసైన్యాధిపత్యమున కీవ తగినవాఁడవు. ఈ ప్రార్థన మంగీకరింప వేఁడుచున్నాను. నామాట వ్యర్థపుచ్చకుము.

భీష్మః:—నాకుఁ బాండవులు నీవు నొక్కరూపు వారలే కాఁబట్టి నీమాటల కడ్డుపలుకనుగాని యర్జునుఁడు దక్కఁ దక్కినవారితో రణమొనర్పఁ జాలుదును. అతఁడస్త్ర విద్యలో నాకంటె మేటియగును.

సుయోధనః:—మీయిచ్చ వచ్చినలాగున జరుపుము. నీవు సర్వసైన్యాధిపత్య మంగీకరించుటయే నాకు ముఖ్యము. ఈ కర్ణాదులు నీకుఁ దోడ్పడఁగలరు.

భీష్మః:—కర్ణుఁడా నాకుఁ దోడ్పడఁగలవాఁడు? సుయోధనుఁడ! నీవిఁకను వానిపై నభిమానము వీడకున్నావు. కడమాట యొక్కటి వినుము. మా యిరువురిలో నొక్కఁడే యుద్ధము చేయవలయును నీకు వానిపైనంత మక్కువయున్న వానినే రణమున కంపుము.

కర్ణ:—మిత్రమా! భీష్ముఁడు పడునంతవఱకు నేను యుద్ధమాడనని ఇదివఱకే నీతోఁ జెప్పియుంటిని గదా! కాఁబట్టి యాతఁడే రణమొనర్పనిమ్ము.

సుయోధన:—నెచ్చెలీ! ఇది శపథములు పలుకు సమయము గాదు. ఆగ్రహము మానుము. పితామహా! నీవ యాదిని యుద్ధమునకు వెడలుము. ఇకనైన సర్వసైన్యాధిపత్య మంగీకరింపుము.

భీష్మ:—అట్లేయొనర్పకొంటిని. ఇంక నొక శపథము గలదు. దాని నెఱిఁగించెదను వినుము. శిఖండి నాయెదుట వచ్చినచో నే రణమును మానుదును. ఇదినావ్రతము. అలాగున వాఁడు రాఁడేని పాండవుల సేనలనే నొక్కఁడ సంహరింపఁ జాలుదును.

సుయోధన:—అలాగుననే చేయుము. ఇఁక రణరంగమున కరుగుదము. మున్నే యచట మనకొఱకుఁ బటకుటీరము లమర్పఁబడినవి.

అని యెల్లరును గురుక్షేత్రాభిముఖులయి చనిరి.

ద్వంద్వయుద్ధము

"ఆహా! పరశురాముని నోడించిన భీష్ముఁడును, ఆచార్యులు నంపనుండ నాకేమి భయమని తలఁచియుంటిని. బలరామునివలన గదాయుద్ధ పాండిత్యము సంపాదించిన

నాకెదురెవరని కదా గర్వించియుంటిని! దానికి ఫలమిప్పుడ కంటిని. నాసారథి రథము తొలఁగించి తీసికొనిరాకున్న భీముఁడు నన్ను యమపురి కంపియుండును. ఇది నిక్కము.

కట్టా! ఈసారథి ఎట్టి యుపకారము గావించెను. శత్రువుతోఁ బోరి జయము గాంచలేని నన్ను బ్రదికించి కలకాల మవమాన పాత్రుఁడగు లాగునఁ జేసెను. ఇన్ని దినములు నారథమున నున్నందుల కిది యా ప్రత్యుపకృతి?

ఇంతకు నాకాలము చెడ్డదగుటచే నీ కిట్టి బుద్ధి జనించెను. కాలమహిమ గాకున్న నాయట్టివాఁడు మూర్ఛ నొందుటయు, మహాబలశాలి యగు భీష్ముఁ డుదాసీనుఁ డగుటయుఁ దటస్థించునే? కాని. గతమును గుఱించి వగచిన లాభ మేమిటి? జరుగవలసిన దానిని గదా యాలోచింపవలయును? భీష్ముని యశ్రద్ధయే ఇట్లగుటకు మూలకారణ మగుటచే నాతని మందలించెదను."

అని తలంచుచుండిన సుయోధనుఁడు శాంతనవుని చెంత కరిగి;

సుయోధనః—గంగాతనూజా! ముల్లోకములు లొక్కటియై వచ్చి నినుఁ దాఁకినను నీవొక్కఁడవే పోరి వాని జయింపఁ గలుగుదువు. అట్టివాఁడవు; నేను శత్రుశరముల తాఁకున మూర్ఛిలినపుడు నన్ను జూచుకొనక యుపేక్షించుట చూడ నాశ్చర్యముగా నున్నది. అక్కటా! "నేను పాండవ పక్షపాతిని. వారితో రణ మొనర్పఁజాల" నని నాఁడే చెప్పియుండ

రాదా! అప్పుడు నాకుఁ దోఁచిన లాగున నే నాచరించి యుందును గదా!

భీష్మ:—కౌరవనాథా! పాండవుల పరాక్రమము నీకుఁ దెలియనిది కాదు. వారల జయించుట సులభసాధ్యమని తలఁచితివా? ఎంతయుఁ గష్టపడినఁగాని జయము గలుగఁ జాలదు. అది యటుండనిమ్ము. నే నిపుడే రణరంగమున కరుగుదును. నా యోపినంత పట్టున పాండవుల జయింపఁ బూనెదను. భీతుఁడవు గాకుము.

అని యాడినంత సుయోధనుని మనస్సించుక శాంతి నందెను. సేనలఁ బురికొల్పెను. శంఖధ్వానము గావించెను. భీష్మునితోఁ గూడి మరల రణరంగమున కరిగెను. శాంతనవుఁడు శత్రుసేనల హతము గావించుచుండెను. సుయోధనుఁడు తిరుగ భీము నెదురింప సమకట్టెను. తన వాఁడి నారసముల నాతని నొప్పింప సాగెను. వృకోదరుఁడు నిజశరముల సుయోధనుని వక్షమున నాటులాగున నేసెను. ఆతని సారథిపై బాణవర్షము గురిపించెను. కురుపతియుఁ గుపితుఁడై భీమసేనుని సారథిని బాణముల నొప్పించెను. ఒక శరమున నతనివిల్లు ద్రుంచెను. పవనతనయుఁ డంత వేఱొక విల్లుపూని గాంధారీసుతుని శరాసనము దునిమెను. రాజరాజు వేఱొక ధనువు నెత్తుకొని భీమునిపై బాణములు వేయ సాగెను. అతఁడు వాని మార్గమధ్యమునన ఖండించెను. ఆలాగునఁ దన బాణములు రిత్తలైపోవుట కాగ్రహము నొందిన సుయోధనుఁడు మరలఁ గొన్నిటి నేసెను. భీముఁడు వానిని

గూడ నాలాగుననే త్రుంచివైచెను. అంత మండిపడుచుఁ గౌరవనాథుఁడు రెండు వాఁడియమ్ముల భీముని లలాటమును, నాల్గింట భుజములను, యెనిమిదింట వాని వక్షమును గాడ నాట నేసెను. వీని తాఁకున కోర్వలేక భీమసేనుఁడు సొమ్మసిలి రథముపైఁ బడెను.

ఇదిగాంచిన ద్రౌపదేయులు నభిమన్యుఁడు నొక్కుమ్మడి సుయోధనునిపైఁ బడిరి. రారాజు వెనుదీయక వారితోఁ బోరుచుండెను. ఇంతలోన సేదదేఱిన భీముఁడు సుయోధనునితో యుద్ధముసేయురాఁగ శల్యుఁడాతని మార్కొనెను. పావని నిజబాణముల మద్రేశ్వరుని నొప్పించెను. అతని శరనిహతి తాఁగలేక శల్యుఁడించుక తొలఁగి చనెను. ఆ సమయమున దుశ్శాసనాదులువచ్చి భీము నెదిరించిరి. సుయోధనుఁడు పాండవేయులఁ దనబాణముల సొమ్మసిలఁ జేసి తన సోదరులకుఁ దోడ్పడ నరుదెంచెను. భీముఁడంతలోన సేనాపతిశిరము ద్రుంచి, జలసంధుని సంహరించి, సుషేణుని మూర్ఛాక్రాంతుని గావించెను. దుశ్శాసనాదుల బాణవర్షమున నొప్పించెను. భీముని యీ చేతలెంతయు నాగ్రహించిన సుయోధనుఁ డాతని వీక్షించి;

సుయోధన:— బలహీనుల నల్వురఁ జంపుటచే బలవంతుడవైన లాగునఁ దలఁచి గర్వించకుము. లావుగల వాఁడెప్పుడు సమానులతోడనే పోరును. కుఱ్ఱవాండ్ర దుశ్శాసనాదుల నొప్పించుట యొక గొప్పకాదు. దయదలఁచి నిన్నింతకుమున్ను విడుచుటచేఁ గ్రొవ్వితివి. మాటల నా

యెదుటఁబడితివి. ఇంకఁ దప్పించుకొని పోఁజాలవు నీవు నేఁటితోడఁ గాలము తీఱెను.

భీమః:—కూటలచేఁ బోటరివిగాకుము. నీ వాదినుండియు నా మరణమునకై ప్రయత్నించుచున్నావుగా! నీయత్న మేమి కొనసాగెను? ఇది రణరంగముగాని ద్యూత గృహము గాదు. ఇచ్చటఁ బరాక్రమము చూపవలయునుగాని శకునిమామలవలెఁ గపటము లాచరింప వీలుగాదు.

సుయోధనః:—ఓహో! భీమసేనులవారు నేఁడు ధానుష్క శ్రేష్ఠులగుచున్నారు. కాఁబోలు! నాబాణముల తాఁకు దప్పించుకొని బ్రదికిన నావలెఁ జూచుకొందము.

భీమసేనః:—బాణములు వైచిన పిమ్మటఁగదా తప్పించుకొనుమాట. ఇదె నాశరము నీశరము దునుమ నేతెంచుచున్నది. దానిబారిఁ బడక తప్పించుకొనుము.

అని రెండు బాణములు సుయోధనుని హస్తములకు సూటిగాఁ బ్రయోగించెను. రాజరాజు వాని నర్ధచంద్రాకృతిఁగల రెండు బాణములచేఁ ద్రుంచెను భీముఁడా తరుణమునఁ బాండవసేనల నుత్సహపఱచుచు సుయోధనుని సమీపించుచుండెను అతని గర్జారవమును విని తమసేనలు చెదరి పోవుట చూచి భీమసేనుఁడించుక కలఁత నొందెను. చెదరియున్న సైన్యము మఱలఁ బురికొల్పుట కతఁడుపక్రమించెను అప్పుడు సుయోధనుఁ డాతని వక్షమున రెండు బాణములు వేసెను. సుయోధన శరాఘాతమున భీముఁ డొక్కింత చలించెను. ఇంతలోన ఘటోత్కచుఁడు మాయాబలమునఁ

గౌరవ సేనలపై విజృంభించుచుండెను. సూర్యుఁడస్తగతుఁడగుటచే ఇరువాగుల వారును నాఁటియుద్ధమాపి తమతమ స్కంధావారములకరిగిరి.

సైంధవ వధ

శిఖండి తనపైఁ గవియుటచే భీష్ముఁడస్త్రన్యాసము గావించి శరతల్పగతుఁడయ్యెను. సుయోధనుఁడు వెంటనే ద్రోణాచార్యుల సేనాపతిఁ గావించెను. ఆచార్యుఁడు దన్నాలాగున గారవించి నందులకు సంతసించి సుయోధనుని వరము వేఁడుకొమ్మనెను. రారాజు ధర్మసుతుని కాయము గాయము గాకుండఁ బట్టి యిమ్మని వేఁడెను. ఇదివిని ద్రోణుఁ డాశ్చర్య పరవశుఁడై;

ద్రోణ:—శిష్యశ్రేష్ఠా! అజాతశత్రుఁడను నామము యీతని కిప్పుడు సార్థక మయ్యెను. ఆహా! శత్రువునకును దనపైఁ గనికరము గల్గింపఁ జేయునట్టి సద్గుణములు గల యాతని జన్మము ధన్యతమము. వానిఁబట్టి తెచ్చినంతనే రాజ్యభాగ మీఁదలఁచి యిట్లాడుచుంటివా? రక్తపాత మెక్కుడగుచున్నదిగదా యని మృదుహృదయుఁడ వయితివా?

సుయోధన:—యుద్ధమున రక్తపాత మవశ్యమగు ననుట నాకుఁ దెలియును. రుధిరపాతమువలె నంగీకరించు

వాఁడను గాను. నాకొఱకు బాంధవు లనేకులు మరణించుట యుక్తము కాదనుట నే నెఱుఁగుదును. కాఁబట్టి సంధి కోరఁ బడినచో నైదూళ్ళు నిచ్చి తీఱవలయును. రాజ్యార్హత లేని వారికి ఆ మాత్రమైన నిచ్చుట నీతి గర్హితము. న్యాయవిదూరమగు కార్యము నేను నిచ్చగింపనివాఁడ నగుటచే సంధి కంగీకరింపకుంటిని. యుద్ధమున కొప్పుకొని నచోఁ బాండవులు రణరంగమునకు రాఁగలరు. అప్పుడు ధర్మజునిఁ బట్టికొనివచ్చి, జూదమాడించి యోడించి, మఱల వరణ్యమునకుఁ బంపవచ్చును. ధర్మసుతుఁడు ద్యూతప్రియుఁ డగుటచే ఇది సులభసాధ్యము. నేనిది తెలిసియే యుద్ధము సేయ నంగీకరించితిని. రాజనీతి పెక్కుదెఱఁగు లగుటచే నిక్కార్యము న్యాయబద్ధము. కావున దేవరవారు నాకోర్కెని గొనసాగింపవలయును.

ఇది వినిన ద్రోణాచార్యుఁ డిట్లు పలుకఁదొడఁగెను.

“సుయోధనుఁ డాడినలాగున నొప్పుట యక్రమముగనే తోఁచుచున్నది. అన్యాయమునకుఁ బూనుకొనినఁ బాపమునకు గతి కావలయును గదా? అట్లని యూరకుందమనిన రాజాజ్ఞను మీఱుటయుఁ, గోరిన వరమిత్తునని మాట చెప్పి తప్పుటయు నను రెండు దోషములకు గతి కాదే? ఇంతకు నీవని క్రమమగున దేల కాఁగూడదు? ‘రాజనీతి పెక్కుదెఱఁగు లగుటచే నిక్కార్యము న్యాయబద్ధ’ మని యూరకఁ డాడుచున్నాఁడుగదా! ఆయుధ మెత్తనని చెప్పిన కృష్ణుఁడు చక్రమెత్తినదియు, శిఖండిని మున్నిడుకొని యర్జునుఁడు

భీష్ము నస్త్రసన్యస్తుని గావించినదియు నిట్టి తరగతి లోనిదే కదా! అవియెల్ల న్యాయసమ్మతము లయినచో ఇదిమాత్రమేల కాఁజాలదు;"

అని యిట్లు కొంతవడి వితర్కించుచుండి యావల సుయోధనునిఁ గాంచి ;

ద్రోణః—సుయోధనా! నీకోర్కె కొనసాగించుటకు సిద్ధుఁడనుగాని అందుల కొక యాటంకము కలదు. అర్జునుఁడు సర్వాస్త్రవేది. అతని గెల్చుట అసాధ్యము. అతఁ డెప్పుడును అన్నను వీడక యున్నాఁడు. కాఁబట్టి అతఁడు లేని సమయ మబ్బినచోఁ బాండవాగ్రజునిఁ బట్టి యీయఁగలను.

సుయోధనుఁ డీమాటలు విని సంశప్తకులకు 'అర్జునుని రణమునకుఁ జీరవలయున' దని వర్తమానమంపెను. వారా లాగునఁ గావించిరి. సంశప్తకాహూతుఁడయి ధర్మజానుమతిని పార్థుఁడు వారితో యుద్ధముసేయ నరిగెను. ద్రోణుఁడు పాండవసైనికులతో ఘోరముగఁ బోరు నలుపుచుండెను. ఆసమయమునఁ గౌరవులు పద్మవ్యూహము గావించిరి. అందుఁ జొచ్చుట అభిమన్యునకుఁ దక్కఁ దక్కినవారికిఁ దెలియదు. కాఁబట్టి యాతఁడందుఁ బ్రవేశింప నరిగెను. అతనివెంటఁ బాండవు లావ్యూహమునకుఁ బ్రవేశింపఁ బోవుచుండ సైంధవుఁడు వారిదారి కడ్డుపడియెను. ఈశ్వరదత్త వరమహిమచే వాని జయింపఁ బాండవులకు సాధ్యము గాదయ్యెను. లోనఁ జొచ్చిన యభిమన్యుఁ డస్రవర్షము

ముతో యుద్ధము సేయుచుండఁ బెక్కు రొక్కపై వానిని దాఁకి తుదముట్టించిరి.

సంశప్తకుల సంహరించివచ్చిన పార్థునకు వార్త దెలిసెను. తనకుమారుని మరణమునకు సైంధవుఁడే ముఖ్య కారణమని తెలిసి వానిఁ జంప శపథముగావించెను. ఇది వినిన సుయోధనుఁడు ద్రోణుని సమీపించి ;

సుయోధన:—ఆచార్యా! అర్జునుఁడు చెంతలేకున్న ధర్మరాజును బట్టెదనని యానతిచ్చి యుంటిరి. దీనికొరకే కదా సంశప్తకులకు వర్థమానముంచి అర్జునుని వారియొద్దకు రప్పించుకొనులాగున నొనర్చితిని! అదివమ్మయ్యెను. అర్జునుఁ డెంత విజృంభించినను వాని జోలికిఁ బోకున్నారు. మీరు పాండవ పక్షపాతులు. అర్జునునకు మేలుగూర్ప నెంచువారు. తెలిసి తెలిసిమిమ్ము విశ్వసించినది నాలోపమే యగును. తేనె పూసిన కత్తివలెనుండుట తెలియక ఇంతకుఁ దెచ్చుకొంటిని. అదె సైంధవునిఁ జంప నర్జునుఁ డరుగుచున్నాఁడు. మీ ప్రభావము చూపనిదియే కదా తగునాయము? మిమ్మెలాగునఁ దూలనాడితినని యన్యథా తలఁపకుఁడు. ప్రసన్నులరై యున్నారలని మీకలుక పుట్టించినఁగాని కార్యము కొనసాగదని యీలాగునఁ బలికితిని; కాఁబట్టి నను క్షమించి, నాయందనుగ్రహముంచి, వెంటనే సైంధవుని రక్షింపఁ బూనుఁడు.

ద్రోణ:—రారాజ! నీమాటకును మాయశ్వత్థామ మాటకును నే భేద మెంచువాఁడను గాను. సేనాముఖమును వీడి నే నర్జునుని వెనుకఁబోయినఁ బాండవ బలము మన

సైన్యముపైఁ గవియును. అప్పుడు మన సేన చెల్లాచెదరగును. కి
సైంధవుని రక్షించుట యతికష్టము. ధర్మసుతునిఁ బట్టుటకు
సమయమును వేచియుండవలసిన వాఁడనుగాఁ బట్టి నేను
గాండీవి నెదుట కరుగుట యనుచితము కాదు. అతఁడును నీవును
తుల్యబలులు. శంకింపక నీవాతని నెదుర్కొనుము. తగుసహాయ
మును గూర్చెదను. ఇచ్చట నాలసింపకుము. నే నొసఁగు
పట్టి యీకవచము ధరింపుము. దీనఁ బార్థుని శరములు నీ
శరీరమును దాఁకకుండును.

అని యొకకవచము నిచ్చెను. సుయోధనుఁడు గురువు
నానతి మీఱరాదని యెంచి ఆకవచము ధరించి సేనా పరి
వృతుండయి యర్జునుని నెదిరింప నేఁగెను. పార్థుని యెదుట
నిలువఁజాలక పర్వెత్తుచున్న తన సేనకు నుత్సాహము గల్పించుచు
వానిని సమీపించి ;

సుయోధనుఁడు:—అర్జునా! నీవొక మేటివైన లాగునఁ
దలఁచి నే లేనియెడల నెల్ల నరుగుచుండుటచేఁ బ్రదుకఁ గలిగి
తివి. ఇదె నే నెదురుపడితిని. ఇంక నీవాలాగునఁ దప్పించు
కొని పోవుటకు వీలులేదు. ఏదీ! నీశస్త్రవిద్యా కౌశలము
చూపుము.

అని యర్జునునిపై సుయోధనుఁడు మూఁడు వాఁడి
నారసముల నేసెను. నాలుగు బాణముల వాని గుఱ్ఱములపై
వైచెను. పదిశరములఁ గృష్ణుని యురమున వైచి యొకసాయక
మున నాతని చేతిలోని ముల్లుకోలఁ గూలనేసెను. పార్థుఁడు
పెక్కు బాణములు వైచెనుగాని అవియెల్ల నాతని కవచమును

దాఁకి తునిఁగి క్రిందఁబడుచుండెను. ఇది గాంచిన కృష్ణుఁ డాశ్చర్యమున;

కృష్ణః—అర్జునా! మున్నెన్నఁడు నీ బాణము లీలాగున వ్యర్థములుగా లేదు. పిడుగువలె శత్రువులదాఁకి యుద్ధము సేయు వాఁడవు నేఁడీ హీనుని యించుక నొప్పింపనైన సమర్థుఁడవు గాకపోవుట కడు వింతగ నున్నది.

అర్జునః— ఇతఁడు దొడుగుకొని యుండునట్టి కవచ ప్రభావ మట్టిది. ఆచార్య ననుగ్రహమున వీఁడీకవచమును బొందియున్నవాఁడు. ఇంద్రదత్తమగు నస్త్ర మొక్కటి నా యొద్ద నున్నది. అది సకలకవచ నిర్భేదనము. దాని మూలమున వీనిని గాయపఱతును.

అని యర్జునుఁ డొకయస్త్రము వైచెను. అశ్వత్థామ కాయస్త్ర మహిమ తెలియును గాఁబట్టి సర్వాస్త్రఘాతియగు నొక యస్త్రమున దానిని ఛేదించెను. అర్జునుఁడశ్వత్థామ యాచరించిన యా కార్యమునకుఁ దెల్లఁబోయియు ధైర్యము నవలంబించి వేఱొక యస్త్రము నెత్తఁ బోయెను? ఇంతలోన సుయోధనుఁ డర్జునునిపై బాణవర్షము గురిపించెను. కురు సేన లర్జునుని యీ పరాభవము గాంచి పెల్లుగ సింహనాదములు గావించెను. పార్థుఁడు మిక్కిలి కోపము చెంది సుయోధనుని రథసారథులఁ దునిమెను. విరథుఁడగు సుయోధనుఁ డించుక చింతింపుచుండగా అదియే తగు సమయమని భావించి పార్థుఁడు విజృంభించెను. వీని ధాటి కాఁగలేక కౌరవ సైన్యము నలుదిక్కులకుఁ బఱ్వలిడఁ జొచ్చెను. సుయోధనుఁడు వానిఁ

బుద్ధిగొల్పి మఱల సమరమునకు సన్నద్ధుఁడగు నంతలోన వృషసేనుఁడు మున్నగువా రరుదెంచి పార్థుని మార్కొనిరి. అర్జునుఁడు వారితోడ రణము సేయుచుండెను. సుయోధనుఁ డంతలోన వేఱొక రథమెక్కెను. నూతనాంబ రాభరణ ములఁ దాల్చెను. క్రొత్తకవచము ధరించెను. నవ్యశరాసన మును జేతఁ బూనెను. ఈలాగున యుద్ధసన్నద్ధుఁడై వచ్చుచు మఱల నాచార్యునిఁగాంచి సైంధవరక్షణార్థము దనకు సాయ పడమని వేఁడెను. ద్రోణుఁడు పూర్వమువలెఁ దాను సేనా ముఖమున నుండవలయు నని బదులాడుటచే ఖిన్నుఁడయి;

"ఆహా! ఆచార్యుఁ డర్జున పక్షపాతియయి మన కార్యమున నౌదాసీన్యము వహించుచున్నాఁడు. నేఁటితో దుశ్శలభర్త యాయువు దీఱెను గాఁబోలు! తన్ను గట్టఁద్రాళ్లు తానే తెచ్చుకొనులాగున ఎఱిఁగి యెఱిఁగి యీతని సేనా పతిఁ గావించుకొని యిట్టియాపదకు గురియయితిని. ఇఁకఁ జరించిన లాభమేమి."

అని తలపోయుచు సుయోధనుఁడు పార్థుని సమీపింప వచ్చుచుండెను. అప్పుడు యుధామన్యుఁడు, నుత్తమౌజుఁడు నర్జునునకుఁ దోడ్పడ వచ్చుచుండ వారల నెదిర్చెను. ఉత్తమౌ జుఁడు సుయోధనునిచాపము దునిమెను. రారాజు వేఱొక శరాసన మందుకొని వాని సారథిని, దురగములను దునిమెను. ఉత్తమౌజుఁడు యుధామన్యుని రథమెక్కెను. వారిరువురు రాజరాజ రథవాజులను, సారథిని సంహరించిరి. కౌరవేశ్వరుఁడు మద్రదేశాధీశుని రథమెక్కెను. ఇంతలోన

దుర్ముఖాదులు దనసోదరులు గొందఱు రణభూమిని నిహతులగుట దెలిసి విధిని దూఱుచు వేఱొక దెసకేఁగెను. అదియే యదనని భావించి యర్జునుఁడు సైంధవుఁడున్నెడకు వచ్చి వానిని సంహరించెను.

సంకులసమరము

"ఔరా! ఇంతకాలము సత్యవాది యని వాసిగాంచిన యజాతశత్రుఁ డిది యసత్యమనుట దెలిసియు "నశ్వత్థామాహత" యని బిగ్గఱగాఁ బలికె కుంజర యనుమాట యల్లన నాడెఁగా! భీమసేనుఁ డశ్వత్థామ హతుఁడయ్యెనని పలికిన నమ్మకుండిన యాచార్యుఁ డీతని మాటచేఁ గదా యస్త్రసన్న్యాసము గావించెను."

కాలము విపరీతమగునపుడెల్లరు నకారణ విరోధులగుట నిక్కము. అలాగునఁ గానిచో విశ్వామిత్రాదులకు నేనేమి యపకారము గావించితిని? వారికేల నాపై నిష్కారణద్వేషముదయింపవలయును? నాపై విరోధమునఁ గాకున్న వారేల యాచార్యుని సమీపించి యుద్ధమాడవలదని యుపదేశించి యుందురు? వారి మాటలును యుధిష్ఠిరుని యసత్యవాక్యములును గదా ఆచార్యుని మరణమునకుఁ గారణములు? ఆచార్యుఁడు మరణించినంతనే జయము గలిగెనని ధర్మతనయుఁడు తలఁచెను గాఁబోలు! కర్ణుని సేనాధిపతిగా నొనర్చియున్నందున నతఁడు వీరిని సంహరించుననుట యెఱుఁగడు.

వివేకరహితుఁడగు నీ పాండవ జ్యేష్ఠుఁడు, యోగనిష్ఠ నున్న యాచార్యుని బాలిశుఁడగు ధృష్టద్యుమ్నుఁడు సంహరించుచుండ నూరకుండెనఁట. ఇదియా యాతని ధర్మజ్ఞత! ధర్మరాజని పేరిడుకొని తృణాచ్ఛన్నకూపమై ఇట్లొండఱవంచింప నెంచియున్న వాఁడో కదా? ఇట్టివాని నింక నూరక విడుచుట పాడిగాదు. ఇదే నేనరిగి యాతని ప్రాణములఁ గొనెదను.”

అని ఈలాగునఁ దలపోయుచుండిన సుయోధనుఁడు రథమెక్కి రణరంగమునకు వచ్చెను. వచ్చినవాఁడు వేఱెవ్వని యొద్దకుఁ బోవక తిన్నఁగా ధర్మసుతుని చెంతకే యరిగెను. ధర్మజు, నాతని సారథిని శరాహతిచే నొప్పించెను. యుధిష్ఠిరుఁడు సుయోధనుని హయ సారథుల సంహరించెను.

అంత నారథము నుండి క్రిందికిదూఁకి పదాతియై సుయోధనుఁడు వెనుదీయక ధర్మజుని శరీరమున నాటులాగునఁ గొన్ని బాణములు వైచెను. రాజరాజ బాణహతిని నొచ్చిన ధర్మతనయుఁ డాగ్రహించి ఆతని వింటిని దునిమెను. ఖడ్గహస్తుఁడై యాతఁడు ధర్మజునిరథముపై కుఱుక నుంకించుచుండ నాతని చేతి కత్తిని రెండర్ధచంద్ర బాణములచేఁ దునియలు గావించెను. నాలుగుశరముఁ నాతని యురమున నాటనేసెను. యుధిష్ఠిరబాణ పాతమున విహ్వలుఁడగు సుయోధనునిఁ గాంచి దవ్వులనుండిన కర్ణాదు లచ్చటి కరుదెంచిరి. వీరిటు వచ్చుట గాంచుచుండిన భీమసేనాదులు ధర్మజునకుఁ దోడ్పడ నచ్చటికి వచ్చిరి. అంత నుభయసేనలకును సంకుల యుద్ధము జరిగెను.

ఇంతలోన వేఱొక రథమెక్కి మరల నచ్చటికి వచ్చిన సుయోధనుఁడు ధర్మసుతుని చేతి వింటిని దన శరములచేఁ దునిమెను. అతఁడు వేఱొక ధనువుఁ బూని ధార్తరాష్ట్రుని శరాసనమును ద్రుంచెను. కురుపతి వేఱొక చాపమును బూని ధర్మజుని శరీరమున నాటులాగున వాఁడియమ్ములఁ గొన్నిటి నేసెను. ధర్మరాజు కౌరవనాథునిపైఁ గొన్ని బాణములు ప్రయోగించి వానిని నొప్పించెను. సుయోధనుఁ డొక శక్తిని వైచెను. అజాతశత్రువు మార్గమధ్యముననే దానిని దునిమెను. ఇదిగాంచి కోపించిన కురుజ్యేష్ఠుఁడు కొన్ని బాణములేసి ధర్మరాజును నొప్పించెను. ధర్మసూతియు వెయ్యంజ వేయుక నిశ్చలుఁడై శత్రుబాణహతి కోర్చుచు మఱల సుయోధనునిపై బాణవర్షము గురిపించెను. గాంధారీతనయుఁ డాశరముల తాఁకున మూర్ఛిల్లెను.

ఈ లాగున సుయోధనుఁడు మోహావరవశుఁ డగుట చూచి కృతవర్మ ధర్మపుత్త్రునితో యుద్ధము సేయ నరుదెంచెను. అప్పుడు భీముఁ డాతని నెదిరించెను. వీ రిటు రణ మొనర్చుచుండ నింతలో సుయోధనుఁడు మూర్ఛఁ దేఱెను. మఱల ధర్మరాజుపైఁ గవియ నరుగుచుండ నర్జునుఁ డీతని కడ్డుపడెను. క్రోధావిష్టుఁడగు సుయోధనుఁ డాతని బెక్కుబాణముల నొప్పించెను. పార్థుఁడు గాంధారీతనూజుని సూతుని,రథాశ్వములను,ధ్వజమును, ధనువును ఏడేసి బాణములచేఁ దునిమెను. ప్రాణాంతకమగు నొక బాణమును బ్రయోగించెను. అప్పుడు సుయోధనునకు సహాయపడఁ గృపుఁడును

అశ్వత్థామయు నరుదెంచె. అశ్వత్థామ యుజ్జుఁజేసిన యా బాణమును మార్గ మధ్యముననే తన శరములచేఁ ద్రుంచెను. కృపుఁడు పార్థునిపైఁ గొన్ని బాణములు వైచెను. కిరీటియుఁ గృపుని విల్లు రెండు తునియలు గావించెను. కృతవర్మ రాఁగ నాతని నొప్పించెను. దుశ్శాసనుని విల్లు దునిమెను. కర్ణునితో యుద్ధముసేయ నెంచి యటు వెడలెను. ఇట్లా నాఁడంతయు సంకులసమర మతిభీకరమై జరుగుచుండెను.

గదా యుద్ధము

"సుయోధన రాజేంద్రా! ఏల ఈ లాగున మడుగునఁ దాఁగవలయును? కర్ణశల్యులు, సోదరులును జావఁగనే మేమును జచ్చితిమని తలఁచితివే?"

"కృపాచార్యా! ఆచార్యపుత్త్రా! ఎన్నఁడును నేను నీచకృత్యములకుఁ గడఁగువాఁడను గానమాట మీరెఱుఁగనిది కాదు. సోదర బాంధవ మరణమున నోడలెఱుఁగక యుద్ధము చేసితిని. నాశరీర మస్త్రముల గాయముల నొచ్చెను అలసిక మెండయ్యెను. దప్పి యతిశయించెను. మనసు వసముతప్పి యుండెను. ఇంచుక విశ్రమించినఁగాని యరులతోఁ బోరఁ జాలక ఈ మడుగుఁ జొచ్చితిని. పాండవుల యాగ్రహ మప్పటప్పటికి అతిశయించుచుండుట కర్ణవధ మూలమున మీకు విదితపూర్వమే. ఆ క్రూరులు శత్రువు చిక్కెనని చప్పున

సంహరించువారు కాని యిదియు సమయమని యించుక యోచ్చు
వారు గారు. ఇది తెలిసి యూరక వారిచేఁ బడి చచ్చుట
కంటె నేఁడించుక విశ్రమించిన రేపవగతశ్రముండ నగు
దును. అప్పుడు వారి నవలీలంగా వధింపఁ గలుగును.
ఈ యుద్దేశముతోడనే నే నీహ్రదమునఁ బ్రవేశించితినిగాని
శత్రువులవలని భీతిచే బాఱివచ్చి దాఁగిన వాఁడను గాను. మీ
గొంతు సవ్వడివిన్న మీరును మిక్కిలి డస్సి యుండుట దెలియు
చున్నది. కాఁబట్టి మీరును గొంచెము విశ్రమింపుఁడు."

సుయోధనుని యావాక్యము లాలించి కృపాశ్వత్థా
మలు మఱలివచ్చుచు నీలాగున సంభాషించుచుండిరి.

"మామా? చూచితివే విధి విలసితము! న్యాయ
వర్తనుల కిడుములు గల్పించుచు నక్రమవర్తనుల కభివృద్ధి
నొసఁగుచుండు నాదేవు నేమనవలయును? లోకము వారును
న్యాయాన్యాయ పరిశీలనాజ్ఞానము లేక పైవేసములఁ జూచి
మోసపోవుచుందురు. పాండవులాచరించిన న్యాయసమ్మత
ములౌ యాటల యూహింపక వారి పైవేసములఁ జూచి వంచి
తులై కౌరవులక్రమ ప్రవర్తనులని యాడుచుందురు. విష
ప్రయోగాదుల మూలమున వీరు భీమునిఁ జావ నెంచిరని
యూరక దూఱుదురు కాని వృకోదరుఁడు మాన భంగము
గావించుచు వీరికిఁ బెక్కుకష్టములఁ గలిగించెనని యెవ్వరేఁ
జెప్పఁ గలిగిరే? సుయోధనుఁడు పాలింప వలసినది న్యాయ
ముగా నుండ నాఁడు యుధిష్ఠిరుఁడు యువరాజగుట యక్రమ
మగునని యెవ్వరైన నాడిరే? రాజసూయ యాగసమయమున

ద్రౌపదీ వృకోదరులు రాజరాజును బరిహసించిన దక్రమ
మునకు వీరికి మూర్ఖత్వము గలిగెను. జూదరియయి పాండ
వాగ్రజుఁడు శకునితో జూదమాడి దైవవశమున నోడిన నందు
లకు సుయోధనునిఁ గారకునిఁగాఁ జేసి వృథా దూషణ సల్పు
టకు మాత్రము వీరికి నోరు గలిగెను."

"అబ్బాయీ! నీ మాటలెల్ల వాస్తవ మగునదియే. సుయోధనాదులు మాయాదురోదరమున గెలుపొంది పాండవులఁ గానలపాలు గావించిరని పక్షపాతులయి పల్కెదరు గాని పాండవ పక్షములోని వంచనలెల్ల తెలిసికొన కున్నారు? యుద్ధమునకుఁ దోడ్పాటుకోర రారాజు ద్వారవతి కరిగినపుడు కృష్ణుఁడు నారాయణ గోపాలుర నిచ్చి సరిపెట్టఁ బంపినది వంచన కాదు కాబోలు? శల్యునితో ధర్మతనయుఁడు "నీవు కర్ణార్జునుల యుద్ధసమయమునఁ గర్ణునకు సారథివై యాతనిఁ దూలనాడి యుద్ధమువలని యుత్సాహముఁ గావింపు" మని వేఁడుకొనిన దన్యాయము కాదేమో? యుధిష్ఠిరుఁడు రహస్యముగ భీష్ముని చెంతఁ జేరి యాతని వధోపాయ మడిగినది యక్రమము కాదేమో? అసత్యములాడి యాచార్యు నస్త్రసన్న్యస్తుని గావించినది సజ్జన సమ్మతమా కాఁబోలు? సైంధవవధనాఁడు మాయాతిమిరమును గల్పించి సూర్యునిఁ గప్పుడకుండఁ జేసిన యాకృష్ణుని చేఁత నీతిబాహ్యము కాదే? ఇట్టి యక్రమము లెన్నియో వారాచరించిరి. జనుల కవి యన్యాయములని తోఁచకున్నవి. మనవారాదినుండి న్యాయమార్గమున

నడుచుచున్నారు. దీని నక్రమమని వారాడెవరు. ఏమి సేయుదము? ఈకాలమున న్యాయమునకు స్థానము లేదు."

"మామా! ఇది ద్వాపరాంతము కాదా! న్యాయపక్షమునకెక్క డనుండి స్థానము కలుగును? ఇప్పుడు నేనొక విధమును దృష్టివఱుచుచున్నాను. ఎట్లన? మన సుయోధనుఁడాదినుంచి సర్వసౌఖ్యముల ననుభవించుచుండెను. కష్టమున్నదెఱుఁగఁడు. రాజరాజ బిరుదాంకితుఁడై ఏకచ్ఛత్రాధిపత్యమున నీభూమండలమును బరిపాలించెను. విధేయులగు సోదరులతోడను, నాయట్టి హితులతోడను గూడి సర్వదా సంతుష్టుఁడయి యొప్పుచుండెను. వైష్ణవమును యజ్ఞముఁ జేసి ఖ్యాతిఁ గాంచెను. ఐహిక సౌఖ్యములలో నెతఁ డెద్దియుఁ గొఱవడక యనుభవించెను. ఇంక వారో; బాల్యమునందే తండ్రి చావఁగా దిక్కుమాలి దాయాదుల యింటఁ బెరుగుచుండిరి ఏకచక్రపురాదులయందు మాఱువేసము పూని బిచ్చమెత్తుకొని బ్రదుకుచుండిరి. పన్నెండు వత్సరము లరణ్యమున నుండి పడరానిపాట్లు పడిరి అజ్ఞాతవాసవత్సరమున విరటుని కొలువుకూటమున అతినీచమగు దాస్యవృత్తి నవలంబించి యుండిరి. ఎప్పుడు వీరు సుఖింపఁ గలిగిరి? ఒకవేళ యుద్ధమున సుయోధనుని సంహరించి రాజ్యమును బడసినను బంధువులెల్లరు చచ్చుటచే ఆవ్యసనవుఁ గూడ దక్క వీరనుభవింపఁ బోవునదెద్ది. ఇట్టి యనుభవముకంటెఁ జచ్చుట మేలుకదా? ఇదియే ఈయుభయులలోని క్రమాక్రమముల వెల్లడిసేయుచున్నది. ఇంకనజ్ఞానమున లోకమేలాగున నాడిన నేమి?"

అని ఈలాగున సంభాషించుచుఁ గృపాశ్వత్థామలు వెడలిరి. ధర్మతనయుఁడు; సుయోధనుని వెనుకట కేఁగిన వేఁటగాండ్ర మూలమున రారాజు ద్వైపాయన హ్రదమున నుండుట యెఱిఁగి సోదరసహితుఁడై కృష్ణునితోడ నాయుధుంగు నొద్దకరుదెంచి:

"సుయోధనా! ఇదియా పోటరియగు వాఁడాచరింప వలసినది! చుట్టములు చచ్చిరి. సోదరులు హతులైరి. నీవొక్కఁడవు మాత్రము జీవించి యేమిచేసెదవు? నీట దాఁగి నంతనే చావు దప్పునే? ఇదియా రాజరాజ బిరుదాంకితునకు లక్షణము? అభిమానధనుఁడని పేరువీఁగుచుండుట కిది గుఱుతు గాఁబోలు? వెంటనే యుద్ధమునకు రమ్ము. లెమ్ము. రణనిహతుఁడవైన వీరస్వర్గము నందఁగలవు. జయించిన నిస్సపత్నమగు రాజ్యమును బొందఁగలవు. కాఁబట్టి ఇకనైనను ఈ నీచకృత్యము వదిలి హ్రదమునుండి వెలువడుము."

"ధర్మపుత్రా! నేనెన్నఁడును రణము వలనఁగాని, మరణము వలనఁగాని భీతుఁడను గానని యెఱుఁగుదువు. యుద్ధమున నలసి, సేదఁదేఱ నిచ్చటికి వచ్చితిని. మీరును ఇన్ని దినములుగా జరిగిన రణమువలన డస్సియున్నారు. కాఁబట్టి ఈదిన మించుక విశ్రాంతి నందుఁడు. రేపు యుద్ధము సేయుదము."

"ఇంతదాఁక నీవు గానుపింపమిని యుద్ధము లేకుండెను. కాఁబట్టి మేము సేద దేఱితిమి. నీవింతకాలము హ్రదమున

విశ్రాంతుఁడవైనది చాలును. ఇంక వెలువడుము. లెమ్ము. నీట దాఁగినంతనే రాజ్యము దక్కఁబోదు"

"నే రాజ్యలుబ్ధుఁడననియా తలఁచితివి? దాతలలోఁ బ్రథమగణ్యుఁడగు కర్ణునకుఁ జెలిని. దానవీరుఁడని ప్రసిద్ధిఁ బడసిన వాఁడను నాయెడ లోభము లేదు. నిక్కముగ నీ కట్టి సంశయమే యుండిన నా రాజ్యమెల్ల నీకు దానము చేసెదను. గ్రహింపుము."

"ఓయీ! రాజులకుఁ దమ పరాక్రమమువలనఁ బడసినది కీర్తిదాయకము. కాఁబట్టి నీదానము నాకేల? శత్రుసంహార మొనర్చి జయలక్ష్మితోఁడ రాజ్యలక్ష్మినిఁ గైకొనుటుచితము."

"ధర్మతనయా! నేను ప్రాణములపైఁ గల తీపిచే నీలాగున నాడితిననియా తలఁచుచున్నావు? లుబ్ధుఁడను గానను నిదర్శన పూర్వకముగాఁ జూపవలయునను నుద్దేశముతో నాలాగునఁ బల్కితిని."

సుయోధనా! మాటలతోఁ బ్రొద్దుపుచ్చుచుండుట శ్లాఘ్యము గాదు. ఎదుటివాఁడు పిలిచినంతనే యుద్ధమునకు వచ్చుటఁగదా పరాక్రమవంతుని లక్షణము?"

"సరి. అట్లే వచ్చుచున్నాను. ఇదివఱలో రథారూఢులమై చాపములు గొని పెక్కుతడవలు యుద్ధమొనర్చియుంటిమి. ఇప్పుడు పాదచారులమై గదఁగొని రణము సల్పనెంచుచున్నాను. మీరిందులకు సంసిద్ధులు గండు.

"ఆలాగుననే కానిమ్ము. ముందు నీటినుంటి వెలువడుము."

ఈ మాట లాలకించిన సుయోధనుఁడు ద్వైపాయన హ్రదమునుండి వెలికి నిర్గమించెను. గదాధరుఁడగు నాతని యప్పటి యాకారము కల్పాంతమునందలి యంతకుని రీతి పరిభయంకరమై యుండెను. ధర్మసుతుఁడంత సుయోధనునిఁ గాంచి;

“ఓయీ! మా యేవురిలో నీకిష్టమగు వాని నొకనిఁ గోరుకొనుము. వాఁడే నీతో యుద్ధమునకుఁ గడంగును. వాఁడు మరణించెనేని నీవు జయమందిన లాగున నగును. అంత రాజ్యము నీవ యేలుకొనవచ్చును. నీవు మృతుఁడవయిన రాజ్యము మా యధీన మగును ఇది మా సమయము.”

యుధిష్ఠిరుని యీమాటలు విని కృష్ణుఁ డదిరిపడి యాతనిఁ గాంచి;

“ధర్మజా! ఇదేటిమాట? ఈతఁడు గదాయుద్ధమున నతి నిపుణుఁడు. భీమసేనుఁడును గదాయుద్ధమునఁ గడునేర్పరి. కాఁబట్టి వీరిరువురకు యుద్ధము జరుగుట న్యాయమగును గాని గదాయుద్ధ చతురులుగాని లెక్కనవారి నీతఁడు కోరుకొనుటకు మన మంగీకరించుట సరికాదు.”

సుయోధనుఁడు కృష్ణుని పలుకులు విని సంతుష్టుఁడాయెను. అతనికి ఆదినుండి భీమునిపైఁ గదా విరోధము ఇప్పటి కృష్ణుని మాటలు తన పగ దీర్చుకొనుట కనుకూలమగునవి యని తలఁచి భీమునిఁ జూచి;

“వాయునందనా! కృష్ణుఁడాడిన లాగున నీవ నాకుఁ దగినవాఁడవు. “వివాహశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే”

యనుట నిక్కము. కాఁబట్టి నీవు నాతో గదాయుద్ధమునకుఁ గడఁగుము. బాల్యమునుండి నీవు మాకుఁ గావించుచుండిన యపకృతులకుఁ దగు ఫలమిప్పుడ యనుభవింపఁ గలవు."

అంత భీమ సుయోధను లొండొరులతో యుద్ధము సేయ నంగీకరించిరి ఆతరుణమునఁ దీర్థయాత్రాపరుఁడయి యేఁగియుండిన బలరాముఁ డచ్చోటికి వచ్చెను. అచ్చటివార లాతని గౌరవించిరి. బలుఁడు తన సల్పిన తీర్థయాత్ర వివరించి; భీమ సుయోధనులకు గదాయుద్ధము జరుగఁబోవుట విని చూడవచ్చితి ననెను. ఆపల నచ్చటి వారెల్లరు రణరంగమున కరుదెంచిరి. భీమ సుయోధనుల గదాయుద్ధ మారంభ మయ్యెను. వా రొండొరుల మీఁదఁ జూచుచుండిరి. మండల ప్రచారముల యుద్ధమాచరించునపుడెల్ల నొకఁ డొకవైపున కరిగిన ఎదుటివాఁ డాతనికి ఎదుటివైపున కరుగును. శత్రువు తనవైపునకుఁ జరిగినచో ఇతరుఁడు వేఱొక వలనికే జరుగు చుండును. ఒక్కొక సమయముల నెదుటివాఁడు సవ్యముగఁ బోయినఁ దా నపసవ్యముగఁ బోవలాగున నటించుచుఁ జప్పున నాతని కెదురేఁగును.

ఈ లాగునఁ బెక్కు గతిభేదముల భీమ సుయోధనులు దిరుగుచు, నొకరి గదాఘాతము నింకొకరు దప్పించుకొనుచు, యుద్ధము సేయుచుండిరి. జయ మేవైపునకుఁ గలుగునదియును దెలియకుండెను. భీముఁడు బలాధికుఁడు. సుయోధనుఁడు గదాయుద్ధమునఁ జక్కఁగ గురుశిక్ష పొందినవాఁడు. ఈ కారణమున వారొండొరుల జయింప లేకుండిరి. తగిన పాత్ర ముబ్బెఁ

గదాయని భీముఁడును, గదావిద్యాభ్యాసమునకుఁ దగు లక్ష్యము చిక్కెఁ గదాయని సుయోధనుఁడును నుత్సాహపూరితులై యుద్ధము సేయసాగిరి.

ఇట్లు కొంతవడి యుద్ధము సేయుచుండ శిక్షావిశేష రాహిత్యమున భీముఁడించుక వెనుదీయవలసి వచ్చుచుండెను. సుయోధనుఁడు శిక్షాశయముతోఁ బాటు గురువును సమీపమున నుండుటచే మేలుబంతి యనిపించుకొను లాగున గోచరించెను. ఈసూక్ష్మమును గని పెట్టిన కృష్ణుఁ డర్జునునిఁ గాంచి;

“భీముఁడు నాఁడు సభలో సుయోధనుని తొడలు విఱుగఁ దన్నులాగునఁ జేసిన ప్రతిన మఱచెను గాఁబోలు! లేక గదాయుద్ధమున నాభికి దిగువయగు శరీర భాగములను నొప్పించుట యధర్మమని యూరకున్నవాఁడో? ఇట్టి నీచునెడలనా ధర్మాధర్మ విచారములు సేయుట! వీనికిఁ దొడలలో బలము తక్కువ. కాఁబట్టి యూరువులపై గదాహతి యొనర్చిన వీఁడు మరణింపఁ గలఁడు.”

అర్జునుఁ డిది విని భీమునకుఁ జూచులాగునఁ దన తొడలఁ జఱచుకొనెను. మారుతి యది గాంచి సుయోధనుని తొడల భంగముఁ గావింప నెంచెను. మఱల నది యధర్మమని వెనుదీయఁ జొచ్చెను. తుదకుఁ గృష్ణునానతి మీఱుట దగదని తలఁచి యూరుభంగము సేయఁ గృతనిశ్చయుఁ డాయెను. తన గద నెత్తి సుయోధనుని తొడలపై వైచెను. వెంటనే రాజరాజు తొడలు విఱిగి నేలఁ గూలెను. బలరాముఁ డీయక్రమ యుద్ధ

మును జూచి దౌర్బల్యవశమున కటకట పడెను. కృష్ణుఁడాతనిఁ గాంచి ;

"అన్నా ! భీముఁడు నాఁడు సభలో సుయోధనుని యూరువుల విఱుచుటకై ప్రతిజ్ఞ గావించి యుండెను. కాఁబట్టి తన శపథము నిర్వర్తించుకొనెను. అటు సేయనిచో నసత్యవాది యగును గదా ? మైత్రేయ మహాముని శాపము నీతనికిఁ గలదు. అది రిత్తవోవునే ?

కృష్ణుని యీపలుకులు బలరామునకు నచ్చకుండెను. తుదకాతఁడు పాండవులను, కృష్ణుని నిందించుచు ద్వారవతి కరిగెను. సుయోధనుఁడు గదాఘాతసంభూతవేదనాయత్తుఁడై కృష్ణునిఁగాంచి;

"ఓరీ ! కంసదాసపుత్త్రి ! నీవు ఆ యర్జునిలోఁ జెప్పి భీము నక్రమయుద్ధమునకుఁ బురికొల్పితివి గదా ! ఇది యేటి న్యాయము ? ఆహా ! ఈ భారతయుద్ధమెల్ల నీ యక్రమములతోడనే నిండి యున్నది. తొలుదొల్త శిఖండిని ముందిడుకొని యర్జునుఁడు శాంతనవునిఁ గూల్చ లాగొనర్చితివి. ధర్మజునిచే నసత్యము లాడించి యాచార్య శస్త్రసన్న్యాస మొనర్పలాగునఁ జేసితివి. అది చాలక వేద వేదాంగ తత్త్వజ్ఞానామహాత్ముని ధృష్టద్యుమ్నునిచేఁ జంపించితివి. రథము భూమిని క్రుంగియుండ నాయుదను గాంచి కర్ణునిఁ జంపించితివి. భూరిశ్రవుఁడన్యునితో యుద్ధ మొనర్చుచుండఁగాఁ జంపితివి. మాయాతిమిరమును గల్పించి సైంధవుని మృతికిఁ గారణుఁడ వైతివి. నేఁడిటు పార్థున కుపదేశించు నెపమున భీమునిచే నను

గూల్పించితివి. నాఁటినుండియు నీయక్రమ ప్రవర్తనములును, నీ సహవాసముచే నలవడిన వీరి యక్రమ కార్యములును గదా నన్నింతకుఁ దెచ్చెను?

ఓరీ! నీవు నన్నీలాగున భంగపఱిచినను నేననుభవించిన సౌఖ్యములోఁ బదియవ పాలైన వీరనుభవింపలేరు. సర్వబంధు నాశనముఁ గలిగిన యీదుఃఖపుఁ గూడుగదా వీరనుభవింపఁ బోవునది? పరలోకమునందేని అసత్యవాదియగు నీ ధర్మజునకు సుఖము గలుగదనుట నిక్కము. నేనింత కాలమిటు సుఖించితిని. యుద్ధమున మరణించుటచే నిఁక వీరస్వర్గ మనుభవింపఁ బోయెదను."

అంత పాండవులు సుయోధను నచ్చటనే విడిచి కౌరవ శిబిరముల వైపునఁ దిరిగిరి.

ఉపసంహారము

పాండవు లాలాగున వెడలిన పిమ్మట సుయోధనుఁడు మాత్ర మొంటరియయి నేలఁబడియుండెను. అప్పుడు సంజయుఁ డటకువచ్చెను. అతనిఁగాంచి సుయోధనుఁడు కన్నీరుగార్చుచు;

"సంజయా! కాలగతి యెట్టివారికి నలంఘ్యము. ఎట్టివాని కెట్టి దశ పట్టినదో చూచితివా? పదునొకం డక్షౌహిణులు గొలువ నెల్లరాజుల నాజ్ఞలో నిలుపుకొని యుండిన వాఁడను నేను నేఁడు దిక్కుమాలి యిటఁబడియున్న వాఁడను.

ఆ నీచులు పాండవులు అక్రమ యుద్ధమున నన్ను నేఁ గూల్చి సోదరప్రీతిని విడనాడి వెడలిరి. ఇఁక జావనున్న నాకు ఒంటరిగా నుంటినను భయము లేదు.

ఆర్యా! నీవు నా జనకులయొద్ద కరిగి వారి నాశ్వాసింపుము. నూర్గురు పుత్రుల శోకకాలములలోఁ జచ్చుట నిడు దుఃఖావహమే. అయినను దైవము నేంచిన దుఃఖించిన లాభము లేదని చెప్పుము. ఇంతకును జచ్చునంతకు సర్వ సౌఖ్యము లనుభవించుచుంటిని. అతి భయంకరుఁడనై ఏకచ్ఛత్రాధిపత్యమున ధరాచక్రమేలితిని. ఎల్ల బంధువులఁ జల్లఁగాఁ బ్రోచితిని. బీదల ధనవంతులుగాఁ జేసితిని. గొప్ప యజ్ఞముల నాచరించితిని. ఒక సమయమున నేనిఁక బరవారి నాశ్రయింపకుంటిని. మగటిమితోడ రాచఱిక మొనర్చితిని. నాకుఁ గలిగెడిచావు రణరంగమున నగుటచే వీరస్వర్గము నందఁగలవాఁడను. కాబట్టి నా యాత్మకు శాంతి కలుగులాగున బ్రాహ్మణులకు దానాదులఁ గావింపుము.

సంజయుఁ డాలాగుననే తెలిపెదనని వెడలెను. చేరువ పల్లెల నుండువారు కొందఱు సుయోధనుని గాంచ వచ్చిరి. వారికతఁ డచ్చటఁ జరిగిన యధర్మయుద్ధము వివరించెను. వారశ్వత్థామ కృపకృతవర్మలచ్చట సమీపముననే యుండుట యెఱిఁగి వారియొద్ద కరిగి సుయోధనుని భంగపాటు దెల్పిరి. వెంటనే ఆ మువ్వురును సుయోధనుఁడు పడియున్న ప్రదేశమునకు వచ్చిరి. ధూళిధూసరిత గాత్రుఁడయి పడియుండు

నారాజరాజును గాంచి విషాదకులు లయిరి. అశ్వత్థామ ఆస్థితియందుండు సుయోధనుని వీక్షించి;

అక్కటా! ఎల్లప్పుడు రాజలోకములు చుట్టి కొలుచు చుండ సింహాసన మలంకరించుచుండు వాఁడవా నేఁడీలాగున నొంటరివై నేలఁబడియున్నావు? లక్ష్మి చంచల యగుట నిక్కము. ఇట్టి చపలచిత్తను నమ్మి యక్రమములకుఁ గడఁగిన పాండవులు కలకాలము మనియెదరు కాఁబోలు?"

"ఆచార్యపుత్రా! మనుజులకు సుఖదుఃఖములు పర్యాయముగ వచ్చుచుండుట సహజము. మహాత్ములట్టిదాని కెన్నడును వగవరు. సోదరుల, చుట్టముల, మిత్రుల జంపుకొని నేనొంటరినై బ్రదుకుటకంటెఁ జచ్చుట మేలుకదా?"

"మిత్రమా! 'బ్రతికియుండిన శుభములఁ బడయవచ్చు' ననువచన మెఱుఁగవా? జీవవంతుఁడయినఁ గదా శాత్రవుల సంహరింపవచ్చును? ఆలాగున శత్రునాశము గావింపమి నిన్నును నిన్ననుసరించి మమ్మును దుఃఖసముద్రమున ముంచు చున్నది."

"చచ్చుటకుమున్న మిమ్ముఁ గనఁగల్గితి నదియే నాకుఁ బదివేలు."

"సుయోధనా! నీకట్టి శాంతి యుదయించునుగాక. నాక్రోధము సులభముగా నుపశమించునది గాదు. నాఁడు నాతండ్రిని జంపినపు డుదయించిన క్రోధాగ్ని మానసమునందే రగులుచుండెను. నేఁడు నిన్నీగతికిఁ దెచ్చుటచే నది జ్వలించి

చుట్టును వ్యాపించుచున్నది. ఇది యీ పాండవ కాననమును దహింపక యూరకుండజాలదు."

"నెచ్చెలీ! అభిమానధనుడని వాసిగాంచిన నాకు మాత్రము శత్రు సంహారము అనిష్టమగునదా? తొడలు విఱిగి నేలఁగూలి యాసన్న మరణసమయుఁడ నగుటచే ఏదియుఁ జేయలేక యూరకున్నాను."

"మిత్రమా! వినుము. నామాట లివి సత్యములని నమ్ముము. కృష్ణుఁడు చూచుచుండఁగనే పాంచాలాది బాంధవర్గముతో శత్రుసంహార మొనర్చెదను."

"గురుతనయా! నీవొనర్పఁబోవు శత్రుసంహార మేను జూచి యానందింపఁ గలుగుదునో లేనో? నీవిపుడు నాకు సర్వసైన్యాధిపతివి. ఇఁక నీ కార్యము నిర్వర్తింపుము."

అని యిటు సుయోధనుఁడు సర్వసైన్యాధిపత్యము నిచ్చినంతన యతని వీడ్కొని కృపకృతవర్మలతో నశ్వత్థామ యచటినుండి వెడలెను. క్రోధవశమున నశ్వత్థామ ఎచ్చట సాహసకార్యము లాచరించునో యని కృపాచార్యుఁడు సద్బోధ లొనర్చెనుగాని యవి యుపయోగశూన్యము లయ్యెను. వారిని వీడి యశ్వత్థామ శత్రుహననమునకై యొంటరిగా వెడలెను. పరమశివుఁడు ప్రత్యక్షము గాఁగఁ దన్నాతని కుపహారముగా నర్పింపఁ గడఁగెను. రుద్రుఁ డనుగ్రహించి ఖడ్గ మొండొసఁగి; పాంచాలురకుఁ గాల మాసన్నమగుటఁ దెల్పి వెడలిపోయెను. అశ్వత్థామ ఆ ఖడ్గమును బూని పాండవ శిబిరము జొచ్చెను.

అచ్చటి వారు నిశ్శేషముగా శత్రునాశమగుటచే గాఢనిద్రఁ జెందియుండిరి. ద్రోణపుత్త్రుఁడు నిద్రితుఁడగు దృష్టద్యుమ్నునిఁ దన్ని లేపెను. లేచి నిలువఁబడిన వానిఁ గ్రిందికిఁ ద్రోసెను. తన చరణమున వాని వక్షము నదిమిపట్టి మోమునఁ బిడికిటఁ బొడిచెను. కాలుసేతుల వానిఁ జదిపి చంపెను. ఉపపాండవులు దనపైకి రాఁగా వారిని సంహరించెను. శిఖండి యడ్డము రాఁగ నాతని జంపెను. తన్నెదిరింపవచ్చిన సైన్యమునెల్లఁ దునుమాడెను. పాండవులచ్చటలేమిని వారిని సంహరింప వీలుగామి కొంతియు వగచెను. అంతఁ గృపకృతవర్మలతోఁ గూడి సుయోధనుఁడు పడియుండు చోటికి వచ్చెను. తా వచ్చువంతదాఁక రాజరాజు మరణింపకుండుటకు సంతసించెను. సుయోధనునితోఁ దన విజయము సెప్పి యాతనికి మనస్తుష్టి గలిగించెను. కౌరవశ్రేష్ఠుఁ డనేకవిధముల నాతనిఁ బొగడెను. తన చావుకొఱకు వారల దుఃఖింపకుండ వలయునదనియు, నాలాగున వారు దుఃఖించినఁ దనయాత్మకు శాంతి గలుగనేరదనియుఁ జెప్పి సంతుష్టుఁడగుచు వీరస్వర్గ మలంకరించెను. గురుసుతుఁడు వీలయినంతవఱకు నింకను బాండవవధ గావింపఁ దీర్మానించుకొనెను, ఆవల ధర్మజుఁడు రాజ్యము నందెనుగాని బంధునాశమునఁ గలిగిన దుఃఖముతో నెట్లో రాజ్యపాలనము సేయుచుండెను.

సమాప్తము.